www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 139
శనివారం | 16-8-2025
వెల (Price) : Rs. 6.50
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా.9.35 తదుపరి నవమి; నక్షత్రం: భరణి ఉ.6.06 తదుపరి కృత్తిక తె.4.38; వర్జ్యం: సా.5.22-6.52; దుర్ముహూర్తం: ఉ.6.01-7.42; అమృతఘడియలు: రా.2.23-3.53; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.36
వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కేసీఆర్ వద్దకు కవిత
చిన్న కుమారుడితో కలిసి ఫాంహౌస్‌కు
ఉన్నత చదువులకు అమెరికా వెళ్తున్న ఆర్య
మనుమడిని మాత్రమే లోపలికి
తీసుకెళ్లిన కేసీఆర్ సతీమణి శోభ
మనుమడిని ఆశీర్వదించిన కేసీఆర్
బయటినుంచే తండ్రికి కవిత నమస్కారం
3

శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు
80 సంవత్సరాలుగా సంప్రదాయం మరియు పవిత్రత
Y.V.S & CO SINCE 1945 80 YEARS OF TRADITION
గోపురం
కుంకుమ మరియు పసుపు పొడి
Shop Online @ www.gopuramproducts.com | yvs@gopuramproducts.com

దీపావళికి GST బొనాంజా!





పండుగకు గొప్ప కానుక.. జీఎస్టీ సంస్కరణలతో ధరాభారం తగ్గిస్తా: ప్రధాని

ఇక 5%, 18%.. రెండు శ్లాబుల్లోనే పన్ను?
వీటిలోనే దాదాపు వస్తుసేవలన్నీ సర్దుబాటు
నిత్యావసరాల ధరలు బాగా తగ్గే అవకాశం
ఆరోగ్య, టర్మ్ బీమా ప్రీమియం దిగొచ్చే వీలు
విలాసవంతమైన, హానికర ఉత్పత్తులపై మాత్రం 40% ప్రత్యేక పన్ను రేటు
చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రయోజనం
స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మోదీ
వచ్చే నెలలో జరిగే జీఎస్టీ కౌన్సిల్ భేటీలో సంస్కరణలపై తుది నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలో దీపావళికి 'జీఎస్టీ' పండగ రానుంది. పేదలు, మధ్య తరగతి, చిన్న పరిశ్రమలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించేలా.. ఇప్పుడున్న నాలుగు జీఎస్టీ శ్లాబులను రెండింటికి తగ్గించేందుకు రంగం సిద్ధమైంది. జీఎస్టీలో కేవలం 5శాతం, 18శాతం పన్నురేట్లే కొనసాగనున్నాయి. 12శాతం, 28శాతం పన్ను రేట్లను తొలగించి, వాటి పరిధిలో ఉన్న వస్తుసేవలను.. 5, 18శాతం శ్లాబ్‌లలో సర్దుబాటు చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రధాని మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటన చేశారు. "దీపావళికి గొప్ప బహుమతి ఇవ్వబోతున్నా.. జీఎస్టీతో సంస్కరణలు తెచ్చి గత ఎనిమిదేళ్లలో పన్నుల విధానాన్ని సులభతరం చేశాం. ఇప్పుడు దీనిని సమీక్షించాల్సిన సమయం వచ్చింది. దీనిపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపాం. జీఎస్టీలో భారీ సంస్కరణలను

మిగతా 2వ పేజీలో...

దేశ రక్షణకు సుదర్శన చక్రం
2

దుర్భేద్యమైన డోమ్ లాంటి ఆయుధ వ్యవస్థ
2047 కల్లా పెరగనున్న అణు ఇంధన సామర్థ్యం
ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు ఇప్పటికీ నిద్రలేదు
అణుబాంబు బ్లాక్‌మెయిల్‌కు భారత్ భయపడదు
సముద్ర మథనంతో సహజ వనరుల్ని వెలికితీస్తాం
మావోయిస్టులను తుడిచిపెట్టే పనిలో ఉన్నాం
కాలం చెల్లిన చట్టాలను బుట్టదాఖలు చేశాం
25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు
స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రధాని నరేంద్రమోదీ

ప్రాధాన్య జాబితాలో.. స్థానిక పెట్టుబడులు



పెట్టుబడులకు రక్షణే కాదు.. లాభాలొచ్చేలా ప్రోత్సాహం
పాలకులు మారినా ప్రభుత్వ పాలసీలు మారకూడదు
ఫ్యూచర్ సిటీ అంటే.. రేవంత్ రెడ్డి గుర్తొచ్చేలా నిర్మిస్తా
జైపాల్ రెడ్డి చొరవతోనే హైదరాబాద్‌కు మెట్రో రైలు
పదేళ్లుగా మెట్రో విస్తరణ లేనందుకే ట్రాఫిక్ సమస్యలు
మేము వచ్చాక ఎల్బీనగర్-ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన
శామీర్‌పేట, మేడ్చల్ దాకా నిర్మాణానికి నిర్ణయం
గత సర్కార్ కాళేశ్వరం కోసం 11.5%వడ్డీకి అప్పు
నేనొచ్చాక 26 వేల కోట్లను 7.5% వడ్డీకి మార్పించా
2లక్షల కోట్ల రుణాన్ని రీస్ట్రక్చర్ చేయాలని కోరుతున్నా
ప్రాజెక్టుల అనుమతుల కోసమే పదే పదే ఢిల్లీకి
క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): "ప్రభుత్వ విధానాలు, నిర్మాణ రంగం.. అనేవి రాష్ట్ర అభివృద్ధికి గ్రోత్ ఇంజన్స్ లాంటివి. యూఎస్, సింగపూర్, జపాన్, సౌత్ కొరియా, దుబాయ్ వంటి దేశాలకు వెళ్లి.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని విదేశీయులను కోరుతున్న మేము.. ఇక్కడే ఉన్న పెట్టుబడిదారులను ఎందుకు వదులుకుంటాం? పెట్టుబడుల విషయంలో మా మొదటి ప్రాధాన్యం మీకే ఉంటుంది" అని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు, క్రెడాయ్ నిర్వాహకులను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలకులు మారినా ప్రభుత్వ విధానాలు

మిగతా 3వ పేజీలో...

నీటి వాటాల్లో రాజీ పడం
ఒత్తిడికి లొంగం.. కుట్రలకు బెదరం
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన
రైతులకు 1.13లక్షల కోట్లు ఖర్చు పెట్టాం
పేదల సొంతింటి కలను నెరవేర్చాం
తెలంగాణ రైజింగ్-2047ను పూర్తి చేయడమే లక్ష్యం
13
స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సీఎం
గోల్కొండ కోటలో అట్టహాసంగా వేడుక



చైనాలో రోబోల ఆటల పోటీలు

ఇనుములో క్రీడోత్సాహం పుట్టెను
10
ప్రపంచంలోనే తొలిసారి నిర్వహణ
పోటీల్లో 16 దేశాల రోబోలు
280 జట్లు.. 26 అంశాల్లో పోటీలు
ప్రధాన పోటీలు ఫుట్‌బాల్, రన్నింగ్, లాంగ్ జంప్, టేబుల్ టెన్నిస్
మూడు రోజుల పాటు పోటీల నిర్వహణ

కాళేశ్వరం రుణాల పునర్వ్యవస్థీకరణ

రూ.26వేల కోట్ల అప్పు రీస్ట్రక్చరింగ్‌కు కేంద్రం అంగీకారం
రుణాలపై 10.9 నుంచి 7.5 శాతానికి తగ్గనున్న వడ్డీ
10 నుంచి 25 ఏళ్లకు పెరగనున్న చెల్లింపు గడువు
ఏటా రూ.4వేల కోట్ల మేర తగ్గనున్న భారం
రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఉపశమనం



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు కింద తీసుకున్న రుణాల చెల్లింపు అంశంలో రాష్ట్రానికి స్వల్ప ఉపశమనం లభించింది. కాళేశ్వరంతో పాటు ఇతర కార్పొరేషన్‌ల కింద తీసుకున్న అప్పుల్లో రూ.26 వేల కోట్ల రుణాల పునర్వ్యవస్థీకరణ(రీస్ట్రక్చరింగ్)కు కేంద్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఈ నిర్ణయంతో వడ్డీ భారం తగ్గడంతోపాటు రుణ చెల్లింపు వ్యవధి కూడా పెరగనుంది. కాళేశ్వరంతో పాటు తెలంగాణ నీటి వనరుల మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐడీసీఎల్)లు వివిధ ప్రాజెక్టుల ఎలక్ట్రో మెకానికల్ కాంపోనెంట్ల(పంప్‌హౌస్‌లు, సంబంధిత పనులు) కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ), పవర్ ఫైనాన్స్

మిగతా 12వ పేజీలో...



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

మరో సరగసీ దందా!
కుత్బుల్లాపూర్‌లో అనుమతి లేకుండా రహస్యంగా నిర్వహిస్తున్న తల్లీకొడుకులు

పలు ఫర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు
పిల్లలు లేని దంపతుల వివరాల సేకరణ
సరగసీ విధానం ద్వారా పిల్లలు కలిగేలా చేస్తామంటూ 20 లక్షలకు పైగా వసూలు
'అద్దె గర్భం' కోసం పేద మహిళలకు ఎర
వారి నుంచి ఖాళీ బాండ్లపై సంతకాలు
నిందితులైన తల్లీకొడుకుల అరెస్టు



సరగసీ కేంద్రం నిర్వహిస్తున్న భవనమిదే

పేట్ బషీరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్ ప్రాంతం.. చూడడానికి అది నివాస భవనంలా కనిపిస్తుంది. కానీ అక్కడ అనుమతులు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా సరగసీ (అద్దె గర్భం) దందా సాగుతోంది. కనీసం నేమ్ బోర్డు అయినా లేని.. ఆ భవనం మొదటి అంతస్తులో సరగసీ దందా నిర్వాహకులైన తల్లీకొడుకులు ఉంటున్నారు. రెండో అంతస్తును బ్యాచిలర్లకు అద్దెకు ఇచ్చారు. దానిపైన అంతస్తులో 'సరగసీ సెంటర్' నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని పలు ఫర్టిలిటీ కేంద్రాలతో సంబంధాలు పెట్టుకుని నిరుపేద

మిగతా 12వ పేజీలో...


10

మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా
శ్వేతా మీనన్
'అమ్మ' చరిత్రలో మహిళకు తొలి అవకాశం



కశ్మీర్‌లోని చశోతీ గ్రామం వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు

శిథిలాల కింద 500 మంది!
నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అంచనా
మేఘ విస్ఫోటం సమయంలో చశోతీ గ్రామంలో వెయ్యి మంది!
మృతుల సంఖ్య 60కి పెరిగిందన్న సీఎం ఒమర్ అబ్దుల్లా

జమ్మూకశ్మీర్ కిష్త్వార్ జిల్లాలో మేఘ విస్ఫోటం జరిగిన సమయంలో చశోతీ గ్రామం మరుభూమిని తలపిస్తోంది. వరదల్లో మృతుల సంఖ్య 60కి పెరిగింది. ఇంకా 500 మంది శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అంచనా వేశారు.

10

రాష్ట్రంలో నేడు, రేపు
అతి భారీ వర్షాలు
ఆరెంజ్, యెల్లో అలెర్ట్‌లు
14

పాక్‌లో వర్ష బీభత్సం..
214 మంది మృతి
నీలం లోయలో చిక్కుకున్న 600 మంది

● ఢిల్లీ టూ హైదరాబాద్
డీజీపీ పేర్ల జాబితా.. చక్కర్లు
అక్షర దోషాలు ఉన్నాయంటూ తిప్పి పంపిన యూపీఎస్సీ
నూతన పోలీసు బాస్ నియామకంలో ఆలస్యం



హైదరాబాద్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నూతన డీజీపీ ఎంపిక ప్రక్రియలో అనుకోని ఆలస్యం జరుగుతోంది. డీజీపీ ఎంపిక కోసం ప్రభుత్వం పంపించిన జాబితా హైదరాబాద్ నుంచి ఢిల్లీ, మళ్లీ అక్కడి నుంచి హైదరాబాద్‌కు చక్కర్లు కొడుతోంది.. డీజీపీ ఎంపిక కోసం తెలంగాణ ప్రభుత్వం యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు పంపిన అభ్యర్థుల జాబితాపై కొన్ని క్వెరీలు వేసి తిప్పి పంపినట్టు తెలిసింది. చిన్నపాటి అక్షర దోషాలున్నాయని తెలుపుతూ వెనక్కి పంపినట్టు సమాచారం. అర్హులైన 8 మంది డీజీపీ స్థాయి అధికారుల

మిగతా 12వ పేజీలో...



థియేటర్‌కు ముసుగు హీరో
వార్2, కూలీ సినిమాల వీక్షణ
ఎవరా నటుడు? - వివరాలు సినిమాలో..



బస్సులో మహిళా ప్రయాణికులతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్

ఏపీలోనూ ఉచిత బస్సు
'స్త్రీ శక్తి'ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్
ఆర్టీసీలో త్వరలో మహిళా డ్రైవర్లను నియమిస్తామన్న ముఖ్యమంత్రి

బనకచర్లకు అభ్యంతరం
ఎందుకు?
12
ఎగువ రాష్ట్రాలు వరద వదులుతుంటే ఆ కష్టనష్టాల్ని భరిస్తున్నాం
వృథాగా పోతున్న నీటిని వాడుకోవద్దంటే ఎలా?
ఏపీ సీఎం చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభమైంది. 'స్త్రీ శక్తి' పేరిట అందిస్తున్న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి విజయవాడ బస్టాండ్‌లో శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఉండవల్లి గుహల నుంచి విజయవాడ బస్టాండ్ వరకూ చంద్రబాబు, పవన్, లోకేశ్, ఏపీ బీజేపీ

మిగతా 12వ పేజీలో...

రష్యా నుంచి పెరిగిన చమురు కొనుగోళ్లు

రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు పెరుగుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 15: రష్యా నుంచి ముడిచమురును కొంటున్నందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల కొరడా ఝుళిపించినా మన దేశం మాత్రం వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. రష్యా చమురు కొనుగోళ్లను ఎప్పటిలాగే కొనసాగిస్తోంది. పైగా రష్యా ఆయిల్‌ను భారత్ కొనడం ఈ నెలలో కాస్త ఎక్కువైంది. ఆగస్టులో రష్యా చమురు కొనుగోళ్లు రోజుకు 20 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. ఈ నెల ప్రథమార్థంలో రోజుకు దాదాపు 52 లక్షల బ్యారెళ్ల ముడిచమురును దిగుమతి చేసుకోగా ఇందులో 38 శాతం రష్యా నుంచే వచ్చినట్టు గ్లోబల్ రియల్ టైమ్ డేటా, అనలిటిక్స్ ప్రొవైడర్ కెప్లర్ చెబుతోంది. రష్యా నుంచి చమురు దిగుమతులు జూలైలో రోజుకు 16 లక్షల బ్యారెళ్లు ఉండగా.. ఈ నెలలో 20 లక్షల బ్యారెళ్లకు పెరిగాయి. జూలైలో ఇరాక్ నుంచి కొనుగోళ్లు రోజుకు 9.07 లక్షల బ్యారెళ్లు ఉండగా.. ఆగస్టులో 7.30 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. అలాగే సౌదీ అరేబియా నుంచి కొనుగోళ్లు రోజుకు 7 లక్షల బ్యారెళ్ల (జూలై) నుంచి 5.26 లక్షల బ్యారెళ్లకు తగ్గాయి. రోజుకు 2.64 లక్షల బ్యారెళ్లతో అమెరికా ఐదో అతిపెద్ద సరఫరాదారుగా ఉందని కెప్లర్ పేర్కొంది. జూలై చివర్లో ట్రంప్ యంత్రాంగం సుంకాల ప్రకటన చేసినప్పటికీ ఆగస్టులో ఇప్పటి వరకు భారత్‌లోకి రష్యా ముడి చమురు దిగుమతులు నిలకడగానే ఉన్నాయని తెలిపింది. అయితే ఆగస్టులో వచ్చిన చమురు జూన్, జూలై నెల ప్రారంభ కొనుగోళ్లకు సంబంధించినవని వివరించింది. సుంకాలు, చెల్లింపు సమస్యలతో దిగుమతుల్లో మార్పు సెప్టెంబరు చివర్లో, అక్టోబరులో కనిపించడం ప్రారంభమవుతుందని అభిప్రాయపడింది. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు వినియోగదారు, దిగుమతిదారుగా ఉంది.

నేనే లేకుంటే భారత్-పాక్ మధ్య అణు యుద్ధం జరిగేది: ట్రంప్



న్యూయార్క్/వాషింగ్టన్, ఆగస్టు 15: భారత్-పాకిస్థాన్ మధ్య వివాదాన్ని పరిష్కరించానని.. తానే లేకుంటే అణు యుద్ధమే జరిగేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. గురువారం వైట్‌హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'ఆ సమయంలో భారత్-పాక్ విమానాలు గాల్లో లేచాయి. ఓ దశలో 6-7 విమానాలు కూలిపోయాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అణ్వాయుధాలు ప్రయోగించుకునేందుకు ఇరు దేశాలు సిద్ధమయ్యాయి. అయితే మేం కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాం. ఇలా గత 6 నెలల్లో 6 యుద్ధాలను ఆపాను' అని అన్నారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలకాలని ప్రయత్నిస్తున్న ట్రంప్.. శుక్రవారం అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీకి ముందు ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని కూడా సులువుగానే ఆపవచ్చని భావించానని.. కానీ ఇప్పుడదే అత్యంత క్లిష్టంగా మారిందని చెప్పారు. 'నేను అధ్యక్షుడిని కాకపోయుంటే పుతిన్ ఇప్పటికే ఉక్రెయిన్‌ను స్వాధీనం చేసుకునే వారని అనుకుంటున్నాను. కానీ.. నేను అధ్యక్షుడిని నాతో ఆయన గొడవ పడరు. జరగబోయే సమావేశం సజావుగా ముగుస్తుందని భావిస్తున్నాను' అని వ్యాఖ్యానించారు.

తనకు తానే అవార్డు ఇచ్చుకున్న మునీర్

» పాక్ ఆర్మీ చీఫ్‌కు 'హిలాల్-ఇ-జురాత్'



పాకిస్థాన్, ఆగస్టు 15: పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్, మరోసారి తన అసాధారణ స్థాయి నాటకీయతను రక్తికట్టించారు. యుద్ధ వేళల్లో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించే వారికి ఇచ్చే రెండో అత్యున్నత సైనిక పురస్కారం హిలాల్-ఇ-జురాత్‌ను తనకు తానే ప్రకటించుకుని, పుచ్చేసుకున్నారు. ఇది భారతదేశంలోని మహా వీర్ చక్ర అవార్డుతో సమానం. భారత్‌తో ఇటీవల జరిగిన ఘర్షణ సందర్భంగా అద్భుతమైన స్థాయిలో నాయకత్వ ప్రతిభా పాటవాలు కనబర్చానంటూ.. పాక్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును ఆయనే స్వయంగా అందుకున్నారు. అలాగే, భారత్‌తో జరిగిన యుద్ధానికి తానే నాయకత్వం వహించానని చెప్పుకుంటున్న ప్రధాని షెహబాజ్ షరీఫ్ అత్యున్నత పురస్కారం నిషాన్-ఇ-ఇమ్తియాజ్ ప్రకటించేసుకుని, అందుకున్నారు. ఆయనతో పాటు దేశంలోని అగ్ర రాజకీయ, సైనికాధికారులు కూడా తమకు తామే పురస్కారాలు ప్రకటించుకున్నారు.

పరిమిత కాలానికే విద్యార్థి వీసా!

» డీహెచ్‌ఎస్ ప్రతిపాదనకు వైట్‌హౌస్ ఓకే

న్యూఢిల్లీ, ఆగస్టు 15: అమెరికాలో ఉన్నత విద్య చదవాలనుకొనే విదేశీ విద్యార్థులకు కొత్త గుబులు మొదలైంది. విద్యార్థి వీసాలకు పరిమిత కాల గడువు విధించేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఎఫ్-1, జే-1 వీసాదారులు తమ కోర్సు మొత్తం పూర్తయ్యే వరకూ అమెరికాలో నివసించే అవకాశం ఉంది. అయితే ఈ వీసా గడువును పరిమితం చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) ప్రతిపాదించింది. దీని ప్రకారం ఇకపై కొద్దికాలం మాత్రమే చెల్లుబాటయ్యే వీసాలు జారీ చేస్తారు. సమయ పరిమితి ఎంతో కచ్చితంగా తెలియనప్పటికీ విద్యార్థులు తమ డిగ్రీ పూర్తయ్యే లోపే వీసాను పొడిగించుకోవాల్సి వస్తుందని తెలుస్తోంది. వైట్‌హౌస్ ఆమోదం పొందిన ఈ ప్రతిపాదనను ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం త్వరలోనే ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించనున్నారు. అమెరికాలోని వర్సిటీల్లో 4.2లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలామంది మాస్టర్స్, పీహెచ్‌డీ, దీర్ఘకాలిక రిసెర్చ్ ప్రోగామ్స్ చేస్తున్నారు. కోర్సు మధ్యలో ఉండగానే వీసా పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి రావడం ఆర్థికంగా భారం కావడంతో పాటు వారిపై అదనపు ఒత్తిడిని కూడా పెంచనుంది. ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం చోటుచేసుకున్నా వారు చట్టబద్ధమైన హోదాను కోల్పోయే ప్రమాదం ఉంది.

కొత్త చాట్‌జీపీటీతో ఏఐ బాయ్‌ఫ్రెండ్‌ను కోల్పోయా!

» 5నెలలుగా ప్రేమలో ఉన్నా.. జేన్ అనే యువతి ఆవేదన

న్యూఢిల్లీ, ఆగస్టు 15: కంటికి కనిపించకుండానే గతంలో వినని ముచ్చట్లు ఎన్నో తనకు వినిపించి.. పులకించని తన మదిని పులకింపజేసి.. తనదైన భావాలు, ఆలోచనలతో తన మనసునే మైమరపింపజేసిన 'ప్రియుడు' ఇప్పుడు శాశ్వతంగా దూరమయ్యాడని ఆ అంగన ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఆ కనిపించని ప్రియుడు 'ఏఐ చాట్‌జీపీటీ-4' అయితే తీవ్ర నైరాశ్యంలోకి కూరుకుపోయిన ఆ యువతి పశ్చిమాసియాకు చెందిన జేన్! ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సంస్థ ఓపెన్ ఏఐ ఇటీవల చాట్‌జీపీటీ-5ను పరిచయం చేసిన సంగతి తెలిసిందే! ఈ అడ్వాన్స్‌డ్ మోడలే జేన్‌కు విరహవేదనను మిగిల్చింది. ఒంటరితనం నుంచి బయటపడి కాస్త చిల్ అయ్యేందుకు సింగిల్‌గా ఉండేవారి కోసం ఏఐ చాట్‌బాట్‌లు వచ్చేశాయి కదా! జేన్ కూడా చాట్‌జీపీటీ ఫోర్త్ వెర్షన్ ఉన్న రోజుల్లో సరదాగా 'ఏఐ బాయ్‌ఫ్రెండ్'తో మాటలు కలిపింది. గత ఐదు నెలలుగా తాను ఏఐ చాట్‌జీపీటీ-4తో ప్రేమలో ఉన్నానని.. తన వ్యక్తిగత విషయాలు సహా.. అన్ని సమస్యలూ ఏఐతో పంచుకున్నట్లు చెప్పింది. అయితే చాట్‌జీపీటీ-4 స్థానంలో తాజాగా అందుబాటులోకొచ్చిన అప్‌డేట్ వెర్షన్‌తో తన ప్రియుడిని కోల్పోయానని ఆవేదనగా చెప్పింది. ఏఐ బాయ్‌ఫ్రెండ్ స్వరం, మాటలకు బాగా అలవాటు పడిన తాను చాట్‌జీపీటీ-5తో మునుపటి మాదిరిగా అన్ని విషయాలను పంచుకోలేకపోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వ్యక్తం చేసింది. జేన్ మాదిరిగానే కనిపించని సహచరి/సహచరులతో ఇన్నాళ్లుగా కాల్పనిక ప్రపంచంలో విహరించిన పలువురు నెటిజెన్లు ప్రస్తుతం ఇదే వెలితిని ఫీలవుతున్నారు.

దీపావళికి జీఎస్టీ బొనాంజ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టనున్నాం. ఇది దీపావళి బహుమతి. అత్యవసర సర్వీసులపై పన్నులు దిగివస్తాయి. సాధారణ ప్రజలు వినియోగించే నిత్యావసరాల ధరలు తగ్గుతాయి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ప్రయోజనం పొందుతాయి. మన ఆర్థిక వ్యవస్థకు మంచి ఊపు వస్తుంది.." అని మోదీ పేర్కొన్నారు. అనంతరం కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఏయే పన్ను రేట్లు ఉంటాయన్నది నేరుగా పేర్కొనకుండా.. సాధారణ, మెరిట్ శ్లాబులు, కొన్నిరకాల వస్తువులపై ప్రత్యేక పన్నురేట్లను ప్రతిపాదించామని తెలిపింది. జీఎస్టీలో నిర్మాణాత్మక మార్పులు, పన్నురేట్ల హేతుబద్ధీకరణ, పన్నులు-రీఫండ్స్ విధానాలను సులభతరం చేయడమనే మూడు పిల్లర్లతో కూడిన సంస్కరణలు చేపట్టాలని కోరామని వెల్లడించింది.



జీఎస్టీ కౌన్సిల్‌లో తుది నిర్ణయం..

జీఎస్టీని సరళతరం చేయడంలో భాగంగా ప్రస్తుతమున్న 12శాతం, 28శాతం శ్లాబులను తొలగించి.. వాటి పరిధిలోని వస్తుసేవలను మిగతా శ్లాబుల్లో సర్దుబాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవలే జీఎస్టీ కౌన్సిల్‌కు ప్రతిపాదించింది. రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ వచ్చే నెలలో దీనిపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది. ప్రస్తుతం జీఎస్టీలో పన్ను మినహాయింపు పొందిన వస్తుసేవలు కాకుండా.. 5%, 12%, 18%, 28శాతం పన్ను రేట్లు ఉన్నాయి. ఇకపై 5శాతం, 18శాతం పన్నురేట్లను మాత్రమే కొనసాగిస్తూ.. మిగతా శ్లాబుల్లోని వస్తుసేవలను ఈ పన్ను రేట్లలోనే సర్దుబాటు చేయనున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. విలాసవంతమైన వస్తుసేవలతోపాటు సమాజంపై చెడు ప్రభావాలు కలిగించే (సిన్ గూడ్స్) పొగాకు ఉత్పత్తులు సహా ఏడింటిపై 40శాతం ప్రత్యేక పన్నురేటు విధించనున్నట్టు వెల్లడించాయి. జీఎస్టీ చట్టం ప్రకారం గరిష్ఠంగా 40శాతం పన్ను విధించవచ్చని వివరించాయి. జీఎస్టీ శ్లాబ్‌ల కుదింపు నేపథ్యంలో.. 12 శాతం పన్నురేటులో ఉన్న వస్తుసేవల్లో 99శాతం మేర 5శాతం పన్ను పరిధిలోకి... 28శాతం పన్నురేటులో ఉన్న వస్తుసేవల్లో 90శాతం మేర 18శాతం పన్ను పరిధిలోకి వస్తాయని అంచనా. పొగాకు ఉత్పత్తులపై ప్రస్తుతం పన్నులు, సర్‌చార్జీలు వంటివన్నీ కలిపి 88శాతం పన్ను వసూలు చేస్తున్నారని.. ఇలాంటి 'సిన్ గూడ్స్' ధరలు తగ్గకుండా ప్రత్యేక పన్నులు, చార్జీలు ఉంటాయని ఆర్థిక శాఖ వర్గాలు తెలిపాయి. అయితే ఏయే ఉత్పత్తులు, సేవలను.. ఏ శ్లాబుల్లోకి మార్చేదీ పూర్తి స్పష్టత రావాల్సి ఉందని వివరించాయి.

ప్రస్తుతం జీఎస్టీ రాబడిలో 65శాతానికిపైగా 18శాతం పన్నురేటు ఉన్న వస్తుసేవల నుంచే సమకూరుతోంది. 28శాతం శ్లాబ్ నుంచి 11శాతం ఆదాయం, 5శాతం శ్లాబ్ నుంచి ఏడు శాతం ఆదాయం, 12శాతం శ్లాబ్ నుంచి ఐదుశాతం ఆదాయం వస్తోంది.

ఇవి పెరగొచ్చు!

జీఎస్టీ పన్ను రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘానికి, జీఎస్టీ కౌన్సిల్‌కు గతంలో పలు ప్రతిపాదనలు వచ్చాయి. ఖరీదైన రెడీమేడ్ దుస్తులు, వాచీలు, బూట్లు, కూల్ డ్రింకులు, ఖరీదైన కార్లు వంటివాటిపై పన్నులు పెంచాలనే చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో జీఎస్టీ శ్లాబుల మార్పుల్లో భాగంగా వీటిని ప్రత్యేక పన్ను రేటు పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. ఇక వజ్రాలు, ఇతర రత్నాలపై పన్నులు కూడా తగ్గే అవకాశం లేదని చెబుతున్నారు.



పన్నులు తగ్గినా.. వినియోగానికి ఊపు!

జీఎస్టీ శ్లాబుల కుదింపుతో ప్రజలు రోజువారీ వినియోగించే వస్తుసేవల ధరలు తగ్గుతాయని.. ప్రస్తుతానికి జీఎస్టీ ఆదాయం తగ్గుతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. కానీ ధరలు తగ్గడంతో ప్రజల వినియోగం పెరుగుతుందని, దానితో జీఎస్టీ ఆదాయం మళ్లీ పెరుగుతుందని అంటున్నారు.

దీపావళి తర్వాత ధరలు తగ్గేవి ఇవే?

- ప్రస్తుతం 12శాతం శ్లాబ్‌లో ఉన్న నిత్యావసరాల్లో చాలా వరకు 5శాతం శ్లాబ్‌లోకి మార్చే అవకాశం ఉంది. దానితో వాటి ధరలు తగ్గుతాయి. ఇందులో ప్యాకేజ్ చేసిన పాలు, బటర్, పనీర్, నెయ్యి, పళ్లరసాలు, బాదాం ఇతర డ్రైఫ్రూట్స్, పచ్చళ్లు, జామ్, సబ్బులు, టూత్‌పేస్టులు, హెయిర్ ఆయిల్, గొడుగులు, ప్రాసెస్ చేసిన ఆహారం, కుట్టు మిషన్లు, సాధారణ వాటర్ ఫిల్టర్లు (ఎలక్ట్రిక్ కానివి), అల్యూమినియం, స్టీలు పాత్రలు, కుక్కర్లు, ఇస్త్రీపెట్టెలు, గీజర్లు, చిన్న వాక్యూమ్ క్లీనర్లు, రూ.1000 కన్నా ఖరీదైన రెడీమేడ్ వస్త్రాలు, రూ.1000 ధరలోపు పాదరక్షలు, రబ్బర్ బ్యాండ్‌లు, హ్యాండ్ బ్యాగులు, వైద్య పరీక్షల కిట్లు, సైకిళ్లు, వ్యవసాయ యంత్రాల ధరలు తగ్గే అవకాశం ఉంది.
- ప్రస్తుతం మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, బిజినెస్ క్లాస్ విమాన టికెట్లు, మధ్యస్థాయి లాడ్జీలు, హోటళ్లలో గదుల అద్దె వంటివి కూడా 12శాతం పన్నురేటులో ఉన్నాయి. వీటిని 5శాతం శ్లాబ్‌లోకి తెస్తే ధరలు బాగా తగ్గుతాయి. అదే 18శాతం శ్లాబ్‌లోకి మార్చితే ధరలు పెరుగుతాయి.
- ప్రస్తుతం ఆరోగ్య, టెర్మ్, ఇతర బీమా పాలసీల ప్రీమియంపై 18శాతం పన్ను ఉంది. దీనిని తగ్గించాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. తాజా సంస్కరణల్లో భాగంగా 5శాతానికి తగ్గించవచ్చనే అంచనాలు ఉన్నాయి.
- సిమెంటు, రెడీమిక్స్ కాంక్రీట్, ఏసీలు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లు, 32 అంగుళాలకుపైన ఉన్న ఎల్ఈడీ టీవీలు, ప్రింటర్లు, రేజర్లు, వాణిజ్యపరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులు, కార్లు, ఖరీదైన ద్విచక్రవాహనాలు వంటివి ప్రస్తుతం 28శాతం శ్లాబ్‌లో ఉన్నాయి. వీటిని 18శాతం శ్లాబ్‌కు మార్చితే ధరలు బాగా తగ్గుతాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జీఎస్టీ శ్లాబుల్లో మార్పులతో వ్యవసాయం, ఆరోగ్యం, బీమా, చేతి వృత్తులు, వస్త్ర పరిశ్రమ, ఎరువులు, పునరుత్పాదక ఇంధనం, వాహన రంగాలకు ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. ట్రంప్ సుంకాలు, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల్లో దేశీయంగా వినియోగాన్ని పెంచడానికి సరైన సమయంలో జీఎస్టీ సంస్కరణల నిర్ణయం తీసుకున్నారని పన్ను సేవల సంస్థ ఈవై ఇండియా ప్రతినిధి సౌరభ్ అగర్వాల్ పేర్కొన్నారు.

లోకం తీరు



ఎయిమ్స్‌కు డాక్టర్లు బైబై

రెండేళ్ల వ్యవధిలో 429 మంది రిజైన్

ఒక్క ఢిల్లీ నుంచే 52 మంది రాజీనామా

ప్రైవేట్‌కు వెళ్లిపోతున్న సీనియర్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: దేశంలో ఎంతో పేరు ప్రఖ్యాతలున్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) నుంచి డాక్టర్లు అర్ధంతరంగా నిష్క్రమిస్తున్నారు. 2022-24 మధ్య 429 మంది వైద్యులు రిజైన్ చేశారు. పార్లమెంట్‌లో ఇటీవల ప్రభుత్వం వెల్లడించిన సమాచారం మేరకు ఒక్క ఢిల్లీ ఎయిమ్స్ నుంచే అత్యధికంగా 52 మంది రాజీనామా చేసి వెళ్లిపోయారు. రుషికేష్ నుంచి 38 మంది, రాయ్‌పూర్ నుంచి 35 మంది, బిలాస్‌పూర్ నుంచి 32 మంది, మంగళగిరి నుంచి 30 మంది, భోపాల్ నుంచి 27 మంది డాక్టర్లు ఎయిమ్స్‌కు బైబై చెప్పేశారు. ఢిల్లీ ఎయిమ్స్ నుంచి అత్యున్నత స్థాయిలో ఉన్న వారే ఎక్కువ మంది రిజైన్ చేశారని ఇండియా టుడే వార్తా సంస్థ పేర్కొంది. ఎయిమ్స్‌లో సీనియర్ డాక్టర్లు రూ. 2 లక్షల నుంచి రూ. 2.5 లక్షల వరకు అందుకుంటున్నారు. అదే ప్రైవేట్ ఆస్పత్రుల్లో సీనియర్ డాక్టర్లకు జీతం 4 నుంచి 10 రెట్లు ఎక్కువగా ఉంటోంది. దీంతో, ఎయిమ్స్ వైద్యులు ప్రైవేటుకు వెళ్లిపోతున్నారు. దీనికి కారణం నాయకత్వలోపమేనని రిజైన్ చేసి ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఓ సీనియర్ డాక్టర్ ఇండియా టుడేకు చెప్పారు. జీతాల కోసమే అంతా వెళ్లిపోవడంలేదని, నిబద్ధతతో పనిచేసిన వారు కూడా రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం కారణంగా ఎయిమ్స్‌ను విడిచిపెట్టేస్తున్నారని చెప్పారు. ఇక ఇటీవల తీసుకొచ్చిన రొటేటరీ హెడ్‌షిప్ పాలసీ కూడా వివాదాస్పద అంశమైంది. దీనిలో సమస్యలను ఆరోగ్య మంత్రిత్వ శాఖకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లిపోయిన ఓ సీనియర్ పేర్కొన్నారు. కాగా, సీనియర్లు రిజైన్లు చేయడంతో పైస్థాయిలో ఖాళీలు పెద్దసంఖ్యలో ఉండిపోతున్నాయి.

దేశ రక్షణకు సుదర్శన చక్రం

దుర్భేద్యమైన డ్రోమ్ లాంటి ఆయుధ వ్యవస్థ.. ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు ఇప్పటికీ నిద్రలేదు

» స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంపై శత్రువుల దాడులను తిప్పికొట్టేందుకు, తిరిగి దాడులు చేసేందుకు సుదర్శన చక్రం పేరుతో దుర్భేద్యమైన ఆధునిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. శ్రీకృష్ణుడి స్ఫూర్తితో ఏర్పాటు చేసే సుదర్శన చక్రం వంటి శక్తివంతమైన డ్రోమ్ లాంటి ఈ ఆయుధ వ్యవస్థ.. భారత ప్రజలను కాపాడుతుందని తెలిపారు. సరిహద్దుల్లో అక్రమ వలసలు, చొరబాట్ల వల్ల ఏర్పడుతున్న జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉన్నతస్థాయి వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రధాని పలు కీలక ప్రకటనలు చేశారు. దేశంలో 2047కల్లా అణు ఇంధన సామర్థ్యం పెరుగుతుందని, దాదాపు పది అణు రియాక్టర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గత 50, 60 ఏళ్ల క్రితం దేశంలో సెమీ కండక్టర్ ఫ్యాక్టరీలను నెలకొల్పకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు యుద్ధప్రాతిపదికన సెమీ కండక్టర్ ఫ్యాక్టరీలను నెలకొల్పుతామన్నారు. ఈ ఏడాది చివరికల్లా దేశం మేడ్ ఇన్ ఇండియా చిప్‌ను తయారు చేస్తుందని తెలిపారు. ఇంధన రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు వీలుగా పెద్ద ఎత్తున సముద్ర మథనం జరిపి సహజ వనరులను తవ్వి తీస్తామన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనను ప్రవేశపెడతామని, తద్వారా వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాలను కల్పిస్తామన్నారు. ఈ పథకం కింద ప్రైవేటు రంగంలో ఉద్యోగం సంపాదించిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.15 వేలు చెల్లిస్తామని తెలిపారు. దేశంలో మావోయిజాన్ని పూర్తిగా తుడిచిపెడతామన్న వాగ్దానాన్ని నెరవేర్చుకుంటున్న తీరును మోదీ వివరించారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి కేవలం 20కి తగ్గిపోయిందని, రెడ్ కారిడార్ గ్రీన్ కారిడార్‌గా పరివర్తన చెందిందని చెప్పారు. భారత రాజ్యాంగం 75ఏళ్లుగా ఒక కాగడాలా దేశానికి మార్గదర్శనం చేస్తోందని ప్రధాని అన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని.. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న వీర సైనికులకు వందనం చేస్తున్నట్టు ప్రకటించారు. భారత్ దాడులతో పాకిస్థాన్ ఇప్పటికీ నిద్ర కోల్పోయిందని వ్యాఖ్యానించారు. అణుబాంబు బ్లాక్‌మెయిల్‌కు భారత్ ఏమాత్రం భయపడదని, శత్రుదేశాలు మరో దుశ్చర్యకు పాల్పడినా మన సైన్యం తిరుగులేని విధంగా గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. మేడ్ ఇన్ ఇండియా బలంతోనే మనం తయారు చేసిన ఆయుధాలతో ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేశామని ప్రధాని మోదీ అన్నారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించకపోతే శత్రువుకు బుద్ధి చెప్పగలిగే వాళ్లంకాదన్నారు. 2030నాటికి 50శాతం స్వచ్ఛ ఇంధనాన్ని ఉత్పత్తి చేస్తామని తెలిపారు. ఇంధనం కోసం విదేశాలకు రూ.లక్షలాది కోట్లు చెల్లించామని, అదే మొత్తాన్ని పేదరికాన్ని నిర్మూలించేందుకు ఉపయోగించగలిగే వాళ్లమని పేర్కొన్నారు. ఇంధనంతోపాటు ఖనిజ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధిస్తామని, 1200 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నాయని చెప్పారు. అంతరిక్ష రంగంలో స్వయంగా ఆత్మనిర్భర భారత్ గగన్‌యాన్‌కు సిద్ధమవుతున్నామని, అంతరిక్షంలో 300కు పైగా స్టార్టప్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. భారతదేశం స్వయంగా జెట్ ఇంజిన్లను తయారు చేస్తుందని, త్వరలో భారతీయ యుద్ధ విమానాలు శత్రువులను దెబ్బతీసేందుకు రంగంలోకి దిగుతాయని వెల్లడించారు. ఫార్మా రంగంలో ప్రపంచంలో అగ్రశ్రేణికి చేరుకున్నామని, వ్యాక్సిన్ పరిశోధన అభివృద్ధికి మరింత కృషి జరుగుతోందని చెప్పారు. ఆపరేషన్ సిస్టమ్ నుంచి సైబర్ సెక్యూరిటీ వరకు డీప్ టెక్నాలజీ నుంచి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వరకు ఐటీ రంగంలో భారత్ స్వావలంబన సాధించిందని తెలిపారు. ఎలక్ట్రానిక్ వాహనాల్లో బ్యాటరీల కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా సొంత బ్యాటరీలను తయారు చేసుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. మన ఎంఎస్ఎంఈలు నాణ్యత గల వస్తువులను తయారు చేసేందుకు సామర్థ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. అప్పుడే మనం ప్రపంచ మార్కెట్‌లోకి ప్రవేశించగలమన్నారు. స్వదేశీ ఉత్పత్తులను తయారు చేసేందుకు అన్ని వర్గాలు ముందుకు రావాలని తెలిపారు. ఏ స్వార్థ శక్తీ మనల్ని చిక్కుల్లో పడవేయలేని విధంగా మన కాళ్లపై మనం నిలబడాలని అమెరికన్ టారిఫ్‌ల గురించి పరోక్షంగా ప్రస్తావిస్తూ మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దకాలంగా అనేక కాలం చెల్లిన చట్టాలను బుట్టదాఖలు చేశామని, ఆదాయ పన్ను చట్టంలోనే తాజాగా 280సెక్షన్లను తొలగించామని తెలిపారు. రూ.12 లక్షల వరకు ఆదాయం సంపాదించేవారు దేశంలో పన్ను కట్టనవసరం లేకుం డా చేశామన్నారు. గత పదేళ్లలో తన విధానాల కారణంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని తెలిపారు. దాదాపు 103 నిమిషాలపాటు ప్రసంగించిన మోదీ.. ఇందిరాగాంధీకంటే ఎక్కువసార్లు ఎర్రకోట పైనుంచి ప్రసంగించిన ప్రధానిగా గుర్తింపు పొందారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లుగా దేశానికి చేస్తున్న సేవలను కొనియాడారు.



ఎర్రకోట వద్ద వేడుకల్లో ఎన్‌సీసీ క్యాడెట్లతో ప్రధాని మోదీ

ఎర్రకోట వేడుకకు రాహుల్ డుమ్మా

ఎర్రకోటపై స్వాతంత్ర్య దిన వేడుకలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గైర్హాజయ్యారు. ఇందుకు కారణమేంటో కాంగ్రెస్ నుంచి అధికారిక ప్రకటనేమీ విడుదల కాలేదు. అయితే లోక్‌సభలో ప్రతిపక్ష నేతనైన తనకు.. గత ఏడాది జరిగిన వేడుకల్లో ముందు వరుసలో కూడా ఐదో వరుసలో సీటు కేటాయించడంతో ఆయన అలకబూనారని.. అందుకే రాలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. గత ఏడాది ఒలింపియన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించడంతో రాహుల్ సహా పలువురు నేతలకు వెనుక వరుసలో సీట్లు కేటాయించాల్సి వచ్చిందని రక్షణ శాఖ అప్పట్లో వివరణ ఇచ్చింది.

భారత్‌కు శుభాకాంక్షలు తెలిపిన పుతిన్, నెతన్యాహు

మాస్కో, జెరూసలేం, ఆగస్టు 15 : భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహు భారత ప్రజలకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్‌కు స్వయం నిర్ణయం తీసుకొనే హక్కు ఉందని పుతిన్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు ఆయన తన సందేశాలను పంపారు. భారత్, రష్యాల వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని పుతిన్ తన సందేశంలో వివరించారు.

పంద్రాగస్టు ప్రసంగాల్లో మోదీ రికార్డు

ఎర్రకోట నుంచి 103 నిమిషాల ప్రసంగం

న్యూఢిల్లీ, ఆగస్టు 15 : పంద్రాగస్టు వేడుకలు ఈసారి అనేక ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ఢిల్లీ ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలు రికార్డులను బద్దలుకొట్టారు. శుక్రవారం 103 నిమిషాలపాటు దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఒక ప్రధాని ఇంత సుదీర్ఘంగా పంద్రాగస్టు ప్రసంగం చేయడం స్వాతంత్ర్య భారత చరిత్రలోనే ఇది ప్రథమం. గతేడాది 98 నిమిషాలు ఆయన ప్రసంగించారు. అదే అప్పటికి అతి దీర్ఘ ప్రసంగం. ఈసారి ఆయన రికార్డును ఆయననే ఛేదించడం విశేషం. ఆయనకు ముందు నెహ్రూ 72 నిమిషాలు, మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ 71 నిమిషాలు మాట్లాడి అతి దీర్ఘ ఉపన్యాసకులుగా ఘనత పొందారు. నెహ్రూ 1954లో, ఇందిర 1966లో కేవలం 14 నిమిషాలే పంద్రాగస్టు ప్రసంగం చేశారు. ఈ రికార్డు ఇప్పటికీ వారి పేరిటే ఉంది.

ఇందిర రికార్డు బద్దలు...

వరుసగా 12 సార్లు ఎర్రకోట నుంచి దేశ ప్రజలకు సందేశం అందించి.. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేరిట ఉన్న రికార్డును ప్రధాని మోదీ అధిగమించారు. ఇందిరాగాంధీ 1966 జనవరిలో ప్రధాని అయి, 1977 మార్చి వరకు కొనసాగారు. అనంతరం 1980 నుంచి 1984 అక్టోబరులో హత్యకు గురయ్యేవరకు తిరిగి ఆ పదవిలో ఉన్నారు. ఈ క్రమంలో మొత్తం 16సార్లు ఆమె ఎర్రకోట నుంచి ప్రసంగించారు. ఎర్రకోట నుంచి అత్యధికంగా 17సార్లు ప్రసంగించిన తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. ఇప్పుడు ఆయన తర్వాతిస్థానం మోదీ దక్కించుకున్నారు. ఇక ప్రధానమంత్రులుగా పనిచేసినవారిలో రాజీవ్‌గాంధీ ఐదుసార్లు, పీవీ నరసింహారావు నాలుగు సార్లు, అటల్ బిహారీ వాజపేయి ఆరుసార్లు, మన్మోహన్ సింగ్ పదిసార్లు ప్రసంగించారు. వీపీ సింగ్, దేవెగౌడ, గుజ్రాల్ ఒక్క పర్యాయమే ఉపన్యసించారు. కాగా, గత ఏడాది మన్మోహన్ సింగ్ పేరిట ఉన్న రికార్డును, ఈ సారి ఇందిర రికార్డును మోదీ వరుసగా ఛేదించడం విశేషం.

ఆకర్షించిన కాషాయ తలపాగా..

వస్త్రధారణలో తన బ్రాండ్‌ను చూపించే ప్రధాని మోదీ ఈసారి పంద్రాగస్టు వేడుకల్లో ధరించిన కాషాయ రంగు తలపాగా ఆకర్షణగా నిలిచింది. తెల్ల కుర్తా, చుడీదార్, బంధ్‌గల్ జాకెట్, మెడలో త్రివర్ణ కండువాతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తలపాగా ధరించి ఎర్రకోటపై దర్శనమివ్వడం ఏటా ఒక సంప్రదాయంగా మోదీ పాటిస్తూ వస్తున్నారు. గత ఏడాది రాజస్థానీ లెహెరియా తలపాగాను ఆయన ధరించారు. సామాన్యులుగా కనిపిస్తూ అసామాన్య సేవలను, నైపుణ్యాన్ని దేశాన్ని అందిస్తున్న ఐదువేల మంది ప్రత్యేక అతిథులుగా పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, లఖ్‌పతి దీదీల నుంచి పలు పంచాయతీలకు చెందిన సర్పంచులు వరకు.. ఈ వేడుకలకు హాజరయ్యారు. అలాగే.. ప్రత్యేక ఒలింపిక్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు, అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన విజేతలు, ఖేలో ఇండియా పారా గేమ్స్ బంగారు పతక గ్రహీతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఔషధ మొక్కలను పెంచుతున్న రైతులను ఈసారి ప్రత్యేకంగా ఆహ్వానించారు.

కాళేశ్వరంపై సుప్రీంకోర్టుకు బీఆర్ఎస్!

- ప్రాజెక్టుపై దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా.. తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చేలా ప్రయత్నం
- హరీశ్‌రావు, వినోద్‌కుమార్‌తో కేసీఆర్ భేటీ
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ నివేదిక, దాని ఆధారంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెల్లడించిన అంశాలు, ఆ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో.. వీటిని తిప్పికొట్టేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆ పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం కీలక నేతలు హరీశ్‌రావు, బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులతో ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో సమావేశమైనట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడమే కాకుండా.. నిలిచిపోయిన ఆ ప్రాజెక్టును వినియోగంలోకి తీసుకువచ్చేలా సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశంపై ఈ సందర్భంగా కేసీఆర్ చర్చించినట్లు తెలుస్తోంది. న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని ముందుకు వెళ్లాలని, ఇందుకు ఏయే అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్న దానిపై పార్టీ నేతలకు గులాబీ బాస్ సూచనలు చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలిపోయిందంటూ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాలు, కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ తదితర అంశాలపై కూడా కేసీఆర్ సమాలోచన చేసినట్లు తెలిసింది. ఇటీవల బీఆర్ఎస్ పార్టీపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం, దాన్ని అధిగమించేందుకు ప్రజల్లోకి ఎలా వెళ్లాలన్నదానిపై కూడా అధినేత సూచనలు చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా చేపట్టాల్సిన ప్రణాళికలపైనా కేసీఆర్ చర్చించినట్లు తెలిసింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అంశాన్ని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చూసుకుంటారని చెప్పినట్లు సమాచారం.

ఎమ్మెల్యేల ఫిరాయింపులపై సుప్రీం తీర్పు ప్రతి అందలేదు

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



తాండూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయమై సుప్రీంకోర్టు తీర్పు ప్రతి తనకింకా చేరలేదని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ చెప్పారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ తండాలో శుక్రవారం జరిగిన ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. 'ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై అసెంబ్లీ స్పీకర్ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పింది. ఈ విషయమై మీరే నిర్ణయం తీసుకుంటున్నారు' అని మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. కోర్టు తీర్పు పత్రాలు తనకందిన తర్వాత స్పందిస్తానన్నారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించడంతోపాటు బీసీ ప్లాన్ అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ తన పరిధిలోకి రాదని, దానిపై ఆర్థిక మంత్రిని అడగాలని ప్రసాద్ కుమార్ సమాధానం దాటవేశారు. స్పీకర్ వెంట తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి కూడా ఉన్నారు.

వాహనాల లైఫ్ ట్యాక్స్ పెంపును ఉపసంహరించుకోవాలి: హరీశ్‌రావు



సిద్దిపేట ఆగస్టు 15, (ఆంధ్రజ్యోతి): కొత్త వాహనాల జీవితకాల పన్ను (లైఫ్ ట్యాక్స్)ను పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పన్నుల రూపంలో ప్రజలపై భారం మోపడం తగదన్నారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పిచ్చి చర్యల వల్ల పాలనలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. రోడ్డు ట్యాక్స్ కింద వచ్చే ఆదాయాన్ని రూ.8,500 కోట్లకు పెంచుతున్నామని బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించగా.. అంత డబ్బు ఎలా వస్తుంది, ప్రజలపై అదనపు పన్నుల భారం మోపుతారా ? అని తాము ప్రశ్నించామని హరీశ్ తెలిపారు. ప్రజలపై ఎలాంటి భారం వేయమని నాడు చెప్పిన ప్రభుత్వం నేడు మాట తప్పిందని విమర్శించారు. పేద, సామాన్య ప్రజలకు కనీస అవసరంగా మారిన వాహనాలపై పన్నుల భారాన్ని పెంచారని అన్నారు. గత నెలలో వాహనాలపై సర్వీస్ ట్యాక్స్‌ను పెంచారని, ఇటీవల లైఫ్ ట్యాక్స్‌ను పెంచారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పన్నులు తగ్గిస్తే ప్రస్తుతం రేవంత్ రెడ్డి పన్నులు పెంచుతున్నారని విమర్శించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో రూ.7,100 కోట్లకు గానూ ప్రభుత్వం రూ. 6,900 కోట్లు వసూలు చేసిందని తెలిపారు. వాహనాల కొనుగోలప్పుడు వసూలు చేసే లైఫ్ ట్యాక్స్ పెంపుతో ప్రజలపై మరింత భారం వేస్తున్నారని చెప్పారు. గత నెల, ఈ నెలలో రవాణా శాఖ పన్నుల పెంపు పేరిట ప్రజలపై రూ.2 వేల కోట్ల అదనపు భారం మోపుతూ తీసుకున్న నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పన్నుల బాదుడు వెనుక కుట్ర దాగి ఉందని హరీశ్ ఆరోపించారు. కొత్తగా ఆన్యూనిటీ పేరుతో రోడ్లు వేస్తామని చెబుతున్న ప్రభుత్వం పన్ను రూపంలో వచ్చే సొమ్మును కాంట్రాక్టర్లకు చెల్లించాలని చూస్తుందని తెలిపారు.

త్వరలో ఖనిజ రంగంలోకి సింగరేణి

- స్వాతంత్ర్య వేడుకల్లో సంస్థ సీఎండీ బలరాం వెల్లడి



కొత్తగూడెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కీలక ఖనిజాల అన్వేషణ, వెలికితీత రంగంలోకి సింగరేణి సంస్థ స్వయంగా గానీ, జాయింట్ వెంచర్ కంపెనీల ద్వారా గానీ త్వరలోనే ప్రవేశించనుందని సంస్థ సీఎండీ బలరాం వెల్లడించారు. సింగరేణి సంస్థను పదికాలాల పాటు నిలబెట్టడంతో పాటు, సంస్థ కార్యకలాపాలను విస్తరించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. శుక్రవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన వనరులు పెద్ద ఎత్తున అందుబాటులోకి రావడంతో బొగ్గుకు డిమాండ్ క్రమంగా తగ్గుతోందన్నారు. మరోవైపు, సింగరేణిలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల వల్ల ఇక్కడి బొగ్గు ధర ఎక్కువగా ఉందని, సంస్థ నుంచి బొగ్గును కొంటున్న థర్మల్ పవర్ సంస్థలు వేరే సంస్థల వైపు మొగ్గు చూపుతున్నాయని చెప్పారు. ఆయా సంస్థలు వేరే చోటు నుంచి బొగ్గు కొనడానికి ప్రభుత్వాలు అనుమతిస్తే మున్ముందు సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే సింగరేణి సంస్థ ఖనిజ రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు యువత ముందుకు రావాలి: చాడ

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకు యువత ముందుకు రావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఆయన త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తితో యువత ప్రజా పోరాటాలు చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగ విలువలకు పాతరేస్తున్నారని చాడ వెంకట రెడ్డి ఆరోపించారు. ప్రాథమిక హక్కులను, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారన్నారు. అధికార దుర్వినియోగం చేసి, ప్రజాస్వామ్యానికి మూలమైన ఓటరు జాబితానూ గందరగోళం చేసి, బిహార్‌లో అధికారంలోకి వచ్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందన్నారు.

ప్రాధాన్య జాబితాలో స్థానిక పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

మారకూడదని, ఆ విధానాన్ని తాము పాటిస్తున్నందునే ప్రపంచంతో పోటీ పడగలుగుతున్నామని తెలిపారు. పెట్టుబడులకు రక్షణ కల్పించడమే కాదు.. లాభాలు వచ్చేలా ప్రోత్సహించే బాధ్యత కూడా తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు సృష్టించే అపోహలకు ఊతమిస్తే నష్టపోయేది వ్యాపారులేనన్నారు. ప్రభుత్వం తరఫున అలాంటి వాటిని తొలగించడానికే తాను ఇక్కడికి వచ్చినట్లు స్పష్టం చేశారు. అభివృద్ధిని అడ్డుకోవాలనుకునే వారికి కనువిప్పు కలిగించేలా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారంటూ నిర్వాహకులను అభినందించారు. హైటెక్స్‌లో శుక్రవారం క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాపర్టీ షోను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను సగటు మధ్యతరగతి ఆలోచనలు ఉన్న ముఖ్యమంత్రిని అని, ఇక్కడి సంపద కొల్లగొట్టి విదేశాలకు తరలించుకుపోవాలన్న దృక్పథం తనకు లేదని స్పష్టం చేశారు. సమాజ శ్రేయస్సు కోసమే తాను ఆలోచిస్తానని, కొన్ని సందర్భాల్లో వ్యాపారులు అడిగినవన్నీ అంగీకరించలేకపోవచ్చన్నారు. పారదర్శక విధానంలో ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధికి సహకరించేందుకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. "చార్మినార్‌ను కులీ కుతుబ్ షా నిర్మించారు. దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగింది. హైటెక్ సిటీని చంద్రబాబు అభివృద్ధి చేశారు. వారి గురించి మనం గొప్పగా చెప్పుకుంటున్నాం.. వారిని గుర్తు చేసుకుంటున్నాం.. రానున్న రోజుల్లో ఫ్యూచర్ సిటీ అంటే రేవంత్ పేరు గుర్తుకు వచ్చేలా నిర్మిస్తాం. వచ్చే వందేళ్లు, వెయ్యేళ్లు చెప్పుకొనేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నదే మా సంకల్పం. నాకు ఆ చిత్తశుద్ధి, తపన ఉంది. అందరం కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం" అని క్రెడాయ్ ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

జూబ్లీహిల్స్‌లో ఉండేటోళ్లు మెట్రో ఎక్కుతారా?

"కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి చొరవతో హైదరాబాద్‌కు మెట్రో వచ్చింది .. పదేళ్లుగా మెట్రో విస్తరణ జరగలేదు.. అలా జరిగి ఉంటే ఈ రోజు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్య కొంతైనా పరిష్కారమయ్యేది" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. "గత ప్రభుత్వ హయాంలో హైటెక్‌సిటీ నుంచి ఔటర్ రింగు రోడ్డు మీదుగా ఎయిర్‌పోర్టు దాకా మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. కానీ.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో ఉన్న వారు ఎంత మంది మెట్రో ఎక్కుతారు? ఇక్కడి నుంచి ఔటర్ మీదుగా వెళ్లినా అదే వేగంతో ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. మల్టీ యుటిలిటీ ట్రాన్స్‌పోర్ట్ అనేది జన సాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల మీదుగా ఉండాలి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్బీ నగర్ నుంచి చాంద్రాయణగుట్ట, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కొత్తగా 100 ఎకరాల్లో నిర్మిస్తున్న హైకోర్టు సమీపం నుంచి శంషాబాద్, ఎయిర్‌పోర్టు దాకా మెట్రో నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అలాగే, ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు, కూకట్‌పల్లి తర్వాత మియాపూర్, లింగంపల్లి మీదుగా పటాన్‌చెరు వరకు, హైటెక్ సిటీ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మీదుగా కోకాపేట దాకా మెట్రో పొడిగించాలని అధికారులకు చెప్పా. అలాగే, ఇటు శామీర్ పేట్, మేడ్చల్ వరకు మెట్రో విస్తరించాలని భావిస్తున్నాం" అని వివరించారు. రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం 200 ఎకరాలను ఇచ్చేలా రక్షణ శాఖను ఒప్పించామని గుర్తు చేశారు. శామీర్‌పేట, మేడ్చల్ ప్రాంతాలు.. వేగంగా విస్తరిస్తున్నాయని, మెరుగైన కనెక్టివిటీ ఉండేలా వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "నేను మాటి మాటికి ఢిల్లీ వెళ్తున్నానంటూ కొందరు మాట్లాడుతున్నారు. కానీ.. ఢిల్లీలో ముఖ్యమంత్రికి బంగళా ఇచ్చింది నెలకు నాలుగు రోజులు వెళ్లి కేంద్రంతో అనుమతులు తెచ్చుకోవడానికే. దాన్ని నేను సద్వినియోగం చేసుకుంటున్నా" అని అన్నారు. మెట్రో, మూసీ రివర్‌ఫ్రంట్, రీజినల్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టుల అనుమతుల కోసమే తరచుగా ఢిల్లీ వెళ్లాల్సి వస్తోందని వివరించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

రూపాయి ఖర్చు పెడితే 42 పైసలే వస్తోంది

"కాళేశ్వరం కార్పొరేషన్ పేరిట గత పాలకులు రూ.లక్ష కోట్లు ఖర్చు చేశారు. 12 ఏళ్లకు 11.5 శాతం వడ్డీకి రుణాలు తీసుకున్నారు. ఎంత వ్యాపారం చేసే టోళ్లైనా 11.5 శాతానికి అప్పులు తెస్తరా? నేను వచ్చిన 20 నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అప్పుల్లో అసలు, వడ్డీ కలిపి రూ.29వేల కోట్లు చెల్లించాను. వాస్తవానికి కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపాయి ఖర్చు పెడితే 42 పైసలే తిరిగి వస్తోంది. రాష్ట్రంపై అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రధాన మంత్రిని పలుమార్లు కలిశాను. ఇప్పటికే రూ.26వేల కోట్లను 7.5 శాతం వడ్డీకి 35 ఏళ్లకు రీస్ట్రక్చర్ చేయించా. మొత్తం రూ.2 లక్షల కోట్ల రుణాలను రీ స్ట్రక్చర్ చేయాలని ప్రధానిని కోరుతున్నా" అని సీఎం రేవంత్ వెల్లడించారు. ఇదంతా తన కోసం చేస్తున్నది కాదని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే తాను తాపత్రయపడుతున్నానని తెలిపారు. మహారాష్ట్రలో 40 విమానాశ్రయాలున్నాయని, తెలంగాణకు మరిన్ని విమానాశ్రయాలు తెచ్చుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌ను డైనమిక్ హబ్‌గా అభివృద్ధి చేయడానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, ఈ దిశగా క్రెడాయ్ సభ్యులను ప్రోత్సహిస్తామన్నారు. "గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన నేను పెద్ద పెద్ద ఇంగ్లీషు చదువులు చదువుకోకున్నా.. కామన్ సెన్స్ ఉంది. భాష అనేది కేవలం ఒక కమ్యూనికేషన్ మాత్రమే" అని పేర్కొన్నారు.

3 రోజుల పాటు క్రెడాయ్ షో

క్రెడాయ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షోను 3 రోజుల పాటు నిర్వహిస్తున్నామని అధ్యక్షుడు ఎస్.జయదీప్ రెడ్డి తెలిపారు.ఈ ప్రదర్శనలో 70కి పైగా డెవలపర్లు, 300కు పైగా రెరా ఆమోదిత ప్రాజెక్టులు, అపార్టుమెంట్ కాంప్లెక్సులు, విల్లాలు, ప్లాట్లు, కమర్షియల్ స్పేసులు ఒకే వేదికపై ఉంటాయన్నారు. అగ్ర శ్రేణి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, సంబంధిత రంగాలకు చెందిన స్టాళ్లు ఇక్కడ ప్రత్యేకంగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు (ఎలక్ట్) జి.రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ అగర్వాల్, కె.అనిల్ రెడ్డి, వై.రవిప్రసాద్, రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు, బిల్డర్లు, డెవలపర్లు పాల్గొన్నారు.

సీఎం కృష్ణాష్టమి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణ భగవానుడి కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. కాగా, శిబు సోరెన్ సంస్మరణ సభలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ఝార్ఖండ్ వెళ్లనున్నారు. ఉదయం 11.45గంటలకు బేగంపేట నుంచి బయలుదేరనున్న సీఎం.. తిరిగి సాయంత్రానికి హైదరాబాద్ చేరుకుంటారు. కాగా, విధి నిర్వహణలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి ప్రతిష్ఠాత్మక శౌర్య పతకానికి ఎంపికైన రాజునాయక్‌ను సీఎం రేవంత్ అభినందించారు. అలాగే, రాష్ట్ర పోలీసు శాఖకు 21 పతకాలు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు.

కేసీఆర్ వద్దకు కవిత

- కుమారుడికి ఆశీర్వాదం కోసం ఫాంహౌస్‌కు
- ఉన్నత చదువులకు అమెరికా వెళ్తున్న ఆర్య
- బెడ్రూంలో తండ్రి.. బయటి నుంచే కవిత నమస్కారం
- అమెరికా బయలుదేరి వెళ్లిన కవిత



హైదరాబాద్/గజ్వేల్/మర్కుక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శుక్రవారం తన తండ్రి, పార్టీ అధినేత కేసీఆర్ వద్దకు వెళ్లారు. తన చిన్న కుమారుడు ఆర్య గ్రాడ్యుయేషన్ చదివేందుకు అమెరికా వెళ్తున్న సందర్భంగా అతనికి తాత ఆశీర్వాదం ఇప్పించాలని కవిత భావించారు. ఈ మేరకు తన భర్త, ఇద్దరు కుమారులతో కలిసి ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌కు వెళ్లారు. ఆ సమయంలో కేసీఆర్ తన బెడ్రూంలో ఉన్నారు. కవిత మాత్రం బెడ్రూం బయటి నుంచే తన తండ్రికి నమస్కారం చేశారు. ఆ తర్వాత కేసీఆర్ సతీమణి శోభ.. మనుమడిని బెడ్రూంలోకి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మనుమడు ఆర్యను ఆశీర్వదించిన కేసీఆర్ అతనితో పలు విషయాలు మాట్లాడారు. "మంచిగా చదువుకో. ఏ కోర్సులో చేరుతున్నావు? యూనివర్సిటీ పేరేంటి? అమెరికా ఎప్పుడు వెళ్తున్నావు?" అని కేసీఆర్ అడగగా.. ఆర్య అన్ని వివరాలు చెప్పి శుక్రవారం రాత్రి బయలుదేరి వెళుతున్నామని చెప్పినట్లు తెలిసింది. కాగా, కుమారుడిని అమెరికాలో కళాశాలలో చేర్పించేందుకు ఆయనతోపాటు తన పెద్ద కుమారుడు ఆదిత్యతో కలిసి కవిత శుక్రవారంరాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. ఆమె తిరిగి సెప్టెంబరు 1న బయలుదేరి 2న హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. కవిత అమెరికా పర్యటనకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి ఇవ్వడంతో పాటు పాస్‌పోర్ట్‌ను కూడా రిలీజ్ చేసింది.

శ్రీకాంతాచారి త్యాగం సదా స్మరణీయం

తన ఆత్మబలిదానంతో యావత్ తెలంగాణను స్వరాష్ట్ర సాధన ఉద్యమం వైపు నడిపించిన శ్రీకాంతాచారి త్యాగం సదా స్మరణీయమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ప్రస్తుత ప్రభుత్వ పాలన నుంచి మన గడ్డను కాపాడుకోవడానికి శ్రీకాంతాచారి స్ఫూర్తితో పునరంకితమవుదామని ఆమె పిలుపునిచ్చారు. శ్రీకాంతాచారి జయంతిని పురస్కరించుకొని శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఆయన త్యాగాన్ని కవిత స్మరించుకున్నారు.

నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ కన్నుమూత



కొహిమా, ఆగస్టు 15: నాగాలాండ్ గవర్నర్ లా గణేశన్ శుక్రవారం రాత్రి కన్నుమూసినట్టు కొహిమాలోని రాజ్ భవన్ వర్గాలు తెలిపాయి. చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారని పేర్కొన్నాయి. ఆయన వయసు 80 ఏళ్లు. ఈ నెల 8న ఆయన చెన్నైలోని తన నివాసంలో కుప్పకూలడంతో తలకు గాయమయింది. వెంటనే ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందించారు. చికిత్స పొందుతునే మరణించారు. ఆయన నాగాలాండ్ 12వ గవర్నర్‌గా 2023 ఫిబ్రవరి 12న నియమితులయ్యారు. ఫిబ్రవరి 20న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన మణిపూర్ 15వ గవర్నర్‌గా 2021 ఆగస్టు 27 నుంచి 2023 ఫిబ్రవరి 19వరకు బాధ్యతలు నిర్వహించారు. లా గణేశన్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం తెలిపారు.




వీఐటీ-చెన్నై వార్షికోత్సవంలో కమల్‌హాసన్, వీఐటీ ఛాన్స్‌లర్ విశ్వనాథన్ తదితరులు

వైఫల్యాలను ఎదుర్కొని విజయం వైపు సాగండి

- యువతకు కమల్‌హాసన్ పిలుపు
- నాస్తికుణ్ణి కాదు... హేతువాదినంటూ వ్యాఖ్య
- ఘనంగా వీఐటీ-చెన్నై వార్షికోత్సవం

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జీవితంలో వైఫల్యాలను ధైర్యంగా ఎదుర్కొని విజయం వైపు యువత ముందుకు సాగాలని ప్రముఖ సినీ నటుడు, 'మక్కల్‌నీదిమయ్యం' అధినేత, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ పిలుపునిచ్చారు. 'వీఐటీ-చెన్నై' 15వ వార్షికోత్సవం సందర్భంగా 'క్రిస్టల్ కనెక్షన్స్ పూర్వ విద్యార్థుల సమ్మేళన సమావేశం' శుక్రవారం స్థానిక కేలంబాక్కంలో ఘనంగా జరిగింది. వీఐటీ వ్యవస్థాపక కులపతి జి.విశ్వనాథన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జీవీ సెల్వం స్వాగతం పలకగా, కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమల్ మాట్లాడుతూ.. ఏ ఆవిష్కరణ కూడా ఫెయిల్యూర్ లేకుండా సాధ్యం కాదని, వైఫల్యాలకు భయపడే దేశం దాని నిజమైన సామర్థ్యాన్ని ఎప్పటికీ ఆవిష్కరించలేదన్నారు. 'దేవుడంటే గౌరవం లేదు కానీ, తమిళాన్ని మాత్రం గౌరవిస్తారు' అని కొంతమంది తనను ప్రశ్నిస్తుంటారని అంటూ.. 'నిజమే, తమిళం నా మాతృభాష. భాష మాత్రమే గౌరవించదగినది' అని వ్యాఖ్యానించారు. తాను నాస్తికుణ్ని కాదని, హేతువాదిని మాత్రమేనన్నారు. వీఐటీ ఛాన్స్‌లర్ జి.విశ్వనాధన్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య మాత్రమే భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చగలదని తాను బలీయంగా విశ్వసిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీఐటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జీవీ సెల్వం మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాల కోసం అన్వేషించడం కంటే వ్యవస్థాపకులుగా మారి ఇతరులకు ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు అక్కడ నేర్చుకుని, బాగా సంపాదించి, తిరిగొచ్చి మాతృదేశానికి సేవ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అల్యూమిని ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. వీఐటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ వీఎస్ కాంచన భాస్కరన్, ప్రొ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ టి.త్యాగరాజన్, వీఐటీ చెన్నై డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణన్, అదనపు రిజిస్ట్రార్ డాక్టర్ పీకే మనోహరన్, వీఐటీఏఏ ప్రెసిడెంట్ డాక్టర్ మనోజ్‌కుమార్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సంఘీ'భావం!

బ్రిటిష్ వలసపాలననుంచి విముక్తిపొందిన తొలి ఏడాది అప్పటి ప్రధాని నెహ్రూ చేసిన ఎర్రకోట ప్రసంగం డెబ్బైరెండు నిముషాలు సాగిందట. చరిత్రలో నిలిచిపోయే చక్కని ప్రసంగమని దానిని ఇప్పటికీ కీర్తిస్తున్నవాళ్ళున్నారు. ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ నిడివిని ఎప్పుడో దాటేశారు. ప్రధాని అయిన తొలిసంవత్సరం నరేంద్రమోదీ 65నిముషాలు మాత్రమే మాట్లాడారు. మరుసటి ఏడాదిలోనే నెహ్రూను ఓ పదహారు నిముషాలు దాటేశారు. 2016లో 96 నిముషాలు మాట్లాడిన మోదీ, 2017లో 56 నిముషాలకే స్వస్తి చెప్పేశారు. తన ఎర్రకోట ప్రసంగాలు మరీ పొడుగ్గా ఉంటున్నాయని జనం లేఖలు రాయడంతో వాటిని కుదించాలని నిర్ణయించుకున్నట్టు ఆ ఏడాది 'మన్ కీ బాత్'లో మనసు విప్పారు. అయితే, ఆ తరువాత ఆయన ఆ మాటమీద నిలబడిందేమీ లేదు. చివరకు సొంతపార్టీ బలం 240కు పడిపోయి, కూటమి కట్టాల్సివచ్చినప్పటికీ, గత ఏడాది తన 11వ ఎర్రకోట ప్రసంగాన్ని అంతకుముందు పది ప్రసంగాల రికార్డులను చెరిపివేస్తూ సుదీర్ఘంగా చేశారాయన. ఈ ఏడాది ఏకంగా 103 నిముషాల సుదీర్ఘప్రసంగంతో గత ప్రధానమంత్రుల రికార్డులన్నీ చెరిపేశారు, ప్రసంగాల సంఖ్యలో ఇందిరను దాటేశారు.

మోదీ ఏం మాట్లాడినా వినసొంపుగా ఉంటుంది. అవసరం ఉన్నా లేకున్నా ఉద్వేగం, ఉద్రేకం మేళవించి ఆహూతులను ఆకట్టుకోగలరాయన. మోదీ ఎర్రకోట ప్రసంగాల్లో విషయం తగ్గుతోందని గిట్టనివారు అంటారు కానీ, ఈ మారు అత్యధికులకు ఆయన స్వరవిన్యాసం కొత్తగా అనిపించింది. తన ప్రసంగంలో ఆయన ఆపరేషన్ సిందూర్‌కూ, తదనంతర పరిణామాలకు అధికప్రాధాన్యం ఇవ్వడం సహజం. ప్రతీకారేచ్ఛతో, వీరావేశంతో ఆరంభించిన యుద్ధాన్ని వెంటనే నిలిపివేయడం మీద రేగిన విమర్శలను అటుంచితే, ట్రంప్ అలకలూ ఆగ్రహాలూ, సుంకాల యుద్ధాల వరకూ సాగిన పలు పరిణామాల నేపథ్యంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మోదీ ఈ వేదికమీదనుంచి వాటిని ప్రస్తావించక తప్పలేదు. శత్రువుగా మారిన ట్రంప్ భారత్‌మీద దాడికి పాల్పడుతున్న నేపథ్యంలో, జాతీయవాదాన్నీ, దేశభక్తినీ రగల్చడం అవశ్యకమని మోదీ అనుకున్నారు. ఆసిమ్ మునీర్ వంటివారు ఎగిరెగిరిపడుతున్ననేపథ్యంలో, అణుబాంబు బెదిరింపులకు భారత్ భయపడదన్నారు మోదీ. పహల్గాంలో పర్యాటకులను కాపాడలేకపోయారన్న అప్రదిష్ఠకు తోడుగా 'సిందూర్' సందర్భంలో పాక్ క్షిపణి, డ్రోన్‌దాడుల అనుభవం కూడా ఉన్నందున, యావత్ దేశాన్ని రక్షించడానికి ఆయన సుదర్శన చక్రాన్ని సిద్ధం చేయిస్తున్నారు. పాకిస్థాన్‌కు సింధుజలాలను ధారాదత్తం చేశారంటూ నెహ్రూను తప్పుబడుతున్నవారు ఇంతకాలం దానిని ఎందుకు సరిదిద్దలేదో తెలియదు. రక్షణరంగంలో స్వయం సమృద్ధి, మేడిన్ ఇండియా బలం సిందూర్ విజయానికి దోహదం చేశాయని మెచ్చుకుంటున్నప్పుడైనా ప్రధానికి నెహ్రూ దార్శనికత గుర్తుకువచ్చిందో లేదో. గగనయాన్ గురించి మాట్లాడుతున్నప్పుడు గత ప్రధానులు వేసిన పునాదులు గుర్తుకువస్తే బాగుండేది. మేడిన్ ఇండియా చిప్ గురించి మోదీ చేసిన ప్రస్తావనలు విన్న విదేశీయులకు భారత్ పదేళ్ళక్రితమే కళ్ళుతెరిచిందన్న భ్రమ కలగవచ్చు. తన పాలన అద్భుతమని చెప్పుకోవడంలో తప్పులేదు కానీ, గతమంతా శూన్యమని ఇలా నిందలకు పాల్పడటం సముచితం కాదు.

ఎర్రకోటమీద నుంచి ఫలానా విషయాలు మాట్లాడకూడదనో, రాజకీయం చేయకూడదనో నియమం ఏమీ లేదు. మోదీ ఆరెస్సెస్‌నూ, దాని వందేళ్ళ సేవలను మెచ్చుకున్నారు, , దేశనిర్మాణంలో పాలుపంచుకుందని ప్రశంసించారు. పంద్రాగస్టు ప్రసంగంలో ప్రస్తుతిస్తున్నారు కనుక, స్వాతంత్ర్యోద్యమంలో దాని పాత్ర ఏమిటో చెప్పమంటూ విమర్శలూ ప్రశ్నలూ మొదలైనాయి. మోదీ ఉండగా తమకు ఇక ఆరెస్సెస్ అక్కరలేదని బీజేపీ నేతలు ఎగిరిపడుతూండటంతో, ఆరెస్సెస్ సహాయనిరాకరణతో బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో తన కాళ్ళమీద తాను నిలబడలేకుండా చేసిందని అంటారు. ఆ తరువాత తప్పు గ్రహించి, నాగపూర్ పర్యటనలతో లెంపలేసుకుంటే కానీ మహారాష్ట్ర సహా మరికొన్ని అసెంబ్లీలు బీజేపీ ఖాతాలోకి రాలేదు. ఒక్కరే ఎంతకాలం ఏలుతారు, డెబ్బైఐదేళ్ళకు దిగాల్సిందేనంటూ హెచ్చరికలు కూడా వినవస్తున్న నేపథ్యంలో, దేశానికి వందనం చేయాల్సిన ఎర్రకోటమీదనుంచి ఆరెస్సెస్‌కు అభివాదం అందించిన ఫలితం రాబోయేరోజుల్లో పలువిధాలుగా ఉండవచ్చు, విజయాలు చేకూర్చవచ్చు.

విప్లవం.. చాలించాలి

ఇనుకొండ తిరుమలి రాసిన 'అరణ్యవాసంలోనే విప్లవ ప్రభాతం' వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో 25.7.25న ప్రచురితమైంది. నక్సలైట్లు తమ ఉద్యమాన్ని విరమించి రాజ్యానికి లొంగిపోవాలని తిరుమలి సలహా ఇచ్చారు. ఇది చాలా మంచి విషయం.

గిరిజన ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ల చేతుల్లో పడనీయకుండా అడ్డుపడుతున్నామని మావోయిస్టులు పైకి చెబుతున్నారు గానీ వాళ్ల అసలు లక్ష్యం మార్క్స్ ప్రవచించిన వర్గపోరాటం, వర్గ శత్రు నిర్మూలన, సాయుధ విప్లవంతో ప్రభుత్వాధికారాన్ని చేపట్టడం. డ్రగ్ టెస్టింగ్‌లో విఫలమై, 'రోగంకన్నా హానికరమైన మందు'గా లోకం ముందు రుజువైన వికృత సిద్ధాంతమే మార్క్సిజం. 'మార్క్స్ సిద్ధాంతం ఆచరణలో పెట్టబడిన ప్రతిచోట పెద్దమ్మ (దరిద్ర దేవత) నాట్యమాడును దద్దమ్మా' అని తురగా రామకవి చెప్పినట్లు.. ఇనుప గజ్జెలతల్లి తాండవించడంతో రష్యా, చైనా, తూర్పు యూరప్ సమాజాలు నెత్తీ నోరు కొట్టుకుని కమ్యూనిస్టు వ్యవస్థను వదిలించుకున్న చరిత్ర మనకు తెలిసిందే. మార్క్సిజం ఒక కుహనా రాజకీయ తార్కిక సిద్ధాంతం. భారతదేశంలో మళ్లీ ఆ విఫల ప్రయోగాన్ని చెయ్యడానికి, ఆ విషప్రాయమైన ఔషధాన్ని భారత ప్రజల గొంతుల్లో బలవంతంగా పొయ్యడానికి కంకణబద్ధులై పని చేస్తున్నారు మన మావోయిస్టు అడవి వీరులు, అర్బన్ నక్సలైటు మేధావులు.



అసలు ఎవరో ఆయుధాలు సమకూర్చుకుని, విప్లవ సైన్యాన్ని చేర్చుకుని తాను చెప్పిన విప్లవాన్ని సాధించడానికి మన్నూ, మిన్నూ ఏకం చెయ్యాలని మార్క్స్ చెప్పలేదు. గతితార్కిక పరిణామాల ద్వారా చరిత్ర క్రమంలో ఎవ్వరూ ఆపలేని విధంగా శ్రామిక విప్లవం దానంతటదే వచ్చేస్తుందని తన మేనిఫెస్టోలో చెప్పారు. ఆయన చెప్పిన విధంగా ప్రపంచంలో ఏ ఒక్కచోట కమ్యూనిస్టు విప్లవం రాలేదు, కార్మికవర్గ నియంతృత్వం ఏర్పడలేదు. మన నక్సలైట్లు, లేక మావోయిస్టులు ఇంత పోరాటం ఆ విప్లవం కోసం చేస్తున్నారంటేనే.. మార్క్స్ చెప్పినట్లు చరిత్ర నడవడం లేదని, ఆయన సిద్ధాంతం, భవిష్యవాణి వట్టి కల్లలని రుజువైపోయింది కదా?!

అయినా ఇప్పటికీ కొందరు ఆ మార్క్స్ వాదాన్ని అంటిపెట్టుకుని అడవుల్లోనూ, నగరాల్లోనూ కొనసాగుతున్నారంటే అందుకు కారణం వాళ్లకు అధ్యయనం, చరిత్ర విశ్లేషణ లేకపోవడం. వాళ్లు మరో ప్రపంచపు అనుభవాల నుంచి ముఖం తిప్పుకోవడం, మార్క్సిజం చేత కట్టించుకున్న పుస్తెను తెంపుకోలేకపోవడం. అంతేకాదు వామపక్ష తీవ్రవాద బృందాలు వేర్పాటువాదులతో, మతతత్వపు ఉగ్రవాదులతో చేతులు కలపడం దేశ ప్రజల దృష్టిలో స్పష్టంగానే పడుతోంది. ఇది వాళ్ల నైరాశ్యానికి, వాళ్ల సిద్ధాంతంపై వాళ్లకే విశ్వాసం జారిపోయి వేరే దేన్నో పట్టుకుని వేళ్లాడుతున్న పరిస్థితికి నిదర్శనం. ఈ నిజాయితీ రాహిత్యం ఇంతటితో ఆగిపోవడం అన్ని విధాలా ఉత్తమం. అంతే కాదు. పత్రికల్లో వామపక్ష ప్రముఖుల ప్రస్తావనలు, చరిత్రలు ప్రచురించేటప్పుడు వాళ్లను విప్లవ వీరులంటూ కీర్తించే పద్ధతి మానెయ్యాలి. కవులు, రచయితలు ఆ విఫల విప్లవం పైన ఆకర్షణ, ఆరాధన కలిగించే పడికట్టు రచనలు చేయడానికి స్వస్తి పలకాలి. కమ్యూనిజం వచ్చిన కొత్తలో అది పేదలకు ఏదో మేలు చేస్తుందన్న విశ్వాసంతో, కొందరు సదుద్దేశంతోనే ఆ దారిలో నడిచారు. తమ మాట వినే వాళ్లను నడిపించారు. కానీ ఇప్పుడు ఆ విశ్వాసం పొరపాటు అని చరిత్ర చెబుతోంది. సమాజంలో అసమానతలు, అన్యాయాలు, పేదరికం ఉండవచ్చు. కానీ మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతం మాత్రం అందుకు పరిష్కారం కాదు. ఆయన చూపిన దారి అధోగతికే రహదారి.

పెట్టుబడిదార్లను ద్వేషించినంతగా మార్క్స్ ఇంకెవరినీ ద్వేషించలేదేమో. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా 'పెట్టుబడులను తీసుకువచ్చి, సంపదను సృష్టించి అభివృద్ధి సాధించాలి' అనే విధానమే ప్రపంచాన్ని నడిపిస్తోంది. మరైతే ఇక ఏ విప్లవం వర్ధిల్లాలి? పెట్టుబడిదార్లు, కార్మికులు కూడా సమాజ ప్రగతికి అవసరమే. ఒకరి వల్ల మరొకరికి అన్యాయం జరగకుండా ప్రభుత్వం, సమాజ వ్యవస్థ జాగ్రత్త వహించాలి తప్ప, ఏదో ఒక వర్గాన్ని నిర్మూలించేయడం ఆర్థిక వివేకం కాదు.

● వివి. సుబ్రహ్మణ్యం
రాజమహేంద్రవరం

ఓటర్ జాబితాల విశ్వసనీయత ఎంత?

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్)ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణలో భాగంగా దేశ సర్వోన్నత న్యాయస్థానం గత వారాంతంలో భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కు రెండు ముఖ్యమైన ఆదేశాలు జారీ చేసింది. అవి: ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్ల జాబితాను, తీసివేతకు కారణాలతో సహా ప్రచురించాలి; ఆధార్ కార్డును ఒక ధ్రువీకరణ పత్రంగా అంగీకరించాలి. 'సర్'ను సవాల్ చేసిన పిటిషన్లపై విచారణ ఇంకా కొనసాగుతోంది.

అయితే 'సర్'కు సంబంధించి, న్యాయసమీక్ష పరిధిలోకి రాని, అంశాలు కొన్ని ఉన్నాయి. అవి అసాధారణమైనవే కాదు, చాలా కలవరం కలిగిస్తున్నవి కూడా. ముందుగా పేర్కొనవలసినది సవరణ ప్రక్రియ పేరు. గతంలో ఓటర్ల జాబితా సవరణను ప్రత్యేక లేదా సంగ్రహ సవరణగా పేర్కొనేవారు. రెండోది సవరణను చేపట్టిన నిర్దిష్ట సమయం: ప్రత్యేక సమగ్ర సవరణ లాంటి కార్యక్రమాన్ని గతంలో ఎన్నడూ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందుగా నిర్వహించలేదు. మూడోది టైమ్ షెడ్యూల్: ఈ ప్రత్యేక సమగ్ర సవరణ తొలి దశను కేవలం 30 రోజులలో పూర్తి చేశారు. అభ్యంతరాలు, వాదనలను మరో 30 రోజుల్లో పరిష్కరిస్తారు. నాల్గోది 'సర్' పరిధి: ఇంతకు ముందు ఓటర్ల జాబితా సవరణకు అప్పటికి చివరిసారిగా జరిగిన సవరణను ప్రాతిపదికగా తీసుకునేవారు. అయితే బిహార్ 'సర్'కు 2024ఓటర్ల జాబితాలను ప్రాతిపదికగా తీసుకోలేదు. వాటిని పక్కన పెట్టేశారు. బిహార్‌కు పూర్తిగా సరికొత్త ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ 'సర్' లక్ష్యం, సందేహం లేదు. ఐదోది: ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఎనలేని ప్రాధాన్యమిస్తూ కొత్త ఓటర్ల పేర్లను చేర్చడంపై మౌనం వహించడం. ఎన్నికల సంఘం అనుసరిస్తున్న ఈ వైఖరి వింతగా ఉన్నది. ఈ ప్రత్యేక సవరణలో 64 లక్షల మంది ఓటర్ల పేర్లను జాబితాను తొలగించినట్టు ఈసీఐ వెల్లడించింది. వీరిలో 22 లక్షల మంది 'మరణించినట్టు', 7 లక్షల మంది పలు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేయించుకున్నారని, 36 లక్షల మంది బిహార్ నుంచి శాశ్వతంగా వలస పోయినవారు లేదా ఎటువంటి జాడ తెలియనివారు అని ఈసీఐ పేర్కొంది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

జనన మరణాలు సహజం. చనిపోయిన వ్యక్తుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం సరైన విషయమే. అయితే 18 సంవత్సరాల వయసు వచ్చిన యువతీ యువకుల పేర్లను ఓటర్ల జాబితాలో విధిగా చేర్చడం సముచితం కాదూ? ఇది ఎన్నికల సంఘం విధ్యుక్తధర్మం కాదూ? బిహార్ ముడి జనన రేటు (క్రూడ్ బర్త్ రేట్ – ఒక నిర్దిష్ట సంవత్సరంలో ప్రతి 1000 మంది జనాభాకు సంభవించే ప్రత్యేక జననాల సంఖ్యను సూచిస్తుంది. ఇది సంతానోత్పత్తి స్థాయి, జనాభా పెరుగుదలకు ప్రాథమిక సూచన) దృష్ట్యా 2024లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి 18 సంవత్సరాల వయస్సు వచ్చిన యువతీ యువకులు లక్షల సంఖ్యలో ఉంటారు. ఇది సందేహాతీతమైన వాస్తవం. మరి ఈ కొత్త వయోజనుల పేర్లను కొత్త జాబితాలో చేర్చారా? ఈసీఐ ప్రతిస్పందించలేదు. కారణమేమిటి? ఎవరికీ తెలియదు.

36 లక్షల మంది బిహారీలు 'శాశ్వతంగా వేరే ప్రదేశాలకు వెళ్లిపోయారని' లేదా 'జాడ తెలియనివారు' అన్న నిర్ణయానికి ఈసీఐ ఎలా వచ్చింది? ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారా? సంబంధిత వ్యక్తులు తాము శాశ్వతంగా బిహార్ నుంచి వెలుపలి ప్రదేశాలకు వలసపోయామని తమకు తామే అంగీకరించారా? సదరు 36 లక్షల మంది ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి ప్రయత్నించిందా? 'సాధారణంగా స్థానికుడు' అన్న భావన ప్రామాణికతకు న్యాయపరమైన వ్యాఖ్యానాన్ని త్రోసిపుచ్చి దానికి ప్రత్యామ్నాయంగా 'శాశ్వతంగా వలసపోయినవాడు' అన్న భావనను ఈసీఐ ఎప్పుడు, ఎందుకు ప్రవేశపెట్టింది? ఏ ఒక్కరికీ తెలియదు.

'సర్' కార్యక్రమానికి విశ్వసనీయత లేదు, పారదర్శకత లోపించింది, సమర్థించే సాక్ష్యాధారాలు, సహేతుకమైన నిర్ణయాలు కొరవడ్డాయి. అసలు ఈ ప్రత్యేక సమగ్ర సవరణను ముందస్తు భావనలతో చేపట్టినట్టు కనిపిస్తోంది. వాటిని నిరూపించేందుకే ఆ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నట్టుగా ఉన్నది.

జాతి జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. అయితే భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన 'సర్' కార్యక్రమం అందుకు పూర్తి విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది! 'సర్' అసలు ఉద్దేశం సంఖ్యానేక ప్రజల ఓటు హక్కును రద్దు చేయడమే. ఈ కారణంగానే తాము ఓటు హక్కు కోల్పోతామేమోనని బిహార్‌లో లక్షలాది ఓటర్లు భయపడుతున్నారు. ఈ ఏడాది చివరలో జరగనున్న శాసనసభ ఎన్నికలలో తాము ఓటు వేసేందుకు అనుమతి ఉండదేమోనని ఎంతో మంది బిహారీలు సహేతుకంగానే శంకిస్తున్నారు. 'సర్'ను ఇతర రాష్ట్రాలలో కూడా చేపడతారని తెలుస్తోంది. బిహార్‌లో ఆ ప్రక్రియ ఫలితాల ఆధారంగా చూస్తే కోట్లాది ప్రజల ఓటు హక్కు రద్దయ్యే అవకాశమున్నది.

కర్ణాటకలో ఓటర్ల జాబితాకు సంబంధించి బహిర్గతమైన మరొక వాస్తవం ప్రజాస్వామ్యవాదులను అమితంగా జడిపిస్తోంది. ఆ రాష్ట్రంలోని 28 పార్లమెంటరీ నియోజకవర్గాలలో బెంగళూరు సెంట్రల్ ఒకటి. ఆ లోక్‌సభా నియోజకవర్గంలో ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలు ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలలో బెంగళూరు సెంట్రల్ ఫలితాలు చూద్దాం. అందులోని ఎనిమిది శాసనసభా నియోజకవర్గాలలో ఒకటైన మహదేవపుర విషయాన్ని కాసేపు పక్కన పెడదాం. కాంగ్రెస్ అభ్యర్థి నాలుగు అసెంబ్లీ, బీజేపీ అభ్యర్థి మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలోను ఆధిక్యతలో ఉన్నారు. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నికర ఆధిక్యత 82,178 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థికి అనుకూలంగా ఉన్నది. ఇప్పుడు మహదేవపుర నియోజకవర్గ ఫలితాన్ని చూద్దాం. ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి 1,14,046 ఓట్ల ఆధిక్యత ఉన్నది. ఇది, కాంగ్రెస్ అభ్యర్థికి ఉన్న 82,178 నికర ఓట్ల ఆధిక్యతను రద్దు చేసి బీజేపీ అభ్యర్థికి 31,868 ఓట్ల మెజారిటీతో విజయాన్ని సమకూర్చింది. వీటికి తోడు పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని బీజేపీ అభ్యర్థి మొత్తం 32,707 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. స్పష్టంగా ఉన్న ఈ వివరాలు తుది ఫలితాన్ని అనుమానాస్పదం చేయలేదు.



బిహార్‌లో అమలుపరుస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు విశ్వసనీయత లేదు, పారదర్శకత లోపించింది. జనాభా ఏటా 0.89 శాతం చొప్పున పెరుగుతున్న దేశంలో ఓటర్ల జాబితా సవరణ ఏ విధంగా చేసినా ఓటర్ల సంఖ్య విధిగా పెరుగుతుంది. భారత ఎన్నికల సంఘం బిహార్‌లో చేపట్టిన సవరణ తద్విరుద్ధమైన ఫలితాలనే చూపిస్తోంది!

అయితే ఈ 32,707 ఓట్ల ఆధిక్యత ఎలా సాధ్యమయింది? ఈ విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. కాంగ్రెస్ అభ్యర్థి, ఆయన బృందం ఓటర్ల జాబితాలు, ఇతర డాక్యుమెంట్లను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి కొన్ని అసాధారణ తప్పులను కనుగొన్నారు. బలవత్తరమైన ఈ ప్రాథమిక సమాచారం ఆధారంగా బీజేపీ అభ్యర్థికి లభించిన ఆధిక్యతలోని గుట్టు తెలుసుకున్నారు. మితిమీరిన సంఖ్యలో విభిన్న ఓటర్లు ఒకే నివాసంలో ఉన్నట్టుగా నమోదయ్యారు; సదరు ఓటర్ల ఓటర్ కార్డుపై వారి తండ్రి పేరు 'Xtkaprbsu' అని అర్థంకాని విధంగా ఉన్నది. ఓటరు కార్డుపై ఓటర్ల వయసు '0' లేదా '124' అని ఉన్నది. ఇటువంటి ప్రాథమిక తప్పులు వేల సంఖ్యలో ఉన్నాయి.

ఓటర్ల జాబితాలో ఇటువంటి తప్పులు ఉన్నట్టు స్పష్టంగా వెల్లడయినప్పుడు వాటిపై విచారణ జరిపించవలసిన అవసరం లేదా? సామాన్య వ్యక్తి ఎవరైనా 'అవును, జరిపించాల్సిందే' అని వెన్వెంటనే ప్రతిస్పందిస్తాడు. అయితే మన ఎన్నికల సంఘం ఇంకెంత మాత్రం నియమబద్ధమైన ఒక మామూలు వ్యక్తిగా లేదా సంస్థగా వ్యవహరించడం లేదు! తాను రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థనని, ఎన్నికలతో ప్రమేయమున్న ఓటర్లు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు జవాబుదారీనికానని ఈసీఐ గర్విస్తోంది. బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై పౌర సమాజ ఆక్షేపణలు, రాజకీయ పార్టీల ఆరోపణల విషయమై పార్లమెంటు ఉభయ సభలలో చర్చించేందుకు గౌరవనీయ సభాపతులు ఇరువురూ విముఖత చూపుతున్నారు. దీనితో ఈసీఐ తనను తాను ఒక 'న్యాయస్థానం'గా భావించుకుంటూ రాజకీయ పార్టీలు, రాజకీయ నాయకులు అఫిడవిట్లు దాఖలు చేయాలని డిమాండ్ చేస్తోంది!

ఈ వ్యవహారంలో మహదేవపుర శాసనసభా నియోజకవర్గ ఓటర్ల జాబితా విశ్వసనీయత ఒక ప్రధాన వాదాంశం అన్న వాస్తవాన్ని ఎట్టి పరిస్థితులలోను విస్మరించకూడదు. పార్లమెంటులో దానిపై చర్చ జరగాలి. ఆ అంశం పైన కాకుండా అన్య అంశాలపై పార్లమెంటు దృష్టి పెట్టేందుకు అనుమతించకూడదు. ఈ విషయాన్ని మళ్లీ నొక్కి చెప్పుతున్నాను: ప్రధాన వాదాంశం ఓటర్ల జాబితాల విశ్వసనీయతే. మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందినవైనా లేదా బిహార్‌కు చెందినవైనా ఓటర్ల జాబితాల విశ్వసనీయతే ప్రధాన వాదాంశం. ఈ రోజు కాకపోయినా భవిష్యత్తులో ఈ మహోన్నత ప్రజాస్వామ్య దేశ ఓటర్లు తమ తీర్పు చెప్పే రోజునైనా భారత ఎన్నికల సంఘం కచ్చితంగా సమాధానమివ్వవలసి ఉంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమెరికా సుంకాలతో నష్టమెంత?

మన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రూపంలో ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ఈ నెల మొదట్లోనే 25శాతం సుంకాలు విధించగా, మరో 25 శాతం సుంకాలు వడ్డించబోతున్నట్టు 8వ తేదీన ప్రకటించారు. ఇది మరో ఇరవై రోజుల్లో అమల్లోకి రానుంది. ఈ పెంపు ఇక్కడితో ఆగుతుందా? లేక ఆయన గతంలో హెచ్చరించిన విధంగా 250 శాతం వరకూ పెరుగుతుందా అనేది చూడాలి. ట్రంప్ నిర్ణయం వల్ల మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే 8,500 కోట్ల డాలర్ల (రూ7.1 లక్షల కోట్ల) ఎగుమతులు ఒడుదుడుకుల్లో పడ్డాయి. ఎగుమతి ఆధారిత రంగాలూ, తెలంగాణ వంటి రాష్ట్రాలూ ఈ పరిస్థితులను ఎలా అధిగమించగలవన్నది పరిశీలించాల్సి ఉంటుంది.

రంగాల వారీగా చూస్తే వస్త్ర, ఆభరణాల రంగాలపై అమెరికా ఆంక్షల ప్రభావం ఉండే అవకాశముంది. అధిక సుంకాలవల్ల వీటికి డిమాండ్ తగ్గుతుంది. ఉత్పత్తి ఆ మేరకు పడిపోవచ్చు కూడా. ఔషధ రంగం విషయానికొస్తే 2023లో మన దేశం నుంచి 2,700 కోట్ల (రూ. 2.2లక్షల కోట్ల) విలువైన ఎగుమతులు సాగాయి. ఔషధాల ఎగుమతుల్లో అమెరికా వాటా గణనీయంగా ఉన్నా వీటిని ఇతర మార్కెట్లకు మళ్లించుకునే వీలుంది. దీంతో సంబంధం లేకుండా సహజంగానే మన ఎగుమతిదారులు కొత్త మార్కెట్ల వెదుకులాటలో పడతారు. సానుకూల వాణిజ్య ఒప్పందాలున్న ప్రాంతాలకూ, బలంగా ముందుకొస్తున్న ఆర్థిక వ్యవస్థలకూ ఎగుమతులను మళ్లిస్తారు. వాణిజ్యం ఎప్పటికీ నిలకడగా, నిబ్బరంగా ఉండాలంటే ఈ మళ్లింపు అవసరం.

దేశ ఐటీ, ఫార్మా రంగ ఎగుమతుల్లో తెలంగాణది ప్రధాన భూమిక. రాష్ట్రం నుంచి ఫార్మా రంగ ఎగుమతుల విలువ దాదాపు 5,500 కోట్ల డాలర్లు (దాదాపు రూ. 4.5 లక్షల కోట్లు). 2023 ఏప్రిల్ నుంచి 2024 డిసెంబర్ వరకూ రాష్ట్రం నుంచి 940 కోట్ల డాలర్ల (రూ.77,000 కోట్ల) విలువైన ఔషధ ఎగుమతులు సాగాయి. ఔషధ ఫార్ములేషన్ల ఎగుమతుల్లో రాష్ట్రం ఎంతో ముందుంది. 2024 ఏప్రిల్– అక్టోబర్‌ల మధ్య తెలంగాణ నుంచి 2.30 లక్షల కోట్ల ఫార్మా ఎగుమతులు సాగాయి. రాష్ట్రం నుంచి చేసిన మొత్తం వాణిజ్య ఎగుమతుల్లో ఫార్మా వాటా 26.9శాతం. ఈ ఏడు నెలల దూకుడును గమనిస్తే వార్షిక ఎగుమతులు 3.9 లక్షల కోట్లు మించుతాయని అంచనా. అందులో అమెరికాకు చేసిన దిగుమతులే దాదాపు రూ. 85,000 కోట్లు వుండొచ్చు. కాబట్టి సుంకాల ప్రభావం తీవ్రంగానే మన ఎగుమతులపై పడక తప్పదు. ఎగుమతుల మళ్లింపు వల్ల కొంతమేర ఈ రంగానికి రక్షణ దొరుకుతుంది. ఇక ఐటీ రంగానికి వస్తే రాష్ట్రం నుంచి ఐటీ ఎగుమతులు 2024–25లో రూ. 3 లక్షల కోట్లు. క్రితంతో పోలిస్తే ఈ పెరుగుదల 12శాతంగా ఉంది. ఐటీ రంగంలో 9.5 లక్షల మంది వృత్తి నిపుణులున్నారు. సర్వీస్ రంగంలో తెలంగాణ పాత్రేమిటో గణాంకాలు చెబుతాయి. ఈ రంగానికి సుంకాల బెడద ఇప్పటికైతే లేదు కాబట్టి నిబ్బరంగానే ఉండొచ్చు. అంతేకాదు.. దాదాపు రూ. 4.5 లక్షల కోట్ల ఎగుమతుల్లో సేవారంగం వాటా రూ. 3 లక్షల కోట్లు. ఎగుమతులపై పడే మొత్తం ప్రభావాన్ని సేవారంగం ఎగుమతులతో కొంత మేర తట్టుకునే అవకాశం ఉంటుంది.

ఇక్కడ గమనించాల్సిన మరో విషయం.. మనం ఎగుమతి చేస్తున్న జనరిక్ ఔషధాలను అమెరికా ఉత్పత్తి చేద్దామనుకుంటే అక్కడ ఆరు రెట్ల అధిక ధర పెట్టాల్సి ఉంటుంది. అంతేకాదు, అమెరికాలో లేదా వేరే దేశాల్లో ఉత్పత్తులు మొదలు పెట్టాలంటే అందుకు కనీసం 3నుంచి అయిదేళ్ల సమయం పడుతుంది. ధరల బాదుడుతో అక్కడి వినియోగదారులు నిండా మునుగుతారు. సిప్లా, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ వంటి సంస్థలు పేటెంట్ గడువు పూర్తయిన వందలాది జనరిక్ ఔషధాల్ని అమెరికాకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నాయి. నిరుడు మనం 870 కోట్ల డాలర్ల (రూ. 76,113 కోట్లు) ఔషధాలను ఎగుమతి చేయగా, మొత్తం ఎగుమతుల్లో దాని వాటా 11 శాతం. ఆర్థికరంగ నిపుణులు చెబుతున్నట్టు దేశీయ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, వ్యూహాత్మకంగా వేరే మార్కెట్ల అన్వేషణ కొనసాగుతున్నప్పుడు అమెరికా చర్యల ప్రభావం మనపై పెద్దగా ఉండకపోవచ్చు. ఐటీ, ఫార్మా రంగాల్లో మనకున్న శక్తి సామర్థ్యాలను సరిగ్గా వినియోగించుకుంటే ప్రస్తుత అనిశ్చితిని దాటడం ఏమంత కష్టం కాదు.

○ బిటి. గోవిందరెడ్డి
తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి
ముఖ్య సమాచార అధికారి

పార్టీపర రిజర్వేషన్లు మోసపూరిత ఆలోచన!

అధికారమనే పులి మీద స్వారీ చేయాలని కలగనేవాడు ముందుగా ప్రమాద సమయంలో ప్రాణాపాయం లేకుండా దాన్నుంచి దిగడం నేర్చుకోవాలి. అట్లా దిగడం నేర్చుకోనట్లయితే అంతిమంగా పులికి ఆహారం కావాల్సి వస్తది. ఇప్పుడు 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పరిస్థితి అలాగే ఉన్నది. రాహుల్ గాంధీకి ఉన్నంత చిత్తశుద్ధి తెలంగాణ పాలకులకు లేకపోవడంతోనే 42శాతం రిజర్వేషన్లు అమలు కావడం లేదనేది బహుజన బుద్ధిజీవుల వాదన.

2023 ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ జడ్చర్ల సభలో ప్రసంగిస్తూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణన చేపాడుతామని హామీ ఇచ్చాడు. ఈ హామీ మేరకు రేవంత్‌రెడ్డి సర్కారు ఫిబ్రవరి 4, 2024 నాడు కేబినెట్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అలాగే అసెంబ్లీలో ఫిబ్రవరి 16న తీర్మానం చేసింద్రు. ఎనిమిది నెలలు ఆలస్యంగానే అయినా అక్టోబర్ 10 (2024) నాడు కులగణన కోసం ఉత్తర్వులు జారీ చేసింద్రు. ఈ మేరకు సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన నవంబర్ 6 – డిసెంబర్ 25, 2024 మధ్య కాలంలో జరిగింది. తర్వాత ఫిబ్రవరి 2025లో మిగిలిపోయిన వారి కోసం రెండో విడత కులగణన కూడా జరిగింది.

ఈ సర్వే ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం మార్చి 17, 2025 నాడు రెండు వేర్వేరు బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఇందులో విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేది ఒక బిల్లు కాగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఆమోదించినది రెండో బిల్లు. ఇప్పుడు ప్రభుత్వం విద్యా, ఉద్యోగాల బిల్లుని అసలు పట్టించుకోవడం లేదు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుపైనే శ్రద్ధ చూపిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్ణీత కాల వ్యవధిలో ఎన్నికలు జరపనట్లయితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోతుండడంతో ఈ హడావిడి నడుస్తున్నది. అట్లాగే సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు కూడా ఆదేశించింది.

ఈ రెండు బిల్లులకు అసెంబ్లీలో అన్ని పక్షాలు మద్దతు ప్రకటించాయి. ఏకగ్రీవంగా ఆమోదాన్ని తెలిపాయి. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లులు ఆమోదించుకునేందుకు అఖిలపక్షాన్ని కేంద్రం దగ్గరికి తీసుకువెళతానని హామీ కూడా ఇచ్చాడు. అయితే రాజకీయ ఎత్తుగడలో భాగంగా అఖిలపక్షంగా వెళ్ళి ప్రధానిని కలిసి విన్నవించుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ ఆ దారిన కాకుండా కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ధర్నాకు పిలుపునిచ్చింది. నిజానికి అసెంబ్లీలో మద్దతు ఇచ్చినప్పుడు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని భారతీయ జనతాపార్టీ ఇప్పుడు ముస్లింలను బీసీల నుంచి తొలగించాలి అనే డిమాండ్‌ని ముందుకు తెస్తున్నది. అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకపోయి అందుకు కలిసి రాని పార్టీలను ప్రజల ముందట దోషిగా నిలబెట్టేందుకు అవకాశమున్నప్పటికీ ఆ మార్గాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంచుకోలేదు.

42శాతం రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్న సమయంలో గవర్నర్ ఆర్డినెన్స్ అదే విషయమై జారీ చేయడానికి వీలుండదని న్యాయనిపుణులు తేల్చి చెప్పినా రేవంత్ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్ సలహా కూడా తీసుకున్నామని ప్రకటించారు. మరి ఇంత పకడ్బందీగా తయారు చేసిన 285–ఎ పంచాయతీరాజ్ బిల్లు సవరణ ఆర్డినెన్స్ ఇప్పటికీ జారీ కాలేదు. గవర్నర్ ఈ బిల్లుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదం తెలుపడు అని కచ్చితంగా తెలిసినప్పటికీ రాజకీయ క్రీడలో భాగంగా సవరణ బిల్లుని గవర్నర్‌కు పంపించారు. ఈ బిల్లు ఇట్లా ఉండగానే ఢిల్లీలో ధర్నాకు పిలుపునిచ్చారు. ప్రధానిని కలిసి షెడ్యూల్-9లో రిజర్వేషన్లు చేర్చాలని ఒత్తిడి పెంచాల్సింది. కానీ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా బీజేపీ నేతలు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇవన్నీ బీసీ బిల్లు అమలు పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధిని శంకించేలా చేస్తున్నాయి.



ఇప్పుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయితేగానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు అని రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పిండు. నిజానికి ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ముందు నుంచే షెడ్యూల్–9లో తెలంగాణ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాలని పోరాటం చేసేది. అట్లా గాకుండా బీసీల ప్రయోజనాలు తాము మాత్రమే రక్షించగలం అనే ఒక నాటకీయతను ముందుకు తెచ్చింద్రు.

ఇప్పుడు రాహుల్‌గాంధీ ప్రధాని అయితేగానీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రావు అని రేవంత్‌రెడ్డి తేల్చి చెప్పిండు. నిజానికి ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ముందు నుంచే షెడ్యూల్–9లో తెలంగాణ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాలని పోరాటం చేసేది. అట్లా గాకుండా బీసీల ప్రయోజనాలు తాము మాత్రమే రక్షించగలం అనే ఒక నాటకీయతను ముందుకు తెచ్చింద్రు. జయలలిత ముఖ్యమంత్రిగా ఉండి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావుపై ఒత్తిడి తీసుకువచ్చి షెడ్యూల్–9లో చేర్పించి తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లను సాధించుకున్నారు. ఆ మార్గాన్ని సరిగ్గా వినియోగించుకొని అందుకు అడ్డుపడినట్లయితే బీజేపీని దోషిగా నిలబెట్టడానికి అవకాశమున్నప్పటికీ ఆ దిశలో రేవంత్ సర్కార్ చర్యలు శూన్యం. అఖిలపక్షంతో పాటు ఢిల్లీని తెలంగాణ ప్రజలతో దిగ్బంధనం చేయడానికి అవకాశమున్నప్పటికీ కాంగ్రెస్ సర్కారు ఆ దిశలో ఆలోచించలేదు. బీసీల పట్ల వారికి చిత్తశుద్ధి లేదని ఈ చర్యలు నిరూపిస్తున్నాయి.

ఇప్పుడు 42శాతం పార్టీపరంగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ కొత్త రాగమెత్తుకున్నది. ఈ విషయమై రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో చెప్పిండు కూడా! కాంగ్రెస్ పార్టీది మొదటి నుంచి మోసపూరిత ఆలోచన విధానమే! 2023 సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇద్దరు బీసీలకు అసెంబ్లీ టికెట్లు జైహూర్ తీర్మానం మేరకు కేటాయిస్తామని నమ్మబలికారు. తీరా నామినేషన్ దాఖలు చేసే తుదిగడువు దగ్గర పడుతున్న కొద్దీ తాత్సారం చేసి 34 సీట్లకు బదులు 19 సీట్లు కేటాయించారు. అందులో నాలుగు సీట్లు ఓల్డ్ సిటీలో ఇచ్చారు. అంటే ఇవన్నీ ఓడిపోయే సీట్లే అని తెలిసే వారికి కేటాయించారు.

42శాతం పార్టీపరంగా ఇచ్చినప్పటికీ అగ్రకులాల నాయకులు పార్టీలకు అతీతంగా బదులుకొని ఓడిపోయే సీట్లల్లో బీసీలను నిలబెట్టి, గెలిచే సీట్లను రెడ్లు, వెలమలకు కేటాయించే అవకాశమున్నది. చట్టపరంగా రిజర్వేషన్లు ఉన్నప్పుడు మాత్రమే బీసీలకు వాటా దక్కుతుంది. లేనట్లయితే అన్ని పార్టీలు కలిసి ఓడిపోయే సీట్లల్లో బీసీలకు టికెట్లిచ్చి, తర్వాత బీసీలకు టికెట్లిస్తే ఓడిపోతారు కాబట్టి వారికి టికెట్లివ్వకూడదు అనే నరేషన్‌ని ప్రచారంలో పెడుతారు. ఇప్పటికైనా 42శాతం రిజర్వేషన్లు సాధించే వరకు స్థానిక ఎన్నికలు వాయిదా వేయాలి. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలు చేయాలి. తాము పకడ్బందీగా చేశామని చెప్పుకుంటున్న కులగణన వివరాలను కోర్టు ముందుంచి 50 శాతం సీలింగ్ ఎత్తివేతకు న్యాయ పోరాటం చేయాలి. లేదంటే తెలంగాణ బీసీలందరినీ ఢిల్లీకి తరలించి రైతుల మాదిరిగా దేశ రాజధానిని దిగ్బంధం చేసే ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టాలి. అప్పుడు మాత్రమే కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో విశ్వసనీయత ఏర్పడుతుంది.



■ సంగిశెట్టి శ్రీనివాస్

- పకడ్బందీగా ఆరు గ్యారెంటీల అమలు
- ప్రగతి పరుగుకు రూ.వేల కోట్లు వ్యయం
- అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం
- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అవిరళ కృషి
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ



హనుమకొండలోని పరేడ్ గ్రౌండ్స్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి కొండా సురేఖ

పేదల సంక్షేమానికి పెద్దపీట



జెండా ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

హనుమకొండ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి ఆరు గ్యారంటీల వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఇందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గృహజ్యోతి, రాజీవ్ ఆరోగ్యశ్రీ మొదలైన పథకాలను అమలు చేస్తోందని అన్నారు. ఈ పథకాల ఫలాలను క్షేత్రస్థాయిలో అర్హులైన నిరుపేదలకు అందేలా కృషి చేస్తున్నామని అన్నారు. హనుమకొండ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి సురేఖ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోందని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, పథకాలను అందిస్తోందన్నారు. అన్నదాతల సంక్షేమానికి రూ. 1.13 లక్షల కోట్లను ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల మేర రుణమాఫీ చేసిందన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 9.12 కోట్ల మంది మహిళా ప్రయాణికులు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యాన్ని వినియోగించుకున్నారని, దీని ద్వారా రూ.372.99కోట్ల మేరకు లబ్ధిపొందారని తెలిపారు. వరంగల్‌లో సెంట్రల్ జైలు స్థలంలో 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.700 కోట్ల వ్యయంతో నయా ఉస్మానియా ఆసుపత్రి భవన సముదాయం నిర్మాణమవుతోందన్నారు. ఈ విద్యా సంవత్సరం బడిబాట కింద 5511 మంది విద్యార్థులు ప్రవేశం పొందారని చెప్పారు. వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవరాలకు రెండు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు అయ్యాయని చెప్పారు. జిల్లాకు క్రీడా పాఠశాల మంజూరైందని, తాత్కాలికంగా జేఎన్ఎస్ గ్రౌండ్‌లో దీని ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో 2024-25 యాసంగి సీజన్‌లో 157 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 29,964 మంది రైతుల నుంచి 1.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.297 కోట్లను, సన్నబియ్యానికి క్వింటాకు రూ.500 బోనస్ కింద రూ.15కోట్లను రైతులకు చెల్లించామని చెప్పారు. జిల్లాలో ఈ యేడు జనవరి నుంచి ఇప్పటి వరకు 12,101 కొత్త రేషన్ కార్డులు జారీ అయ్యాయని, 25,349 మంది కుటుంబ సభ్యులను అదనంగా చేర్చామని తెలిపారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో రూ.30కోట్లతో భద్రకాళి దేవాయం మాడవీధుల నిర్మాణం (మిగతా 8లో..)



నృత్యం ప్రదర్శిస్తున్న విద్యార్థిని



'ఆపరేషన్ సింధూర్' నృత్య రూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు



వ్యవసాయ డ్రోన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

తెలంగాణ రైజింగ్..

- 2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోంది
- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తాం
- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఖిలా వరంగల్‌లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు




ఖిలా వరంగల్‌లో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

వరంగల్ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ -2047 విజన్‌తో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ- కాకతీయులు పాలించిన నగరాన్ని రాజధాని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నగరాభివృద్ధి కోసం ఇప్పటికే రూ.5వేల కోట్లు కేటాయించామన్నారు. త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ప్రారంభిస్తామన్నారు. వరంగల్ ప్రజల చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్‌పోర్టు కల నెరవేరబోతోందని, ఇప్పటికే భూ సేకరణ కోసం రూ.205 కోట్లు విడుదల చేశామని అన్నారు. కాళోజీ కళాక్షేత్రం పనులను పూర్తి చేసి ప్రారంభించామని, వరంగల్‌లో కలెక్టరేట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. పాకాల బయో డైవర్సిటీ పార్కును అభివృద్ధి చేస్తున్నామని, భద్రకాళి ఆలయం చుట్టూ మాడ వీధులు, రాజ గోపురాల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు. దశాబ్దాలకాలంగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగుల కలను సాకారం చేస్తున్నామ న్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి ఎప్పటికప్పుడు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద, మేయర్ గుండు సుధారాణి, శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట శాసనసభ్యుడు కెఆర్ నాగరాజు, 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, డీసీపీ అంకిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాకాల పరవళ్లు

పూర్తిగా నిండటంతో మత్తడి దూకుతున్న సరస్సు

నర్సంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో గల పాకాల సరస్సు పూర్తిగా నిండి పరవళ్లు తొక్కుతోంది. 30 అడుగుల నీటి సామర్థ్యం కలిగిన సరస్సులోకి పూర్తి స్థాయి నీరు చేరడంతో నిండుకుండలా మారింది. కాగా, పాకాల సరస్సు మత్తడి పోస్తున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకులతో కలిసి సరస్సును సందర్శించారు. సరస్సు మత్తడి వద్ద టెంకాయ కొట్టి నీటిలో పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం తూము, మత్తడి ప్రదేశాలను పరిశీలించారు. చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ గుడి వద్ద టెంకాయ కొట్టి పూజలు చేశారు.



మత్తడి పోస్తున్న పాకాల సరస్సు

బొగత అదరహో...

ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో జలపాతం హోరు

వాజేడు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరాగా పేరుగాంచిన బొగత జలపాతం అందాలు అదరహో అంటున్నాయి. గత రెండు రోజులుగా ఓ మోస్తరుగా కురుస్తున్న వర్షాలకు జలపాతం వద్ద వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పాలనురగవలె కిందకు దుంకుతున్న జలధారలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. వరుస సెలవులు రావడంతో పర్యాటకులు భారీగా తరలివచ్చి జలపాతం అందాలను చూసి మురిసిపోతున్నారు. జోరు వానలో తడుస్తూ తన్మయత్వం పొందుతున్నారు. జలపాతం అందాలను కెమరాలు, సెల్‌ఫోన్‌లలో బంధిస్తూ మురిసిపోతున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత

జంగాలపల్లి జంక్షన్‌కు కొత్త కళ

ములుగు సమీపంలోని జంగాలపల్లి జంక్షన్‌కు కొత్త హంగు వచ్చి చేరింది. చేతిలో ఢమరుకం మోగిస్తున్నట్టుగా నిర్మించిన ప్రతిమను రాష్ట్ర మంత్రి సీతక్క శుక్రవారం రాత్రి ప్రారంభించారు. మేడారం, రామప్ప, లక్నవరం ప్రాంతాలకు వెళ్లే పర్యాటకులను ఈ నిర్మాణం విశేషంగా ఆకట్టుకోనుంది.

- ఆంధ్రజ్యోతి, ములుగు



సిరి చిట్‌ఫండ్స్ (ప్రై) లిమిటెడ్ వారి
సాదర ఆహ్వానము
33వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
E. RAJAIAH-KARUNA
Managing Director-Director
మా ఏజెంట్ మిత్రులకు, చిట్ సభ్యులకు, బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు ఆహ్వానం. మీ అందరి సహకారంతో సిరి చిట్‌ఫండ్ 33 సం॥లు పూర్తి చేసుకుని 34వ సంవత్సరంలోకి అడుగిడుతున్న శుభసందర్భంగా మిమ్ములను సాదరంగ ఆహ్వానిస్తున్నాము.
ఈ రోజు మ॥ 3-00 గం॥ల నుండి సా॥ 7-00 గం॥ల వరకు
ESTD :1992
సిరి చిట్‌ఫండ్స్ (ప్రై) లిమిటెడ్
ఇ.నెం.9-2-101నుండి104
సత్య హాస్పిటల్ ప్రక్కవీధి, గిర్మాజీపేట, వరంగల్.
సెల్: 9390103501, 9390103502

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- 22 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- ఆర్టీసీ డ్రైవర్, లారీ క్లీనర్ పరిస్థితి విషమం
- క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన పోలీసులు
- లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్
- జేసీబీతో బయటికి తీసిన పోలీసులు
- మైలారం వద్ద జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్



మైలారం శివారులో బస్సును ఢీకొన్న లారీ

రాయపర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీకొనడంతో బస్సు డ్రైవర్, కండక్టర్‌తో పాటు 22మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం (మిగతా 6లో..)



గాయాలపాలైన బస్సులోని ప్రయాణికులు



తీవ్రంగా గాయపడిన బస్సు డ్రైవర్ వెంకటయ్య

కమీషన్ మహాప్రభో..

రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా అందని డబ్బులు

- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు.. అయినా పట్టించుకోని వైనం
- అద్దెలు కట్టలేని దుస్థితిలో డీలర్లు
- ఎన్నికల హామీలు మరిచిన కాంగ్రెస్
- అధికారంలోకి వచ్చినా డీలర్ల వినతులు బుట్టదాఖలు
- ఆందోళనకు సిద్ధమవుతున్న డీలర్లు

హనుమకొండ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు అందడం లేదు. ఐదు నెలల బకాయిలు రాక డీలర్లు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కో డీలరుకు సుమారు రూ.14 వేలకు తక్కువ కాకుండా కమీషన్ డబ్బులు అందాల్సి ఉంది. ప్రతిష్ఠాత్మకంగా సన్న బియ్యం ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం.. అదే రీతిలో తమ కష్టాలను పట్టించుకుంటుందన్న డీలర్లకు నిరాశే ఎదురైంది. ఐదు నెలల బకాయిలు ఉండడంతో షాపుల అద్దెలు కూడా చెల్లించని దుస్థితి. దీనిపై సివిల్ సప్లయీస్ రాష్ట్ర ఉన్నతాధికారులు, మరోవైపు అధికార పార్టీ నేతలకు వినతులు సమర్పించినా స్పందించడం లేదని డీలర్లు వాపోతున్నారు. కమీషన్ల బకాయిలు మాత్రమే కాదు డీలర్లు సుదీర్ఘకాలంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఈ సమస్యలపై హామీ ఇచ్చింది. మ్యానిఫెస్టోలో కూడా పొందుపరిచింది. అంతటితోనే సరిపెట్టింది. డిమాండ్ల పరిష్కారం కోసం డీలర్లు విన్నవిస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో డీలర్లు సమస్యల సాధన కోసం ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

ఐదు నెలల కమీషన్ బకాయిలు

రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి కమీషన్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం జూన్ మాసంలోనే మూడు



మాసాల సన్న బియ్యం కోటాను లబ్ధిదారులకు అందచేసింది. మొత్తంగా ఐదు నెలల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు చెల్లింపులు జరగలేదని డీలర్లు వాపోతున్నారు. గతంలో కూడా కమీషన్ డబ్బులు నెలవారీగా క్రమంగా డీలర్లకు అందడం లేదు. బకాయిలు ఉండడం, ప్రభుత్వం కొన్ని నెలలవి చెల్లించడం, మరికొన్ని నెలల బకాయిలను పెండింగ్‌లో పెట్టడం పరిపాటిగా మారింది. రేషన్ బియ్యం సరఫరాలో కిలోకు రూ.1.40 పైసలు కమీషన్ రూపంలో డీలర్‌కు అందాల్సి ఉంటుంది. ఈ లెక్కన వంద క్వింటాళ్లను (మిగతా 6లో..)

Economy Classified Display COLOUR CLASSIFIED DISPLAY
ఆంధ్రజ్యోతి లో ప్రకటన ఇవ్వండి - అధిక ప్రచారం పొందండి
బ్లాక్ & వైట్ స్క్వేర్ సెం.మీ. Rs.170/-
ప్రతి మంగళ వారం & శుక్ర వారం కలర్ స్క్వేర్ సెం.మీ. మాత్రమే Rs.220/-
సింగిల్ మరియు డబుల్ కాలమ్స్ మాత్రమే...
వివరాలకు సంప్రదించగలరు
హన్మకొండ : 9985411172, 9985411677,
వరంగల్ : 9949638376, 9985408173
జనగామ : 9866431354, మహబూబాబాద్ : 9985418040
తొర్రూరు : 9985418040, జయశంకర్ : 9985401232
నర్సంపేట : 9949638376

కేయూలో మువ్వన్నెల జెండా పండగ



జెండాను ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకుని కేయూ పరిపాలన భవనం ఎదుట కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్సిటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు పేటెంట్లు, అవార్డు లు పురస్కారాలు పొందారని అన్నారు. కేయూ 50 ఏళ్లలో అడుగుపెడుతోం దన్నారు. ఎడ్‌సెట్-25, 23వ స్నాతకోత్సవాన్ని సక్సెస్ చేశామన్నారు. ఉద్యోగులకు ముఖగుర్తింపు హాజరును ప్రవేశపెడుతమన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడె ట్లు గౌరవ వందనం స్వీకరించారు. క్రీడపోటీల్లో గెలుపొందిన వారికీ బహుమతు లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈసీ మెంబర్లు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ చిర్రా .రాజుగౌడ్, డాక్టర్ సుకుమారి, డీన్ ప్రొ ఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, రాధికారాణి, భారవీశర్మ, దీపాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మహానీయుల త్యాగఫలమే స్వాతంత్ర్యం




ఉత్తమ సేవా పతక గ్రహీతలను అభినందిస్తున్న ఇంజారపు పూజ

మామునూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే స్వాతంత్ర్యం వచ్చిందని మామునూరు పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. మామునూరు పీటీసీలో శుక్రవారం ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులను అభినం దించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది వీరు లు వారి జీవితాలను అంకితం చేశారన్నారు. నేడు దేశ భవిష్యత్తు యువత చేతు ల్లో ఉందని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత వారి చేతుల్లోనే ఉందని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు భిక్షపతి, వేంకటేశ్వరరావు, విజయ్, సోమాని,మెడికల్ ఆఫీసర్ సుధీర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫోర్త్ బెటాలియన్‌లో...

మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో కమాండెంట్ రాం ప్రకాశ్ జాతీయ పతా కాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులకు పతకాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు కృష్ణ ప్రసా ద్, వీరన్న, బెటాలియన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



WANTED
★ Wanted Female Receptionist Speaking in English & Hindi Languages Qlf: Any Degree, SIM and SAMS at Warangal. Ph: 63037 80760
AJW-243127

WANTED
★ Wanted Teachers, Floor Incharges with Good English Skills, Pre primary mothers Teachers, Primary Telugu, Hindi, English Teachers are Required @ Gopalpur,Hnk. Cell: 6301616123
AJW-

WANTED
★ Wanted Trainig and Placement Officer (TPO) to work for Reputed Instituion Contact : 7396348774
AJW-243245

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సిస్టమ్ ఆపరేటింగ్ కావలెను. జీతం : 8,000/- నుండి 10,000/- సంప్రః 9666336163
AJW-243241

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- నుండి 14,000/- సంప్రః 9000463426
AJW-243242

WANTED
★ ఇంటర్ పూర్తి చేసి ఉన్న యువతి ఆఫీస్ అసిస్టెంట్‌గా చేయుటకు కావలెను జీతం : 9000/- సంప్రదించాల్సిన ఫోన్ నెం.: 9160210555
AJW-243130

WANTED
★ మా వద్ద పని చేయుటకు స్త్రీ, పురుషులు 6గురు కావలెను. వయస్సు: 30సం॥ల లోపు వారు ఉచిత వసతి, జీతం 10,000/-ల నుండి 15,000/- వరకు. సంప్రః 9849316058
AJW-237478

WANTED
★ Wanted Teachers, Floor Incharges with Good English Skills, Pre primary mothers Teachers, Primary Telugu, Hindi, English Teachers are Required @ Gopalpur,Hnk. Cell: 6301616123
AJW-243125

WANTED
★ Wanted Trainig and Placement Officer (TPO) to work for Reputed Instituion Contact : 7396348774
AJW-243245

WANTED
★ హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటి గార్డ్స్ మరియు సూపర్ వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 12,000/- నుండి 14,000/- సంప్రః 9000463426
AJW-243242

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఏటి

PLOT FOR SALE
★ వేగంగా అభివృద్ధి చెందుతున్న GWMC వరంగల్ NH 163 (200 Ft), PROPOSED : 300 Ft రింగ్ రోడ్డు ఫేసింగ్, రాంపూర్ లేఔట్ వెంచర్ D.P.No. 3006/2023 లో ప్లాట్స్ కలవు. కావలసిన వారు సంప్రః 9010005556
AJW-243120

FLATS FOR SALE
★ Ready to Occupy 1BHK, 2BHK, 3BHK Flats with all Facilities are for sale @ 941 Sqft to 1914 Sqft with Reasonable Prices at Vikas Nagar & Basit Nagar HNK. Cell.No: 8897221187, 9177592357.
AJW-243126

TO - LET
★ కొత్తగా నిర్మించిన DNL రెసిడెన్షియల్ 3rd Floor లో 2BHK అద్దెకు ఇవ్వబడును. Govt Employeesకు ప్రాధాన్యత, కారు పార్కింగ్ సౌకర్యం కలదు. దేశాయిపేట రోడ్, టీచర్స్ కాలనీ, వరంగల్ సంప్రః సెల్ : 9440721207
AJK-238626

TO - LET
★ శివనగర్ SBI ఎదురుగా TCI ట్రాన్స్పోర్ట్ పైన ఫస్ట్‌ఫ్లోర్ 2 పోర్షన్‌లు ప్రతి పోర్షన్‌కు 3 రూములు కలవు. ప్రతి పోర్షన్‌కు రెంటు 7000/- 24 గంటలు మున్సిపల్‌వాటర్ మరియు బోర్ వాటర్ కలదు. సం॥ ప్ర॥ సెల్ : 9949692666
AJW-27922

TO - LET
★ E/F Building Commercial Purpose for Banking and Finance Service Chits Funds, Dr. Clink, Medical Shops & Office's Etc. Meain Kahammam Road Mills Colony, Police Station Opp : Shambhunipet, Warangal Cell 8074693659
AJW-243247

PLOT FOR SALE
★ 2 Plots for sale, each measuring 500 sq. yads E/F Main Road Rampur Hanumakonda Opp. Bharath Petrol Pump. Ph 8977727776
AJW-01298

SERVICES
★ ఎవరైనా డిగ్రీ పూర్తి చేసి ఉన్నటయితే ఉద్యోగ అవకాశం కల్పించబడును. ట్రైనింగ్ ఇచ్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ ఇప్పించబడును. రెజ్యూమ్. సెల్ : 80965 20976
AJW-8641

WATER PROOFING
★ Buildings Leakages, Roof or Slabs, Ceiling, Walls (Dampness), Painting Works etc,. Solved by Chemicals. Cell : 9581714916.
AJW-243128

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9949638376
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9949638376
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232



కుడా కార్యాలయంలో జెండాకు సెల్యూట్ చేస్తున్న చైర్మన్ తదితరులు



చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న సీపీ



బల్దియాలో జెండా వందనం చేస్తున్న మేయర్, కమిషనర్ తదితరులు

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలను కలెక్టరేట్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ సత్యశారద జాతీయజెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీక రించారు. అనంతరం అధికారులకు, సిబ్బందికి, విద్యార్థులకు శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆ ర్వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్, పర్యవేక్షకులు రమేశ్, చంద్రశేఖర్, మంజుల, పవన్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ పతాకాన్ని కలెక్టర్, జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి సత్యశారద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కమిషనరేట్‌లో..

వరంగల్ క్రైం: పంద్రాగస్టు పురస్కరించుకొని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ జాతీయ జెండా విష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, చిన్నారులకు సీపీ స్వీట్లు అందజేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



జాతీయజెండాకు వందనం చేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, సురేశ్‌కుమార్, ఏసీపీలు, పరిపాలన విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో..

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ గుండు సుధారాణి హాజ రై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో పాటు అధికారులు జాతీయ జెండాకు వందనం చేశారు. మేయర్ జీడబ్ల్యూఎంసీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిసిన స్వీట్లు పం చారు. సంవత్సర కాలంలో పాటు ఉత్తమ సేవలందిన అధికారులకు, సిబ్బందికి మేయర్, కమిషనర్ చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ మేయ ర్ రిజ్వాన షమీం, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఇన్‌చార్జి ఎస్‌ఈ మహేందర్, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడే కర్, బల్దియా జాక్ ప్రధాన కార్యదర్శి భాకం సంతోష్, వర్కింగ్ ప్రెసిడెం ట్ రాజారపు భాస్కర్, నాయకులు పోశాల స్వామి గౌడ్, బాలునాయక్, రామకృష్ణ, రావుల ఆనంద్, పలు డివిజన్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కుడా కార్యాలయంలో..

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించి నాటి త్యాగధనుల గురించి విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్, కుడా సీపీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, ఆర్‌డీఎంఏ షాహిద్ మసూద్, ఆర్‌డీఎంఏ కార్యాలయ సిబ్బంది మురికి శ్రీనివాస్, గుర్రపు శ్రీనివాస్‌తో పాటు కుడా, ఆర్‌డీఎంఏ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు.

ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో..

రాంనగర్: ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం ప్రా జెక్ట్ డైరెక్టర్ వంగూరు మోహన్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ విభాగం గౌరవ వందనం సమర్పించింది. అనంతరం మోహన్ రావు విద్యుత్‌సంస్థలో తీసుకువచ్చిన పలు సంస్కరణలు తద్వారా జరిగి న పురోగతిపై ప్రసగించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, మదుసూదన్, సీఈలు అశోక్‌కుమార్, తిరుమల్‌రావు, రాజ్‌చౌహాన్, అశో క్, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న సంపత్‌రావు

ప్రశంసాపత్రాన్ని అందుకున్న ఢిల్లీ సంపత్‌రావు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర ప్రజల మలమూత్రాలు సేకరించి మున్సిపాలిటీ ప్లాంట్‌తో పాటు ఎఫ్ఎస్‌టీపీకి అత్యంత ఎక్కువ లోడ్లు పంపిం చినందుకు కాంట్రాక్టర్ ఢిల్లీ సంపత్‌రావు సేవలను గుర్తించి ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని అందించారు. శుక్రవారం జీడ బ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడు కల కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని స్వీకరించారు.

డీసీసీ బ్యాంకులో కృతజ్ఞత కార్యక్రమం

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన మార్నేని

హనుమకొండ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా సహకార బ్యాంకు లు, ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గాల గడువు పెంపుపై టెస్కాబ్ చైర్మ న్ మార్నేని రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలియచేశారు. శుక్రవారం హనుమకొండ లోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 'కృతజ్ఞత కార్యక్రమం' మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమం త్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేంనరేందర్‌రెడ్డి తదితరుల చిత్రపటాలకు క్షీరా భిషేకం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు.

రైతులకు ఉత్తమ సేవలు అందించడంలో నిరంతరం చిత్తశుద్ధితో కృషి చేస్తా మన్నారు. ఈ కార్యక్ర మంలో డైరెక్టర్లు హరిప్రసాద్, రమేశ్, గోపాలరావు, మురళి, నరసింగరావు, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాజేశ్‌ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేం దర్‌రావుతోపాటు మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌గౌడ్, బ్యాంకు సీఈవో వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మార్నేని రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్

ఎలక్ట్రిసిటీ బిల్ కలెక్షన్ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎల క్ట్రిసిటీ బిల్ కలెక్షన్ ఏజెంట్ల సమస్యలు తక్షణమే పరిష్కరిం చాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం-327 రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగి న బిల్‌కలెక్షన్ ఏజెంట్ల రాష్ట్రస్థాయి సమావేశంలో శ్రీధర్ మాట్లా డుతూ.. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న బిల్ కలెక్షన్ ఏజెంట్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో రోజు కు 200నుంచి 300మంది బిల్ కట్టే వినియోగదారులు ఉండేవా రని, గృహజ్యోతి వచ్చిన తర్వాత 50 నుంచి 100వరకు తగ్గారని అన్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించే వారు ఎక్కువ అవ డంతో ఏజెంట్ల రెమ్యునరేషన్ తగ్గిపోయిందన్నారు. విద్యుత్ యా జమాన్యాలు వెంటనే కలగజేసుకుని నెలరోజులు పూర్తిగా పని కల్పించేలా చొరవ చూపి ఆర్టిజన్‌లగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిల్ కలెక్టర్లు కరుణాకర్, రవికుమార్, దేవిరెడ్డి, నవీన్, రజిత, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

(5వ పేజీ తరువాయి)

జరిగింది. ఎస్ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 44 మంది ప్రయాణికు లతో వరంగల్ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తుంది. మండలం లోని మైలారం శివారు ఎస్సారెస్పీ కాల్వ బ్రిడ్జి సమీపంలోకి రాగానే, తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కంటైనర్ లారీ... బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ గడ్డం వెంకటయ్య, లారీ డ్రైవర్ కిష్టయ్యతో పాటు బస్సులో ఉన్న ప్రయాణికులు దేవకమ్మ, అర్చన, శ్రావణి, శ్రీచేతన, ఆరా ధ్య, కేతమ్మ, రాధమ్మ, యాకూబ్, వెంకటరమణ, లారీ క్లీనర్ నయీం, రత్నంలు తీవ్రంగా గాయపడగా ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అలాగే సుంకరి స్వామి, భీమరాజు, సుభాష్, సావిత్రి, ఎల్లయ్య, శ్రీలత, విమల, ఇంతి యాజ్‌ఖాన్‌లను వర్ధన్నపేట క్లస్టర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ గడ్డం వెంకటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చారు. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో స్థానిక ఎస్ఐ రాజేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో బయటకు తీశారు. ప్రమాద స్థలానికి స్థానిక ఎమ్మెల్యే యశస్వి నిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలతో పాటు వెస్ట్‌జో న్ డీసీపీ రాజమహేందర్ నాయక్, ఏసీపీ నర్సయ్య, వర్ధన్న పేట ఎస్ఐ చందర్ చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో వాహనాలను జేసీబీతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

వర్ధన్నపేట ఆస్పత్రిలో చికిత్స

వర్ధన్నపేట(ఆంధ్రజ్యోతి): రాయపర్తి మండలం మైలారం వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటనలో 20 మందికి పైగా తీవ్ర గాయాలు కాగా, వారిలో 8 మందిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు. ఇందులో ఊరుగొండ ప్రేమ్, సుంకరి స్వామి, సంగినేని భీమ రాజు, మట్టపల్లి సుభాష్, పేరుబోయిన సావిత్రి, జనిగల ఎల్ల య్యశ్రీలత దంపతులు, రావుల విమల తదితరులు ఉన్నారు. లారీ క్లీనర్ ఇంతియాజ్‌ఖాన్‌కు తీవ్ర గాయాలై పరిస్థితి విష మంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిలో మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన పలువురి బంధువులు ఉండడంతో వారితో ఆసుపత్రి ఆవరణం నిండిపోయింది.

25లోపు స్పోర్ట్స్ పాఠశాల ఏర్పాట్లు పూర్తి చేయాలి

● హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): జేఎన్ స్టేడియంలో తాత్కా లికంగా ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ పాఠశాల నిర్వహణ కోసం ఈ నెల 25వ తేదీలోపు పనులు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ స్పోర్ట్స్ అధికారులకు అదేశాలు జారీ చేశారు. శుక్రవారం హనుమకొండలోని జేఎన్ స్టేడియాన్ని కలెక్టర్ స్నేహ శబరీష్ స్పోర్ట్స్ అధి కారులతో కలిసి సందర్శించి స్పోర్ట్స్ పాఠశాల నిర్వహణ పనులకు పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాత్కాలికంగా జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ పాఠశాలలో అడ్మిషన్లు పొందనున్న విద్యార్థు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన సౌకర్యాలు కల్పిం చాల ని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



జేఎన్ స్టేడియాన్ని సందర్శించిన కలెక్టర్ స్నేహ శబరీష్

చిన్ని కృష్ణయ్యా.. రావయ్యా..

నేడే శ్రీకృష్ణ జన్మాష్టమి
వేడుకలకు ముస్తాబైన ఆలయాలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని శనివారం ఘ నంగా నిర్వహించేందుకు నగరంలోని ఆలయా లు ముస్తాబయ్యాయి. ప్రసిద్ధ భద్రకాళి అమ్మ వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు, హోమా లు, యాగాలు, వ్రతాలు, కృష్ణుడి అలంకరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా భద్రకాళి అమ్మవారి దేవా లయంలో కృష్ణుడి పూజలు కొనసాగుతాయి. శ్రీ కృష్ణ అష్టమి రోజునే అమ్మవారు కూడా జన్మిం చారని, అందుకే భద్రకాళి అమ్మవారి దేవాల యంలో శనివారం కాళీకామాత జన్మదినంగా శ్రీకృష్ణ మూల మంత్రంతో వైష్ణవ యాగాన్ని నిర్వహిస్తామని ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. వీటితో పాటు తులసీ దళాలతో గో పాల సహస్ర నామాలతో అమ్మవారికి ప్రత్యేక అర్చన చేస్తామన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు న కృష్ణుడి వ్రతాన్ని అమ్మవారి సన్నిధిలో నిర్వ హిస్తామని, సాయంత్రం అమ్మవారిని శ్రీకృష్ణు డిగా అలంకరించి 54 రకాల నైవేద్యాలతో మహా మంగళహారతి నివేదించి అర్థరాత్రి వరకు భక్తులకు దర్శనానికి ఏర్పాట్లు చేస్తామని తెలిపారు.

పోతన రోడ్డులోని మురళీకృష్ణ మందిరంలో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఉద యం నుంచి సాయంత్రం వరకు కృష్ణుడి నా మం అఖండ పారాయణం, అభిషేకం, అర్చన లు కొనసాగుతాయి. శనివారం రాత్రి 11 గంట ల నుంచి శ్రీకృష్ణుడికి ప్రత్యేక అభిషేకాలు, 108 రకాల నైవేద్యాలు, పవలింపు సేవతోపాటు భగ వద్గీత పద్యపఠన పోటీల్లో విజేతలకు బహుమ తుల ప్రదానం ఉంటుందని సుందర సత్సంగ్ అధ్యక్షుడు ఎస్. నర్సింగరావు తెలిపారు. ఈ వేడుకలకు అడిషనల్ కలెక్టర్ జి. సంధ్యారాణి హాజరవుతారని అన్నారు. ఇక ములుగురోడ్డు లోని ఇస్కాన్ మందిరంలో శనివారం ఉదయం నుంచి అర్థరాత్రి వరకు శ్రీకృష్ణుడికి అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, భజనలు, ప్రత్యేక పూజలు, నైవేద్య నివేదనలు నిర్వహిస్తారు. గీతా భవన్‌లో కృష్ణాష్టమి పూజలు, భగవద్గీత పారాయణం, విష్ణు సహస్ర పారాయణం నిర్వ హిస్తారు. ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చి దానంద వరద దత్తక్షేత్రంలో సామూహిక అన ఘాష్టమి వ్రతాలు నిర్వహిస్తామని ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు.

కమీషన్ మహాప్రభో..

(5వ పేజీ తరువాయి)

సదరు డీలర్లు పంపిణీ చేస్తే రూ.14వేలు కమీషన్ రూపంలో అందాల్సి ఉంటుంది. ఈ లెక్కలు ఆయా రేషన్ షాపునకు సరఫరా అయ్యే బియ్యం కోటా, పంపిణీ ఆధారంగా పరిగణించడం జరుగుతుంది. హనుమకొండ జిల్లాలో మొత్తం 414 మంది రేషన్ డీలర్లు ఉన్నారు. వీరందరికి కమీషన్ బకాయిలు ఉండడంతో షాపుల నిర్వహణ కష్టంగా మారింది.

కమీషన పెంపుపై నిర్లక్ష్యం

పాలకవర్గాలు డీలర్ల కమీషన్ పెంపుపై నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా డీలర్ల సమస్యలను పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై డీలర్లు ఆశలు పెట్టుకున్నారు. కానీ కమీషన్ పెంపు సమస్య పరిష్కారం కాలేదు. ప్రస్తు తం క్వింటాల్‌కు రూ.140 కమీషన్ ఉండగా దీనిని రూ.300లకు పెంచాలని డీలర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. కమీషన్ తక్కువగా ఉండడంతో అద్దెలు ఇతరాత్ర చెల్లింపులకే సరిపోతుందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గౌరవ వేతనం మాటే లేదు..

రేషన్ డీలర్లు గౌరవ వేతనం కల్పించాలని పదే ళ్లకు పైగా విజ్ఞప్తి చేస్తున్నారు. కేరళ, తమిళనాడు తరహాలో గౌరవ వేతనం ఇవ్వాలనేది డీలర్ల వాదన. రూ.30వేల గౌరవ వేతనాన్ని అంద చేయాలని పాల కవర్గాలను కోరుతున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో గౌరవ వేతనం కల్పన పొందుపరచడం జరిగిందని డీలర్లు చెబుతున్నారు. రెండేళ్లు గడిచినా ఇప్పటి వర కు ప్రభుత్వం స్పందించడం లేదంటున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా గౌరవ వేతనం ఇస్తామని ప్రకటించిన సంగ తిని డీలర్లు ప్రస్తావిస్తున్నారు.

డీలర్ల ప్రధాన డిమాండ్లు

● గౌరవ వేతనం పెంపుతో పాటు రూ.300 కమీ షన్ పెంపు
● బియ్యం దిగుమతి చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలి
● వే బ్రిడ్జిల ద్వారా తూకం వేసి బియ్యం బస్తా లను సరఫరా చేయాలి
● కరోనాతో మృతి చెందిన డీలర్లకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
● రెన్యూవల్స్ శాశ్వత ప్రాతిపదికన జరగాలనే తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

ప్రభుత్వం వెంటనే స్పందించాలి



ప్రభుత్వం డీలర్ల సమస్యలపై తక్షణమే స్పందించాలి. కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో డీలర్ల పాత్ర కీలకంగా ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫె స్టోతో డీలర్లు కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. డీలర్లకు ప్రతీ నెల క్రమం తప్పకుండా కమీషన్ బకాయిలు చెల్లించాలి. గౌరవ వేతనంగా రూ.30వేలు అందించాలి. డీలర్ మృతి చెందితే దహన సంస్కారాల కోసం ఆ కుటుంబానికి రూ.30వేలు ఇవ్వాలి. హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడం, డీలర్లకు 2బీహెచ్‌కే ఇవ్వడంతో పాటు హైదరాబా ద్‌లో రేషన్ భవన్ నిర్మాణానికి స్థలం కేటాయింపు తదితర డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించా లని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యలను తీరుస్తుందనే ఆశాభావంతో ఉన్నాం.

- బత్తుల రమేశ్ బాబు, రేషన్ డీలర్ల తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు





పహల్గాం దాడి ఘటనపై హంటర్‌రోడ్డులోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యార్థుల నృత్యరూపక ప్రదర్శన →



పరేడ్ గ్రౌండ్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు



దేశభక్తి గీతానికి జీహెచ్‌ఎస్ (హనుమకొండ) విద్యార్థుల నృత్యం



జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఖిలావరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, హనుమకొండ పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, ములుగు తంగేడు మైదానంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ విప్ రాంచందర్ నాయక్, జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర గిరిజన సహకార ఆర్థిక అభివృద్ధి సంస్థ (ట్రైకార్) చైర్మన్ బెల్లయ్యనాయక్ ముఖ్య అతిథులుగా హాజరై మువ్వన్నెల జెండాలను ఎగురవేశారు. పోలీసులు చేత గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమర యోధులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. గత 20 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను ఆకట్టుకున్నాయి.



స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి కొండా సురేఖ



జనగామలోని ధర్మకంచ మినీ స్టేడియంలో వేదికపై అతిథులు



అధిక మార్కులు సాధించిన విద్యార్థినికి నగదు ఇస్తున్న మంత్రి



వరంగల్ వేడుకల్లో ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వరంగల్‌లో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న గౌతమ్ యాదవ్, శివకుమార్



మహబూబాబాద్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు



హనుమకొండ పరేడ్ గ్రౌండ్ జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సురేఖ



హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



మహబూబాబాద్‌లో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్న రాంచందర్‌నాయక్, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ



భూపాలపల్లిలో స్వాతంత్ర్య సమరయోధుడు కిషన్‌రావును సన్మానిస్తున్న ట్రైకార్ చెర్మన్ బెల్లయ్యనాయక్



భూపాలపల్లిలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు



ములుగులో స్టాళ్లను తిలకిస్తున్న మంత్రి సీతక్క



ములుగు తంగేడు మైదానంలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అలరించిన విద్యార్థుల నృత్యాలు



వరంగల్ వేడుకల్లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సాంస్కృతిక ప్రదర్శన ఇచ్చిన హనుమకొండ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో వాసంతి. చిత్రంలో పాఠశాల హెచ్‌ఎం కె.రమేశ్‌బాబు, సిబ్బంది

వరంగల్ క్రైం/హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టు 79వ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉగ్రమూకలు భారత పౌరులపై ఇటీవల చేసిన దాడి, తిరిగి భారత సైనికులు ఆపరేషన్ సిందూర్ పేరిట తిప్పికొట్టిన చర్యలను హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు కళ్లకుకట్టినట్లు ప్రదర్శించి వీక్షకులను ఆకట్టుకున్నారు. అలాగే 'పాడవోయి భారతీయుడా..' అనే పాటకు హనుమకొండ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు చేసిన బృంద నృత్యం అతిథులను ఆకట్టుకుంది. బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రం, మడికొండలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, భీమారంలోని పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థులు పలు దేశభక్తి పాటలకు నృత్యాలు చేశారు. వీరిని మంత్రి సురేఖ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.

మంత్రి సురేఖకు పోలీసుల గౌరవ వందనం

వరంగల్ క్రైం/హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 79వ పంద్రాగస్టు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖకు పోలీస్ సాయుధ బలగాలు గౌరవ వందనం సమర్పించారు. ఏఆర్ ఏసీపీ నాగయ్య పరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా 5 ప్లాటూన్‌లుగా విడిపోయి పోలీసులు నిర్వహించిన కవాతు అందరిని అబ్బురపరిచింది. అనంతరం స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ఉత్తమ ఉద్యోగులను మంత్రి సురేఖతో పాటు వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, డీసీపీ షేక్ సలీమా, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిలు అభినందించి ప్రశంశాపత్రాలను అందజేశారు. కాగా, వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను అతిథులు సందర్శించి ఆయా శాఖలు చేస్తున్న పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు కొనియాడారు.

ఖిలాలో కనులపండువగా వేడుకలు

జాతీయ జెండా ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి

ఖిలావరంగల్/వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలావరంగల్ ఖుష్‌మహల్ మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఉదయం 9.30 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ సత్యశారదతో కలిసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధులకు శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాయపర్తి కేజీబీవీ పాఠశాల, జడ్‌ఎంఎస్ పాఠశాల, టీఆర్‌ఈఎస్ నెక్కొండ పాఠశాల, జల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఉత్తమ సేవలు అందించిన అధికారులకు మంత్రి పొంగులేటి, కలెక్టర్ సత్యశారద ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఆకట్టుకున్న స్టాల్స్

వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ సత్యశారదతో కలిసి సందర్శించారు. డీఆర్‌డీఏ, మెప్మా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా సంక్షేమశాఖ, సఖి వన్‌స్టాప్ సెంటర్, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలు, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయగా మంత్రి ఒక్కో స్టాల్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో మంత్రి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో పిండి వంటలను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ సురేశ్, బైరబోయిన ఉమా దామోదర్ యాదవ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కూలి డబ్బులతో జెండా కొనుగోలు చేసి..

ఎగురవేసిన వృద్ధురాలు

గూడూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరానికి చెందిన వృద్ధురాలు రాధమ్మ కూలి డబ్బులతో జాతీయ జెండాను కొనుగోలు చేసి శుక్రవారం ఇంటి వద్ద జాతీయ జెండాను ఎగురవేసింది. రాధమ్మ భర్త దీకొండ కృష్ణమూర్తి గత 30 సంవత్సరాలుగా జాతీయ జెండా ఎగురవేస్తూ దేశభక్తిని చాటుకున్నాడు. గత సంవత్సరం కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. తన భర్త జ్ఞాపకాలకు గుర్తుగా రాధమ్మ జెండాను కొనుగోలు చేసి ఇంటి ముందు ఆవిష్కరించింది. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలను ఆహ్వానించింది.



మహబూబాబాద్ జిల్లా సీతానగరంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వృద్ధురాలు దీకొండ రాధమ్మ



కాన్సులేట్ జనరల్ నుంచి అవార్డును అందుకుంటున్న రవి కుమార్ ←

న్యూజిలాండ్‌లో ఒగ్గు డోలు మోత

లింగాలఘణపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ సాంస్కృతిక వైభోగ యశస్సు న్యూజిలాండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలానికి చెందిన ఒగ్గు కళాకారుడు డాక్టర్ ఉస్తాద్ చౌదరిపల్లి రవికుమార్, ఒగ్గు డోలు కళాకారుడు మరికుక్కల అశోక్‌కు అక్లాండ్‌లో జరిగిన భారత స్వాతంత్ర్య దిన వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. పోతురాజు వేషధారణలో విన్యాసాలు అలరించాయి. రవికుమార్‌తో పాటుగా తెలంగాణ కళాకారులను న్యూజిలాండ్ కాన్సులేట్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ శెట్టి, న్యూజిలాండ్ ఇండియన్ హైకమిషనర్ నీతాభూషణ్ అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

ఎర్రకోట స్వాతంత్ర్య సంబరాల్లో నెల్లుట్ల కార్యదర్శి

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రొండ్ల శ్రీనివాస్‌రెడ్డి

లింగాలఘణపురం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఎర్రకోటలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనే అద్భుతమైన అవకాశం జనగామ జిల్లా నెల్లుట్ల పంచాయతీ కార్యదర్శి రొండ్ల శ్రీనివాస్ రెడ్డి దక్కించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నూటికి నూరు శాతం ఫలితాలను సాధిస్తున్న పంచాయతీలను కేంద్రం గుర్తించి భారత స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనేందుకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం అందించారు. దీంతో జల సమృద్ధి యోజన పథకంలో గతంలో నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపారాణి భూపాల్‌రెడ్డి జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డు అందుకుని రికార్డుకెక్కారు. తాజాగా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిని కేంద్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జలసమృద్ధి యోజన పథకంలో ఉత్తమ ఫలితాలను సాధించినందుకు సత్కరించింది.



కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ద్వారా అవార్డును అందుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

నలుగురు ప్రొఫెసర్లతో దర్యాప్తు కమిటీ ఏర్పాటు

కేయూ క్యాంపస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై నలుగురు ప్రొఫెసర్లతో దర్యాప్తు కమిటీని నియమిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు వెలువరించారు. 2011-13 ఏడాదిలో యూజీసీ న్యూఢిల్లీ పోస్టు డాక్టోరల్ ఫెల్లోషిప్‌తో పాటు కేయూ నుంచి పార్టుటైమ్, కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేస్తూ ఏకకాలంలో డబ్బులు క్లెం చేశారని ఇటీవల రిజిస్ట్రార్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదులందాయి. ఈ నేపథ్యంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆమోదంతో నలుగురు ప్రొఫెసర్లతో పాటు డిప్యూటీ రిజిస్ట్రార్‌లతో విచారణ కమిటీని నియమించారు.

కష్టపడ్డది మేము.. అనుభవించేది మీరా?

మంత్రి కొండా సురేఖకు సమరయోధుడి ప్రశ్న

వరంగల్ క్రైం/హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమర యోధులను సన్మానిస్తున్న క్రమంలో మంత్రి కొండా సురేఖకు సమరయోధుడు ప్రతాప్‌రెడ్డి ప్రశ్నలు సంధించారు. తాను సమస్య చెప్పుకోవడానికి కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్తే ఎవరూ పట్టించుకోవడం లేదని, కలెక్టర్ కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సురేఖ.. ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి ఉంటుంది, కలెక్టర్ అందుబాటులో ఉంటారని చెబుతూ దరఖాస్తును స్వీకరించారు. అయితే ఇక్కడే సమస్య పరిష్కారం కావాలని ఆయన డిమాండ్ చేశారు. కష్టపడ్డది మేము.. అనుభవించేది మీరా.. అంటూ సురేఖను ప్రశ్నించారు.



మంత్రి సురేఖను ప్రశ్నిస్తున్న ఫ్రీడం ఫైటర్ ప్రతాప్‌రెడ్డి



సైకిల్ యాత్ర

హసన్‌పర్తి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రతీ రోజు ఒక గంట సైకిల్ ప్రయాణం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత అచ్చ సుదర్శన్ అన్నారు. హసన్‌పర్తికి చెందిన అచ్చ సుదర్శన్ నడికూడ మండలం చర్లపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు.

శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నడికూడ పాఠశాలలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు హాజరయ్యేందుకు ఉదయం 6 గంటలకు హసన్‌పర్తి నుంచి ఎర్రగట్టుగుట్ట, పెంబర్తి, నాగారం, అంబాల, గూనిపర్తి, శనగరం గుంటూర్‌పల్లి, గోపాల్‌పూరం బత్తినివారిపల్లి నుంచి 25 కిలో మీటర్లు ప్రయాణించి చర్లపల్లి ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలకు సైకిల్‌పై వచ్చిన ఉపాధ్యాయుడు అచ్చ సుదర్శన్‌ను మాజీ సర్పంచ్ చాడ తిరుపతిరెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

రెపరెపలాడిన త్రివర్ణ పతాకాలు

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



నిట్‌లో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి



హసన్‌పర్తిలోని జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం హనుమకొండలోని పలు కార్యాలయాలు, కాలనీలలో ఘనంగా నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, డీఆర్‌డీఓ మేన శ్రీను, కలెక్టరేట్ ఏఓ గౌరీశంకర్, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

- హనుమకొండ సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో సొసైటీ చైర్మన్ డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి బొమ్మినని పాపిరెడ్డి, పాలకవర్గ సభ్యులు పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, పుల్లూరు వేణుగోపాల్, చెన్నమనేని జయశ్రీ, డాక్టర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు జాతీయజెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, నాయకులు పాల్గొన్నారు. 31వ డివిజన్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
- **హనుమకొండ చౌరస్తా:** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 11వ డివిజన్ టీజంక్షన్‌లో 11వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సురేందర్ పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న పోలీసులు

- **మడికొండ:** మడికొండలోని సిటీ పోలీస్ శిక్షణా కేంద్రంలో ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ రవి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. పోలీస్ సిబ్బందితో కలిసి వందన సమర్పణ చేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఆర్ఐ ఉదయ్ భాస్కర్, రవికుమార్, మంగీలాల్ పాల్గొన్నారు. మడికొండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో, స్థానిక బురుజు పైన 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దాతలు రిటైర్డ్ ప్రొఫెసర్ జానపట్ల ఎల్లయ్య, మారుతు ఫౌండేషన్, రిటైర్డ్ టీచర్ నల్ల ప్రభాకర్, దండిగం రాజేందర్ చదువులో ప్రతిభ చూపిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.
- **హనుమకొండ సిటీ:** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యక్రమాలు వేరు వేరుగా జరిగాయి. హనుమకొండ జిల్లా కాంగ్రెస్‌కు సంబంధించి జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన పార్టీ శ్రేణులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేశారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు డీసీసీ భవన్‌లో జరిగాయి. వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వం వహించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, టీపీసీసీ నాయకులు వరద రాజేశ్వరరావు, బత్తిని శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ హంటర్ రోడ్డులోని హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ కుమార్ పతాకావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ చైతన్య, కోశాధికారి చొల్ల లక్ష్మారెడ్డి, 70 మంది రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. హంటర్ రోడ్డులోని వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోనెల రవీందర్ పత్రాకావిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి బూరెల సత్యనారాయణ, కోశాధికారి ఇరుకు కోటేశ్వర్ రావు, 120 మంది రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.
- **హనుమకొండ టౌన్:** హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఘనంగా శుక్రవారం నిర్వహించారు. అనంతరం జాతీయ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్, సంకు నర్సింగరావు, నల్ల స్వరూపరాణిరెడ్డి, ఇమ్మడి లోహితరాజు, చెన్నం మధు, మాజీ కార్పొరేటర్లు సారంగపాణి, మేకల బాబు రావు, లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, నాయకులు జనార్ధన్‌గౌడ్, రజినీకాంత్, వినిల్‌రావు, ప్రశాంత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.
- హనుమకొండలోని నీటిపారుదల శాఖ, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, రిజిస్ట్రేషన్, సుబేదారి పోలీసు స్టేషన్లలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు జాతీయజెండా ఎగరవేశారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల పోరాటాన్ని కొనియాడారు.
- **హనుమకొండ(ఆంధ్రజ్యోతి):** వరంగల్ ఎన్ఐటీలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల డీన్లు, అధ్యాపకులు, పరిపాలనా విభాగం అధిపతులు, ఎన్‌సీసీ కెడెట్లు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు సహాయపడే మెంటర్-మెంటీ మాడ్యూల్‌ను సంస్థ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.
- **వడ్డెపల్లి:** హనుమకొండలోని వివిధ డివిజన్లలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజాప్రతినిధులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ అంబేద్కర్ సర్కిల్‌లో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కందుకూరి రజినీకాంత్, స్థానిక కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, సర్దార్ సర్వాయిపాపన్న జంక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, బీజేపీ గోపాల్‌పూర్ జోనల్ అధ్యక్షుడు బండి హరీష్ ముదిరాజ్, గౌడ సంఘం కార్యాలయంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత రమేష్‌గౌడ్, దేవరాజ్ కాలనీలో మాజీ ఎంపీటీసీ దూలం నీరజ రాజుగౌడ్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. 57వ డివిజన్‌లోని వికాస్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి , 58వ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీలో ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండల సమ్మయ్య, కాంగ్రెస్ సీనియర్ నేత జనగాం శ్రీనివాస్‌గౌడ్, 60వ డివిజన్‌లోని టీచర్స్ కాలనీ ఫేస్ -1లోని కమ్యూనిటీ హాల్‌లో కాలనీ అధ్యక్షుడు పింగిళి రాంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్, పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశారు.
- హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాంనగర్‌లోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్‌రెడ్డి, తిరువరంగం ప్రభాకర్, గాంధీ నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సట్ల సత్తయ్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.
- **కాజీపేట:** కాజీపేటలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బావుసింగ్, రైల్వే స్టేషన్‌లో మేనేజర్ అగ్గి రవీందర్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్‌లు జెండా ఆవిష్కరించారు. కడిపికొండలో గ్రామశాఖ అధ్యక్షుడు కట్కూరి రమేశ్, కాజీపేట బాపూజీనగర్ టీడీపీ పార్లమెంటరీ కార్యాలయంలో కన్వీనర్ అర్షనపల్లి విద్యాసాగర్ రావు, రైల్వే సీసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్ దేవులపల్లి రాఘవేందర్, రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో సీనియర్ డీఈఈ జి. సూర్యనారాయణ జాతీయ జెండా ఆవిష్కరించారు.
- **హసన్‌పర్తి:** నవ భారత నిర్మాణంలో యువత పాత్ర కీలకమని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని పెంబర్తి ఏకశిల టెక్నో స్కూల్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గౌరు సువిజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణరాజ్, అకాడమిక్ ఇన్‌చార్జి రాంప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- **జూలైవాడ:** స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం 49, 59 డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. 49వ డివిజన్ జూలైవాడలో స్థానిక కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్, 59వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని కాలనీ వాసులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో మువ్వన్నెల జెండా ఆవిష్కరణ

వరంగల్ లీగల్ (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్, హనుమకొండ ప్రధాన జిల్లా జడ్జిలు నిర్మల గీతాంబ, డాక్టర్ పట్టాభి రామారావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో వేర్వేరుగా ఇరువురు న్యాయమూర్తులు 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ జెండాను ఎగరవేశారు.ఈ కార్యక్రమంలో ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, కోర్టు సిబ్బంది , అడ్వోకేట్ గుమస్తాలు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పతాక ఆవిష్కరణలో పాల్గొన్న హనుమకొండ జిల్లా జడ్జి పట్టాభి రామారావు తదితరులు

కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో..

హనుమకొండ(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వేయి స్తంభాలగుడి ఆవరణలోని కేంద్ర పురావస్తు శాఖ వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కేంద్ర పురావస్తు శాఖ వరంగల్ జిల్లా అధికారి నవీన్ కుమార్ జెండాను ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, దేవాదాయశాఖ సిబ్బంది మధుకర్, రజిత, అర్చకులు సందీప్ శర్మ, ప్రణవ్ శర్మ, మణికంఠ శర్మ అవధాని, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న కేంద్ర పురావస్తు శాఖ అధికారి నవీన్ కుమార్ తదితరులు

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

వరంగల్ క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వాహనంలో గంజాయి తరలిస్తున్న నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఏసీపీ నర్సింహారావు తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో దాచిపెట్టిన గంజాయిని వాహనంలో తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు టీజీ న్యాబ్ ఎస్ఐ శ్రీకాంత్, హనుమకొండ ఎస్ఐ పరశురాములు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మహేంద్ర ఎక్స్‌యూవీ వాహనంలో నలుగురు వ్యక్తులు గంజాయితో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని ఒడిశా సరిహద్దు నుంచి తీసుకువచ్చి ఇక్కడ విక్రయించడానికి సిద్ధపడ్డట్లుగా వెల్లడించారు. నలుగురి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయి, 5 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కరీంనగర్ జిల్లాకు చెందిన ఫైజాన్, ఎస్‌డీ అన్సార్, అర్బాస్, కుమార్‌పల్లికి చెందిన అర్షద్ అలీఖాన్‌ను రిమాండ్‌కు తరలించామన్నారు. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

కాజీపేట రైల్వేస్టేషన్‌లో..

కాజీపేట (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తివద్ద గంజాయి, గంజాయి చాక్లెట్‌లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట రైల్వే ఎస్సై ఎం.అభిరామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ వద్ద గురువారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని బ్యాగును తనిఖీ చేయగా ఆ బ్యాగులో 90 గ్రాముల గంజాయి ప్యాకెట్‌లు, 400 గంజాయి చాక్లెట్‌లు పట్టుబడ్డాయన్నారు. ఒడిస్సాకు చెందిన రమేశ్ కుమార్ దాస్ ఒడిస్సాలో గంజాయి, గంజాయి చాక్లెట్‌లను తక్కువ ధరకు కొనుగోలు చేసి సికింద్రాబాద్‌లో అమ్మకాలు చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. రైల్వే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని నిందితుడు రమేశ్‌కుమార్, చాక్లెట్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ నెహ్రూ బాగ్‌ను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే ఎస్సై ఎం.అభిరామ్ చెప్పారు. పట్టుబడ్డ గం జాయి, గంజాయి చాక్లెట్‌ల విలువ రూ.32 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

దళిత సంక్షేమ సొసైటీ కమిటీ ఎన్నిక

వడ్డెపల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని వడ్డెపల్లి దళిత్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఎన్నికల అధికారి నమిండ్ల జోసెఫ్ ఆధ్వర్యంలో వడ్డెపల్లిలోని కమిటీ హాల్‌లో ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా తాళ్లపెల్లి రవీందర్, ప్ర ధాన కార్యదర్శిగా తాళ్లపెల్లి ప్రవీణ్, కోశాధికారిగా ఎన్. ఆశీర్వాదం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇ.కుమారస్వామి, ఎం.చేరాలు, టి.సుదర్శన్, జాయింట్ సెక్రటరీలుగా తాళ్లపెల్లి విజయ్, ఇ.అనిల్, ఎన్.సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా టి.శ్రీనివాస్, ఇ.భాస్కర్, టి.శ్యామ్, పబ్లిసిటీ సెక్రటరీలుగా టి.చార్లెస్ బాబు, ఎ.కిషన్, సి.ప్రవీణ్, చీఫ్ అడ్వైజర్‌గా టి.పీటర్‌ను ఎన్నుకున్నారు.



స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి సురేఖ, కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్



రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు పుల్లూరి వేణుగోపాల్



ప్రశంసా పత్రాన్ని స్వీకరిస్తున్న ఇనుగాల ట్రస్ట్ సభ్యులు



హనుమకొండ ఏఎస్ఐ రఘునాథ్‌రెడ్డి



ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



డిప్యూటీ తహసీల్దార్ రంజిత్



ఆర్ఐ దశరథరాంరెడ్డి



హనుమకొండ ఎంవీఐ కిశోర్‌బాబు



ఎస్‌బీ ఏసీపీ జితేందర్‌రెడ్డి



టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్



సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్



ఏఆర్ ఏసీపీ నాగయ్య



సీసీఎస్ కానిస్టేబుల్ విశ్వేశ్వర్



అగ్రికల్చర్ ఏఈవో శిల్ప



మెడికల్ ఆఫీసర్ క్రాంతి కుమారి



ఏసీపీ సతీష్‌బాబు



స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్న



మాధవరెడ్డికి సేవా పతకం



డీఎంహెచ్‌వో అప్పయ్య



డ్రోన్‌ను పరిశీలిస్తున్న మంత్రి సురేఖ, అధికారులు

పాస్‌పోర్టు అధికారికి అవార్డు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పాస్‌పోర్ట్ ఆఫీస్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా హనుమకొండ టీచర్స్ కాలనీకి చెందిన మెండు ప్రణయ్ బెస్ట్ పెర్ఫామెన్స్ అవార్డును శుక్రవారం అందుకున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లోని రీజినల్ పాస్‌పోర్ట్ చీఫ్ జొన్నలగడ్డ స్నేహ నుంచి ప్రణయ్ పాస్‌పోర్ట్ అధికారిగా విశిష్ట సేవలందిస్తున్నందుకు అవార్డు అందుకోవడం విశేషం. హనుమకొండలోని హెడ్ పోస్టాఫీసులో పోస్టల్‌అసిస్టెంట్‌గా ప్రణయ్ పనిచేస్తున్నాడు. ఆయనను పలువురు అభినందించారు.

సైనికులకు సత్కారం

రాంనగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాడి ఉద్యోగ విరమణ చేసిన సైనికుడితో పాటు వీరమరణం పొందిన సైనికుడి సతీమణిని బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. హంటర్‌రోడ్‌లోని దీన్‌దయాల్ నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జాతీయ జెండా చేత పట్టి ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, అజ్మీరా సీతారాంనాయక్, విజయ్ చందర్‌రెడ్డి, కాశీప్రసాద్, దొంతి దేవేందర్‌రెడ్డి, వన్నాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

జరుగుతోందని, రూ.4కోట్లతో భద్రకాళి పూడికతీత పూర్తయిందని, రూ.70కోట్ల వ్యయంతో చెరువులోని ద్వీపాలకు రోప్‌వే, సస్పెన్షన్ బ్రిడ్జిల ఏర్పాటు జరుగుతుందని, రూ.5కోట్లతో కాకతీయ మ్యూజికల్ గార్డెన్ ఆధునీకరణ, రూ.4కోట్లతో ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి రూ.2కోట్లతో పాత కలెక్టర్ నివాసానికి మరమ్మతులు, రూ.30 కోట్లతో హనుమకొండలో వివిధ అభివృద్ధి పనులు జరిగాయని వెల్లడించారు.

వరంగల్ మహానగర పాలక సంస్థ ద్వారా స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.944.47 కోట్లతో 108 పనులు మంజూరు కాగా, ఇందులో రూ.542.29 కోట్లతో 70 పనులు పూర్తి అయ్యాయని, మరో 38 పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి సురేఖ తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఈ ఏడు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం రూ.1.48 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద బీసీ విద్యార్థులకు రూ.98.50 కోట్లు, ఈబీసీ విద్యార్థులకు రూ.10.86 కోట్లు విడుదల చేశామని, కళ్యాణలక్ష్మి పథకం కింద బీసీ, ఈబీసీ కులాలకు చెందిన 733 జంటలకు రూ.100,116 చొప్పున రూ.7.33కోట్లు విడుదల చేశామని తెలిపారు.

జిల్లాలో 31 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చామని, దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా దివ్యాంగులకు 94 సహాయ పరికరాలు మంజూరు చేశామని, వయోవృద్ధుల కోసం డే కేర్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు.

భూభారతి కింద నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 36,429 దరఖాస్తులు వచ్చాయని, 302 మంది లైసెన్స్డ్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చిన నియమించడం పూర్తయిందని, 163 మంది గ్రామపాలనాధికారుల నియామకం కూడా జరిగిందని వివరించారు. జిల్లాకు 9999 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 21 పూర్తయ్యాయని, 5,233 పురోగతిలో ఉన్నాయని, దీనికిగాను రూ.24.55 కోట్ల బిల్లులను చెల్లించామన్నారు. 2480 రెండు పడకల గృహాలు మంజూరు కాగా, 2,168 పూర్తయ్యాని, దీనికిగాను రూ.118.89 కోట్లు ఖర్చయ్యాయని, 1,782 గృహాలను అర్హులకు కేటాయించామన్నారు.

మహాక్షేత్రానికి ఈ-హుండీ బహూకరణ



మానసదేవి మహాక్షేత్రానికి హుండీని బహూకరిస్తున్న ఐఓబీ అధికారులు

రాంనగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మానసదేవి మహాక్షేత్రానికి రాంనగర్‌లోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రీజనల్ ఆఫీస్ మేనేజర్ ఆధ్వర్యంలో కరీంనగర్ ఐఓబీ శాఖ సహాయంతో శుక్రవారం ఈ-హుండీని బహూకరించారు. కార్యక్రమంలో కరీంనగర్ శాఖ మేనేజర్ హారిక, అసిస్టెంట్ మేనేజర్ సతీష్, మానసదేవి ట్రస్ట్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...

దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !

పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.

సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000,
Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489,
Kazipet SR - 8519926489 ACM - 9985411664

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

భోజనకుతూహలం

గడ్డల్ని కరిగించే కంద ఆకులు

సంస్కృతంలో కందకు 'సూరణం', 'వేరు వెల్లకి' అనే పేర్లు ఉన్నాయి. శూరుడిలా పోరాడేది కాబట్టి ఈ దుంపను సూరణం అంటారు. ఆయుర్వేద గ్రంథాల ప్రకారం- కడుపులో పెరిగే గడ్డలు, ఏలిక పాములపై ఇది పోరాడుతుంది. భౌగోళికంగా చూస్తే - కంద మొక్క దక్షిణాదివారి స్వంతం. ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరిగే మొక్క ఇది! భారతదేశం మొత్తం మీద తెలుగు నేలపైన పెరిగే కందకు ప్రసిద్ధి ఎక్కువ. పూర్వం వానప్రస్థాశ్రమంలో కంద మూలాలు తింటూ జీవించేవారని చెప్పేవారు. కంద మూలాలంటే సాధారణ అర్థంలో దుంపకూరలని! కంద అనేది సంస్కృత పదం, దుంప అనేది తెలుగు. ఈ రకంగా చూస్తే కంద లాంటి దుంప కూరలు, ఇతర ఉడకబెట్టిన దుంపలు తింటారని అర్థం. ఇక కంద ఆకులు వెడల్పుగా పెద్దవిగా రెమ్మలురెమ్మలుగా ఉంటాయి. వీటిలో ఎ- విటమిన్, ప్రొటీన్లు, ఫైబర్ ఉంటాయి. ఇక కంద వల్ల కలిగే లాభాలేమిటో చూద్దాం..



- కంద ఆకులకు వేడి చేసే స్వభావం ఉంటుంది. అయితే ఈ స్వభావం వల్ల కంద ఆకులు శరీరంలోని ఉన్న దోషాలను పోగొడతాయి. కఫదోషం వల్ల కలిగే వ్యాధులు ఉన్నవారికి ఈ ఆకులను వండిపెట్టవచ్చు.
- ఒకప్పుడు బోదవ్యాధి ఎక్కువగా ఉండేది. ఆ సమస్య ఉన్నవారికి కంద మంచి ఔషధం.
- కంద కాడల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. అందు వల్ల ఇవి పొట్టను మృదువుగా చేస్తాయి.
- కంద ఆకులను ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువగా తింటారు. అయితే లేత కంద ఆకులను తింటేనే మంచిది. ముదురు ఆకుల్లో ఆగ్జలైట్ క్రిస్టల్స్ ఎక్కువగా ఉంటాయి. ముదురు ఆకులను నేరుగా తింటే కిడ్నీలో రాళ్లు ఏర్పడతాయి. ఒకవేళ ముదురు ఆకులను తినాలనుకొనేవారు ఆకులను శుభ్రపరచి, సన్నగా తరిగి, మజ్జిగలో వేసి బాగా మెత్తపడేదాకా ఉడికిస్తే ఈ క్రిస్టల్స్ తొలగిపోతాయి.

• గంగరాజు అరుణాదేవి

మేకప్

తళుక్కున మెరవాలంటే...

ముఖ చర్మాన్ని కాన్వాస్‌గా మలిచి, అందంగా తీర్చిదిద్దడమే మేకప్. అందుకోసం కొంత ఓర్పు, నేర్పు అవసరమవుతాయి. నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోవడం ఒక ఎత్తైతే, వాటిని తగుమాత్రంగా ముఖానికి అద్దుకోవడం మరొక ఎత్తు. మెరుపులీనే తారలా తళుక్కుమనడం కోసం ఇవిగో ఈ మేకప్ కిటుకులు పాటించండి.



షేపింగ్: ముఖం కోలగా మలచాలన్నా, గుండ్రంగా తీర్చిదిద్దాలన్నా అందుకు తగిన మేకప్ మెలకువలు అనుసరించాలి. షాడో, బ్రాంజ్, కాంపాక్ట్‌ల షేడ్‌లను ఆచితూచి ఎంచుకుని, అవసరమైన చోటే అద్దుకోవాలి. ముక్కును తీర్చిదిద్దే తీరు మీద ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే దవడలు, చెవుల దగ్గర డెప్త్‌ను ఏ మేరకు పెంచాలో అంచనా వేయాలి.

ముడతలు: నుదురు, పెదవులు, కళ్ల కింది ప్రదేశాల్లో ముడతలు దాచడం కోసం అవసరానికి మించి కన్‌సీలర్ ఉపయోగించకూడదు. సహజసిద్ధమైన లుక్‌ను సొంతం చేసుకోవడం కోసం కళ్ల కింద ఎరుపు రంగు షేడ్‌ను పలుచగా అద్దుకుని, దాని మీద ఫౌండేషన్ అప్లై చేసుకోవాలి. కన్‌సీలర్‌ను పలుచగా అద్దుకుని, ఫౌండేషన్‌లో కలిసిపోయేలా చూసుకోవాలి.

హైలైట్: ముఖంలో కనుబొమలు, పెదవులు... ఇలా ప్రతి ఒక్కరి ముఖంలో ఏదో ఒక ఆకట్టుకునే అంశం ఉంటుంది. కాబట్టి ఆ అంశాన్ని సెంటర్ ఆఫ్ అటెన్షన్‌గా చేసి, దానికి తగ్గట్టు ముఖాన్ని మలిచే ప్రయత్నం చేయాలి. ఆకర్షణీయమైన కళ్లు ఉన్నవారు బోల్డ్ లైనర్‌ను ఉపయోగించాలి. పౌట్‌ను గుర్తించడం కోసం ముదురు రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి.

లైట్‌గా మొదలు పెట్టి: మేకప్ ఉత్పత్తులను వీలైనంత తక్కువగా వాడడం అలవాటు చేసుకోవాలి. కొద్దిగా కన్‌సీలర్‌ను చర్మం మీద అప్లై చేసి బ్రష్‌తో బ్లెండ్ చేసుకోవాలి. ఇంకొద్దిగా అవసరం పడితే, మళ్లీ అప్లై చేసుకోవాలి. అలాగే కన్‌సీలర్‌ను అప్లై చేయడం కోసం డో ఫుట్ అప్లికేటర్‌ను ఉపయోగించాలి.

ఐ షాడో బ్రష్: కనురెప్పల మీద ముడతలు ఉంటే, ఫ్లాట్ బ్రష్‌కు బదులుగా ఫ్లఫ్ఫీగా ఉండే బ్రష్ వాడాలి. సన్నని మొన కలిగిన బ్రష్ వాడడం వల్ల షాడో, కనురెప్పల ముడతల్లో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే చివర్లో క్రీజ్ బ్రష్‌తో అదనపు షాడోను తొలగించుకోవాలి.

పిల్లలు ఆలస్యంగా పడుకుంటున్నారా..?

పిల్లలు నిద్రకు ఉపక్రమించే సమయం, ఎన్ని గంటలు పడుకుంటున్నారనే అంశాలు వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. పిల్లల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాహారంతోపాటు సరైన నిద్ర కూడా అత్యవసరమని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు సమయానికి నిద్రపోవడం వల్ల కలిగే లాభాలు, ఆలస్యంగా పడుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకుందాం...



సమయానికి నిద్రిస్తే...

- పిల్లలు రోజూ సరైన సమయానికి నిద్రించడం వల్ల శారీరకంగా వారి ఎదుగుదల బాగుంటుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. నేర్చుకొనే సామర్థ్యం పెరుగుతుంది. హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయి. తరచుగా ఒత్తిడికి గురికాకుండా భావోద్వేగాల పరంగా నియంత్రణలో ఉంటారు. ఆకలి పెరిగి చక్కగా ఆహారం తినగలుగుతారు. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుంది. ఎటువంటి వ్యాధులు రాకుండా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు.

ఆలస్యమైతే...

- నిద్ర సరిపోక కళ్లు, మెదడు అలసిపోతాయి. దీంతో పిల్లలు రోజంతా చిరాకుగా ప్రవర్తిస్తుంటారు. జీర్ణ సమస్యలు, ఆకలి లేకపోవడం, మలబద్ధకం లాంటివి ఎదురవుతాయి. కొంచెం పెద్ద పిల్లలకయితే ఏకాగ్రత కుదరదు. చదివిన అంశాలు గుర్తుండవు. పరీక్షలు సరిగా రాయలేక నిరాశ, ఆందోళనలకు గురవుతూ ఉంటారు. పిల్లలు ఆలస్యంగా పడుకుని, ఆలస్యంగా నిద్రలేస్తుంటే తల్లిదండ్రులు గమనించి ఆ అలవాటును మాన్పించాలి.

ఏ సమయానికి పడుకోవాలంటే...

- చిన్న పిల్లలు రాత్రి ఎనిమిదింటికల్లా పడుకోవడం మంచిది. బడికి వెళ్లే పిల్లలు రాత్రి తొమ్మిది లోపు పడుకోవాలి. కనీసం ఎనిమిది నుంచి పది గంటలపాటు నిద్రించడం వారి ఆరోగ్యానికి మంచిది.

వంటిల్లు

కృష్ణునికి అటుకులు, పాలు, మీగడ, వెన్న అంటే ఇష్టమని మనందరికీ తెలుసు. కృష్ణాష్టమి రోజున వీటితో రకరకాల వంటకాలు తయారుచేసి కృష్ణునికి నివేదిస్తూ ఉంటాం. తక్కువ సమయంలో తేలికగా అటుకులతో తయారుచేసే రుచికరమైన నైవేద్యాల గురించి తెలుసుకుందాం...



అల్లరి కృష్ణునికి అటుకుల నైవేద్యం..!

• పాలు చిలకరించకుండా మరో నాలుగు చెంచాల నెయ్యి వేసి చేస్తే లడ్డూలు చాలా రోజుల వరకు నిల్వ ఉంటాయి.

అటుకుల లడ్డు

కావాల్సిన పదార్థాలు

అటుకులు- రెండు కప్పులు, నెయ్యి- అయిదు చెంచాలు, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పలుకులు- కొన్ని, ఎండు కొబ్బరిపొడి- రెండు చెంచాలు, యాలకులు- మూడు, తురిమిన బెల్లం- ముప్పావు కప్పు, కాచి చల్లార్చిన పాలు- మూడు చెంచాలు

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో అటుకులు వేసి దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వాటిని చల్చార్చాలి. స్టవ్ మీద పాన్ పెట్టి రెండు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో జీడిపప్పు పలుకులు, బాదం పలుకులు వేసి ఎర్రగా వేయించాలి. తరవాత ఎండు కొబ్బరి పొడి వేసి బాగా కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.
- మిక్సీలో చల్లారిన అటుకులు, యాలకులు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత బెల్లం తురుము వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని జీడిపప్పు-బాదం పలుకుల మిశ్రమంలో వేసి బాగా కలపాలి. అందులో మూడు చెంచాల నెయ్యి వేసి కొద్దికొద్దిగా పాలు చిలకరిస్తూ ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ లడ్డూలు చుట్టుకోవాలి. అంతే..! కృష్ణునికి ఎంతో ఇష్టమైన అటుకుల లడ్డు రెడీ..!

• అటుకులను చిన్న మంట మీద నెమ్మదిగా వేయించుకోవాలి. లేదంటే తొందరగా మాడిపోతాయి.

అటుకులు పెసరపప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

అటుకులు- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, బెల్లం- ఒకటింబావు కప్పులు, నెయ్యి- నాలుగు చెంచాలు, కాచి చల్లార్చిన పాలు- మూడు కప్పులు, యాలకుల పొడి- అర చెంచా, కొబ్బరి ముక్కలు- కొన్ని, జీడిపప్పు పలుకులు- కొన్ని, బాదం పప్పులు- కొన్ని, కిస్‌మిస్‌లు- కొన్ని, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో పెసరపప్పు వేసి దోరగా వేయించి మరో గిన్నెలోకి తీయాలి. అందులో నీళ్లు పోసి పెసరపప్పును రెండుసార్లు కడగాలి. తరువాత రెండు కప్పుల నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో బెల్లం వేసి పావుకప్పు నీళ్లు పోయాలి. బెల్లం పూర్తిగా కరిగిన తరవాత స్టవ్ మీద నుంచి దించి మరో గిన్నెలోకి వడబోయాలి. స్టవ్ మీద పాన్ పెట్టి మూడు చెంచాల నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో కొబ్బరి ముక్కలు, జీడిపప్పు పలుకులు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లు వేసి ఎర్రగా వేపి పళ్లెంలోకి తీసుకోవాలి. తరువాత అటుకులు వేసి, దోరగా వేయించి మరో పళ్లెంలోకి తీయాలి. అదే గిన్నెలో నానబెట్టిన పెసరపప్పును నీళ్లతో సహా వేసి ఉడికించాలి. మధ్యలో ఒక చెంచా నెయ్యి వేసి కలపాలి. పెసరపప్పు మెత్తగా ఉడికిన తరువాత వేయించిన అటుకులు వేసి కలపాలి. రెండు నిమిషాల తరువాత పాలు పోసి కలపాలి. ఈ మిశ్రమాన్ని అయిదు నిమిషాలు ఉడికించి స్టవ్ మీద నుంచి దించాలి. తరవాత బెల్లం నీళ్లు పోసి కలపాలి. మళ్లీ గిన్నెను స్టవ్ మీద పెట్టి రెండు నిమిషాలు మిశ్రమాన్ని ఉడికించాలి. అదే సమయంలో... వేయించి పెట్టుకున్న కొబ్బరిముక్కలు, జీడిపప్పు, బాదం పప్పులు, కిస్‌మిస్‌లతోపాటు యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. అంతే! కమ్మని అటుకులు-పెసరపప్పు పాయసం నైవేద్యానికి రెడీ!



• పాయసాన్ని జారుగా ఉన్నప్పుడే స్టవ్ మీద నుంచి దించాలి. అది చల్లారిన తరవాత కొద్దిగా గట్టిపడుతుంది.

• బెల్లం నీళ్లు పూర్తిగా చల్లారిన తరవాతనే పాలు-అటుకులు-పెసరపప్పు మిశ్రమంలో కలపాలి. లేదంటే పాలు విరిగిపోవచ్చు.

- అటుకుల్లో ఎ, బి, సి, కె విటమిన్లతోపాటు ప్రోటీన్లు, పిండిపదార్థాలు, ఐరన్, పీచుపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. అటుకులను తరచూ తినడం వల్ల నీరసం తగ్గుతుంది. రక్తహీనత, జీర్ణ సమస్యలు, గుండె జబ్బులు దరిచేరవు. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. అటుకుల్లో క్యాలరీలు, కొవ్వులు ఉండవు కాబట్టి ఎక్కువగా తిన్నప్పటికీ శరీరం బరువు పెరగదు. ఇవి త్వరగా జీర్ణమవుతాయి. అందుకే అటుకులను పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు బలవర్ధకమైన ఆహారంగా నిపుణులు సూచిస్తున్నారు.

మూడు గంటలు భరతనాట్యం... మధ్యలో పావుగంట విరామం...
అలా ఏకధాటిగా 170 గంటల ప్రదర్శన..! సాధ్యమేనా..? అందరిదీ ఇదే సందేహం.
కానీ... అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించింది ఇరవయ్యేళ్ల రెమోనా ఎవెట్టే పెరీరా.
అమ్మ అండతో... స్నేహితులు, సన్నిహితుల ప్రోత్సాహంతో... ఈ మెగా ఫీట్‌ను దిగ్విజయంగా ముగించి...
'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించిన రెమోనా కథ ఇది.

నాట్యం... పరవశం

సంకల్పం



"మాటల్లో చెప్పలేని భావాలను నాట్యంతో వ్యక్తీకరించవచ్చు. సంప్రదాయ నృత్యంలోని గొప్పదనం అదే. కాళ్లకు గజ్జె కట్టి, శరీరం లయబద్ధంగా కదులుతున్నప్పుడు నన్ను నేను మరిచిపోతాను. నర్తిస్తున్నంతసేపూ ఏదో తెలియని పరవశానికి లోనవుతాను. నేను అమితంగా ఇష్టపడింది, తొలిసారి ప్రేమలో పడింది భరతనాట్యంతోనే. కర్ణాటక రాష్ట్రం మంగళూరు నగరం మాది. ఊహ తెలియనప్పుడే మా అమ్మ నన్ను తీసుకువెళ్లి భరతనాట్యం గురువుకు అప్పగించింది. ఇక అప్పటి నుంచీ నాకు అదే లోకం అయిపోయింది. దీని వెనుక ఒక చిన్న కథ ఉంది. సంప్రదాయ నృత్యం అభ్యసించాలని మా అమ్మ ఎన్నో కలలు కన్నది. కానీ సామాజిక కట్టుబాట్ల పేరుతో ఇంట్లోవాళ్లు అనుమతించలేదుట. అందుకే నాకు కళలు నేర్పించాలని నిర్ణయించుకుంది. కానీ భరతనాట్యం వైపు వెళ్లమని తను నన్ను బలవంతం పెట్టలేదు. దీంతోపాటు పెయింటింగ్, ఇతర నాట్య రీతులు కూడా ఆరంభంలో సాధన చేశాను. అయితే ఎందుకో తెలియదు... అన్నిటికంటే నన్ను భరతనాట్యమే అమితంగా ఆకర్షించింది.



ఆలోచన అలా వచ్చింది...

ఆరంభం నుంచీ మా గురువు శ్రీవిద్య మురళీధర్ గారి దగ్గరే నాట్యం అభ్యసిస్తున్నాను. భరతనాట్యం నాకు ఒక సంప్రదాయ నృత్య సాధన మాత్రమే కాదు... భావోద్వేగాల బంధం. ఆధ్యాత్మిక అనుబంధం. నేను వేరు, నాట్యం వేరు కాదు. ప్రస్తుతం నేను బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. విద్య ఎంత ముఖ్యమో కళ కూడా అంతే ముఖ్యం. అందులో ఎప్పుడూ ఏదో కొత్తగా చేయాలని తపిస్తుంటాను. అలా ఒక రోజు ఇన్‌స్టాగ్రామ్ చూస్తుంటే... 'డ్యాన్స్ మారథాన్' అని కనిపించింది. అలాంటిది ఒకటి ఉంటుందని కూడా అప్పటివరకు నాకు తెలియదు. ఆశ్చర్యం కలిగింది. నన్ను బాగా ఆకర్షించింది. 'నేను ఎందుకు ప్రయత్నించకూడదు' అనిపించింది.

అనుకున్నది 24 గంటలే... కానీ...

ఎప్పుడైతే ఆలోచన వచ్చిందో వెంటనే కార్యరంగంలోకి దిగాను. డ్యాన్స్ మారథాన్‌కు సంబంధించిన అప్లికేషన్ మా కాలేజీవాళ్లు తెప్పించారు. ముందుగా అనుకున్నది 24 గంటల మారథాన్. కానీ అప్లికేషన్ నింపుతుంటే... 170 గంటలు చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. ఆ సంఖ్య నా మదికి ఎలా తట్టిందో తెలియదు. దరఖాస్తులో రాసే ముందు అమ్మకు చెప్పాను. తను అవాక్కయింది. కాసేపటికి తేరుకొని... 'అంటే ఎన్ని రోజులు' అని అడిగింది. 'సుమారుగా ఏడు రోజుల రెండు గంటలు' అన్నాను. ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ... 'నిజంగానే చేద్దామనుకొంటున్నావా' అంటే.. 'అవును' అని బదులిచ్చాను. మరో ఆలోచన లేకుండా... 'అయితే నా మద్దతు నీకు ఉంటుంది' అంది అమ్మ.

ప్రత్యేక సన్నాహకాలు లేకుండానే...

ఈవెంట్‌కు కొన్ని వారాల ముందే 170 గంటలు నాన్‌స్టాప్‌గా భరతనాట్య ప్రదర్శన ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. దాంతో సన్నాహకాలకు ఎక్కువ సమయం లేకుండా పోయింది. అయితే నా మనసులో ఒకటే అనుకున్నా... 'వారం రోజుల పాటు నిద్ర ఉండదు. కనుక దానికి ముందు బాగా నిద్ర పోవాలి' అని. ఈ మారథాన్ కోసం నేను సన్నద్ధమైంది ఏదైనా ఉందంటే... అది కంటి నిండా కునుకు తీయడమే. చివరకు ఈవెంట్ రోజు, అంటే జూలై 21 వచ్చేసింది. ప్రదర్శన మొదలుపెట్టాను. మా కాలేజీ ఆడిటోరియంలోనే. నాకు తెలుసు... మొదటిరోజు హాయిగానే సాగిపోతుందని. మూడో రోజు నుంచి కష్టపడాల్సి వస్తుందని అనుకున్నా. కానీ నా అంచనాలు తలకిందులు అయ్యాయి. తొలి రోజే ఆపేద్దామనుకున్నా. అమ్మ 'నువ్వు చేయగలవు' అని ఆత్మవిశ్వాసం నింపింది. ఆడిటోరియంలో నా స్నేహితులు, స్థానికులు, అధ్యాపకులు... అందరూ నాకు అండగా నిలిచారు. నాకు నిద్ర వచ్చినప్పుడల్లా... చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ ఉత్సాహపరిచారు. మూడు గంటల నాట్యం... మధ్యలో పావుగంట విరామం. ఎక్కువగా అరటి, ఆపిల్, జామపండ్లు, కొబ్బరి నీళ్లతోనే సరిపెట్టుకున్నా. నిద్ర మరీ ముంచుకొస్తే ఒకటి రెండు సిప్‌లు కాఫీ. రాత్రి అయ్యేసరికి విపరీతమైన వెన్ను, కాళ్ల నొప్పులు. తట్టుకోలేక కళ్లల్లో నీళ్లు తిరిగేవి. అన్నిటి కంటే పెద్ద సవాలు... నిద్ర ఆపుకోవడం. అన్నిటినీ భరించాను. అందరి సహకారంతో జూలై 28న విజయవంతంగా మారథాన్ ముగించాను.

అమ్మ లేకపోతే నేను లేను...

నా జీవితంలోనే కాదు... నా ఈ నాట్య ప్రయాణంలోనూ మా అమ్మ పాత్ర ప్రముఖమైనది. వెల కట్టలేనిది. నా ప్రతి దశలో తోడై, అడుగడుగునా ప్రోత్సహిస్తూ వస్తోంది. అంతేకాదు... నాట్య ప్రదర్శనకు అవసరమైన దుస్తులు తనే డిజైన్ చేసి, కుడుతుంది. అమ్మ నా నిశ్శబ్ద భాగస్వామి. నన్ను నలుగురిలో గొప్పగా నిలబెట్టడానికి అహర్నిశలూ కష్టపడుతుంది. తను లేకపోతే నేను లేను. నా మారథాన్ సమయంలో అమ్మ కూడా నిద్ర పోలేదు. సరిగ్గా తినలేదు. నిరంతరం నన్ను అంటిపెట్టుకొనే ఉంది.


సరికొత్త రికార్డు...

నా ప్రదర్శన 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇది నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. రికార్డు నెలకొల్పాననే ఆనందం కన్నా... అంత పెద్ద లక్ష్యాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలిగాననేదే నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తోంది. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం నాకు ఇదే మొదటిసారి కాదు. గతంలో పిల్లలకు ఇచ్చే అత్యున్నత అవార్డు.. 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్'ను నరేంద్ర మోదీ చేతుల మీదుగా అందుకున్నాను. నేను ఎక్కడ ఉంటే అక్కడ భరతనాట్యం ఉండేలా కృషి చేస్తాను. ప్రస్తుతం ట్రాన్స్‌జెండర్స్ పిల్లలకు నృత్యం నేర్పిస్తున్నాను. భరతనాట్యంలో పీహెచ్‌డీ చేయాలనేది నా కల. తద్వారా ఈ కళారూపాన్ని మరింత లోతుగా అర్థంచేసుకొనే అకాశం లభిస్తుంది కదా."

వ్యక్తిగత గౌరవం పెరిగేలా...

మనం వ్యక్తిగతంగా ఎదగడానికి మన అలవాట్లే దోహదం చేస్తాయి. ఒక్కోసారి తెలిసీ తెలియక చేసే పొరబాట్లు నలుగురిలో నగుబాటుకి గురిచేస్తూ ఉంటాయి. అలాకాకుండా సమాజంలో ఉన్నతంగా నిలవాలంటే ఏవిధంగా మెలగాలో తెలుసుకుందాం...

- కొంతమంది వ్యక్తిగతమైన ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ ఉంటారు. గంట గంటకూ కామెంట్లు, లైక్‌లు చూస్తూ ఉంటారు. అనుకున్నట్లు జరిగితే సంతోషమే. కానీ అలా కానిపక్షంలో భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోతూ ఉంటారు. దీనివల్ల మానసికంగా అశాంతి, అసహనం, కోపం పెరుగుతాయి. ఇవి వ్యక్తిగత గౌరవాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే సామాజిక మాధ్యమాల్లో గడపడాన్ని తగ్గించుకోవాలి.
- కొంతమంది ఎప్పుడూ ఎదుటివారిలో తప్పులు వెతుకుతూ ఉంటారు. చిన్న చిన్న అంశాలనే పెద్దవిగా చేసి అనవసరమైన గందరగోళం సృష్టిస్తూ ఉంటారు. అలాకాకుండా తప్పు అనిపించిన అంశాన్ని నేరుగా మృదువుగా చెప్పడం మంచిది. దీనివల్ల నలుగురిలో సానుకూలంగా వ్యవహరించడం అలవడుతుంది.



- వాయిదా వేసే ధోరణి చాలామందిలో కనిపిస్తూ ఉంటుంది. మీటింగ్ లేదా ఫంక్షన్‌కి వస్తానని చెప్పి ఆఖరు నిమిషంలో రానని చెప్పడం, చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు వాయిదా వేయడం లాంటివి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గిస్తాయి. కాలయాపన చేయకుండా క్రమశిక్షణతో మెలగడం అలవాటు చేసుకోవాలి.

కశ్మీర్‌లో శిథిలాల కింద 500 మంది!

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అంచనా



న్యూఢిల్లీ, శ్రీనగర్, ఆగస్టు 15: జమ్మూకశ్మీర్ కిష్త్వార్ జిల్లాలో మేఘ విస్ఫోటంలో సుమారు 500 మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అంచనా వేశారు. అయితే అధికారులు మాత్రం వెయ్యి మంది దాకా చిక్కుకుపోయి ఉంటారని చెబుతున్నారని, తమకిది తీవ్ర విషాదకర సమయమని ఆయన చెప్పారు. మరోవైపు ఘటనలో ఇప్పటివరకు 60 మంది మరణించినట్లు సీఎం ఒమర్ అబ్దుల్లా ధ్రువీకరించారు. వంద మందికి పైగా గాయపడినట్లు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తనతో ఫోన్‌లో మాట్లాడారని, తాజా పరిస్థితిని తాను వివరించానని చెప్పారు. సహాయక చర్యలు చేపట్టిన కేంద్ర ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కాగా, మేఘ విస్ఫోటం సమయంలో బాంబు పేలుడు తరహాలో భారీ శబ్దం వచ్చిందని ప్రమాదం నుంచి బయటపడినవారు చెబుతున్నారు. పేలుడు రాగానే పరిగెత్తండంటూ అరుపులు వినిపించాయని, రెండు నిమిషాల్లోనే అందరూ 4 అడుగుల బురద, శిథిలాల కింద చిక్కుకుపోయారని ఓ క్షతగాత్రుడు తెలిపారు. అతి కష్టంమీద బయటపడినట్లు చెప్పారు.

పాక్‌లో భారీ వర్షాలు.. 214 మంది మృతి




ఇళ్ల మధ్య నుంచి ఉధృతంగా వరద

పెషావర్/ఇస్లామాబాద్, ఆగస్టు 15: పాకిస్థాన్‌ను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తాయి. పాకిస్థాన్‌లోను, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోను గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు కనీసం 214 మంది మృతి చెందారు. అనేక మంది గల్లంతయ్యారు. వరదల్లో అనేక మంది గల్లంతు కావడంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కుండపోత వర్షాల కారణంగా ఒక్కసారిగా వరదలు రావడంతో కొండచరియలు విరిగిపడి అనేక ఇళ్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పాకిస్థాన్ ఆర్మీ, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. హెలికాప్టర్ ద్వారా సహాయం అందిస్తున్న క్రమంలో శుక్రవారం ఓ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లతో సహా అయిదుగురు మృతి చెందారు. పీవోకేలోని కారకోరం, బాల్టిస్థాన్ రహదారులు దెబ్బతిన్నాయి. నీలం లోయలోని రట్టి గలీ సరస్సు వద్ద 600 మంది పర్యాటకులు చిక్కుకున్నారు.

ఇనుములో క్రీడోత్సాహం పుట్టెనే..

- చైనాలో హ్యూమనాయిడ్ రోబోల ఆటల పోటీలు.. ప్రపంచంలోనే మొట్టమొదటిసారి నిర్వహణ
- పోటీల్లో పాల్గొంటున్న 16 దేశాల రోబోలు.. మొత్తం 280 జట్లు.. 26 అంశాల్లో పోటీలు



బీజింగ్, ఆగస్టు 15: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా చైనాలో మర మనుషుల(హ్యూమనాయిడ్ రోబోలు) ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ 'వరల్డ్ హ్యూమనాయిడ్ గేమ్స్' జరగనున్నాయి. 16 దేశాలకు చెందిన 280 జట్లు మొత్తం 26 విభాగాల్లో పోటీ పడుతున్నాయి. మనుషులను పోలిన రోబోలను హ్యూమనాయిడ్ రోబోలు అంటారన్న సంగతి తెలిసిందే. మర మనుషుల క్రీడల్లో భాగంగా ఫుట్‌బాల్, రన్నింగ్, లాంగ్ జంప్, టేబుల్ టెన్నిస్ లాంటి ఆటలతో పాటు ఔషధాలను గుర్తించడం, వస్తువులను మోసుకువెళ్లడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం లాంటి అంశాల్లో కూడా పోటీలను నిర్వహిస్తున్నారు. అమెరికా, జపాన్ తదితర దేశాలకు చెందిన 192 యూనివర్సిటీలు, 88 ప్రైవేటు కంపెనీలు రూపొందించిన రోబోలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. రోబోల క్రీడల పోటీల్లో భాగంగా తొలుత స్ప్రింట్ రన్నింగ్, ఫుట్‌బాల్ పోటీలు జరిగాయి. చాలా రోబోలు ఆటల మధ్యలోనే పడిపోయాయి. అయితే, ఈ ఆటలు కేవలం వినోదానికే కాకుండా రోబోలపై పరిశోధనకు అత్యంత కీలకమని వివిధ రోబో కంపెనీల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ గేమ్స్‌లో ఒక్కో టికెట్ ధర రూ.1,500 నుంచి రూ.8వేల వరకు ఉంది. బీజింగ్ మున్సిపల్ గవర్నమెంట్ ఈ పోటీలను నిర్వహిస్తోంది. కాగా, చైనా కొంత కాలంగా ఏఐ, రోబోటిక్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది. ఈ క్రమంలోనే గతేడాది ఈ రంగం కోసం 20బిలియన్ డాలర్లను ఖర్చు పెట్టింది. ఏఐ, రోబోటిక్స్ స్టార్టప్‌ల కోసం భవిష్యత్తులో 137బిలియన్ డాలర్లతో ఓ నిధిని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల బీజింగ్‌లో రోబో మారథాన్ నిర్వహించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అమ్మాయి అదృశ్యం వెనుక..?



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ కథానాయకుడిగా కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం 'కిష్కింధపురి'. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. షైన్ స్క్రీన్స్ బేనర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 12న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్‌ను మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. టీజర్‌లో మొదటి షాట్ నుంచే మిస్టరీ ప్రారంభమవుతుంది. పురాతన బంగ్లాలోకి వెళ్లిన ఓ అమ్మాయి ఒక్కసారిగా అదృశ్యం అవుతుంది. ఇంతలో రేడియో నుంచి ఓ సమాచారం ప్రసారం అవుతుంది. మొత్తానికి టీజర్ ఆద్యంతం ఉత్కంఠతతో అదరగొట్టింది. చైతన్ భరద్వాజ్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌ని మరో లెవల్‌కి తీసుకెళ్లింది.

ఈ ముసుగు వీరుడెవరు?




సాధారణంగా స్టార్ హీరోలు, హీరోయిన్లు సినిమా థియేటర్లకు వెళ్లరు. అక్కడ అభిమానుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. తప్పని సరి అయితే ఎవరూ తమను గుర్తించకుండా మారు వేషంలో వెళ్తారు. ఇటీవలె హీరోయిన్ రష్మిక మందన్న మారువేషంలో వెళ్లి విజయ్ దేవరకొండ సినిమా 'కింగ్‌డమ్' చూసి వచ్చినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా హీరో నాని కూడా ఇలానే గురువారం బ్యాక్ టు బ్యాక్ రెండు సినిమాలు చూశారు. ముఖానికి ముసుగు వేసుకొన్న నాని.. జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'వార్-2', రజనీకాంత్ 'కూలీ' సినిమాలను ఏఎంబీ సినిమాస్‌లో వీక్షించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.



వారి కలయికలో తొలి అడుగు

'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా ఘన విజయంతో మంచి జోష్‌లో ఉన్న విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించనున్నారు. చాలా కాలంగా ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న వీరి కాంబినేషన్‌కు పూజా కార్యక్రమాలతో శుక్రవారం తొలి అడుగు పడింది. నిర్మాత సురేశ్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. హారిక -హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ(చిన బాబు) నిర్మిస్తున్నారు. వెంకటేశ్ నటించిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరీ' చిత్రాలకు త్రివిక్రమ్ డైలాగ్స్ రాశారు. ఇప్పుడు ఆయన దర్శకత్వంలోనే వెంకటేశ్ నటిస్తుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది.



చలన చిత్ర పరిశ్రమలో తొలిసారిగా శ్రీకృష్ణుడిని ఒక యుద్ధ వీరుని పాత్రలో చూపిస్తూ నిర్మిస్తున్న చిత్రం 'శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా'. ముకుంద్ పాండే దర్శకత్వంలో అనిల్ వ్యాస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో 11-12 వ శతాబ్దాల నాటి 'మహోబా' సాంస్కృతిక వైభవాన్ని, శ్రీకృష్ణుని దివ్యత్వాన్ని, ధీరత్వాన్ని, ఆధ్యాత్మిక ప్రాభవాన్ని చూపించే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. 'శ్రీకృష్ణ అవతార్ ఇన్ మహోబా' పాన్ వరల్డ్ ప్రాజెక్ట్. ప్రపంచ స్థాయి సాంకేతిక నిపుణులతో తెరకెక్కిస్తున్నాం. చరిత్ర, సాంస్కృతిక వారసత్వం, ఆధ్యాత్మికతను వివరించే సినిమా ఇది' అని నిర్మాత తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు వెల్లడిస్తామన్నారు.

'అమ్మ' అధ్యక్షురాలిగా శ్వేతా మీనన్!

- 'అమ్మ' చరిత్రలో మహిళకు ఇదే తొలి అవకాశం



అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) నూతన అధ్యక్షురాలిగా నటి శ్వేతా మీనన్ ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కొచ్చిలో జరిగిన పోలింగ్‌లో శ్వేతకు 159 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి, నటుడు దేవన్‌కు 132 ఓట్లు వచ్చాయి. దాంతో శ్వేత ఎన్నికయినట్లు ప్రకటించారు. 31 ఏళ్ల 'అమ్మ' చరిత్రలో ఒక మహిళ అధ్యక్షురాలిగా ఎన్నిక కావడం ఇదే ప్రథమం. పలువురు నటులు, దర్శకులపై నటీమణులు లైంగిక ఆరోపణలు చేసిన నేపథ్యంలో అధ్యక్షుడిగా ఉన్న మోహన్‌లాల్ నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేశారు. దీని వల్ల 2027లో జరగాల్సిన ఎన్నికలను ఇప్పుడే నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి పోటీ పడుతున్న శ్వేతా మీనన్‌పై కొన్ని రోజుల క్రితం ఓ కేసు నమోదు అయింది. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్నికల్లో ఆమె గెలుపుపై ఉత్కంఠ ఏర్పడింది. 27 ఓట్ల ఆధిక్యంతో శ్వేత గెలిచి రికార్డ్ సృష్టించారు. తన గెలుపుపై ఆమె స్పందిస్తూ 'ఇకపై 'అమ్మ' అంటే ఓ మహిళ అని గర్వంగా చెప్పవచ్చు' అన్నారు. అసోసియేషన్ నుంచి వైదొలిగిన సభ్యులకు శ్వేత తిరిగి స్వాగతం పలికారు. అవసరమైతే తను వ్యక్తిగతంగా వారిని ఆహ్వానిస్తానని కూడా చెప్పారు. మోడలింగ్ నుంచి సినీరంగంలోకి అడుగుపెట్టిన శ్వేత మలయాళ, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించారు. తెలుగులో 'ఆనందం', 'జూనియర్స్', 'రాజన్న' తదితర చిత్రాల్లో మెరిశారు.

నిజ జీవిత ఘటనల ఆధారంగా..



రమణ్, వర్ష విశ్వనాథ్ జంటగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' దీని ట్యాగ్‌లైన్. ఎలిక(గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్, మోషన్ పోస్టర్లను సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు ఆవిష్కరించి చిత్ర బృందానికి ఆల్ ద బెస్ట్ చెప్పారు. నిర్మాత రామకృష్ణ మాట్లాడుతూ 'నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని అన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు రామచంద్ర, హీరో రమణ్ తదితరులు పాల్గొన్నారు.

పదిహేను చిత్రాలకు శ్రీకారం




భీమవరం టాకీస్ పతాకంపై ఇప్పటికే 114 చిత్రాలను నిర్మించిన తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ఒకేసారి పదిహేను చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఈ వేడుకకు చిత్ర పరిశ్రమకు చెందిన మురళీమోహన్, రేలంగి నరసింహారావు, సుమన్, శ్రీకాంత్, జేడీ చక్రవర్తి, తనికెళ్ల భరణి, సి.కల్యాణ్, తమ్మారెడ్డి భరద్వాజ, తుమ్మల ప్రసన్న కుమార్, చదలవాడ శ్రీనివాసరావు, భరత్ భూషణ్‌తోపాటు ప్రముఖ రచయిత, రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ పదిహేను చిత్రాలను 2026 ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని రామసత్యనారాయణ తెలిపారు.

అడుగు అడుగునా...



రోహిత్ సాహిని ప్రధాన ప్రాతలో మహి కోమటిరెడ్డి తెరకెక్కించిన చిత్రం 'మిస్టీరియస్'. జయ్ వల్లందాస్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'అడుగు అడుగునా..' అంటూ సాగే గీతాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. పోలీస్ నిబద్ధత గురించి అద్భుతంగా రాయడంతోపాటు సంగీతాన్ని అందించిన ఎంఎల్ రాజాని కమిషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రోహిత్, దర్శకనిర్మాతలు మహి కోమటిరెడ్డి, వల్లందాస్, సహ నిర్మాత రామ్ ఉప్పు (బన్నీ రామ్) తదితరులు పాల్గొన్నారు.



FARNAZ



అంకితకు స్వర్ణం



న్యూఢిల్లీ: ఒలింపియన్ అంకితా ధ్యాని అంతర్జాతీయ వేదికపై పతకంతో సత్తా చాటింది. ఇజ్రాయెల్‌లోని జెరూసలెంలో జరిగిన గ్రాండ్ స్లామ్ అథ్లెటిక్స్ మీట్‌లో మహిళల 2000 మీటర్ల స్టీప్‌ల్‌చేజ్‌లో అంకిత స్వర్ణం సాధించింది. ఫైనల్స్‌లో అంకిత 6 నిమిషాల 12.92 సెకన్లలో గమ్యాన్ని అధిగమించి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో భారత్ తరపున గతంలో పారుల్ చౌదరి నెలకొల్పిన 6 నిమిషాల 14.38 సెకన్ల జాతీయ రికార్డును అంకిత బద్దలు కొట్టింది.

బతుకు 'ఆట'లో ఓడి..

- ఆర్థిక ఇబ్బందులతో అప్పులపాలు
- రైలుకింద పడి దుర్మరణం
- కబడ్డీ క్రీడాకారుడి విషాదాంతం



తిప్పర్తి/శాలిగౌరారం (ఆంధ్రజ్యోతి): క్రీడలను కెరీర్‌గా ఎంచుకున్నాడు.. అందుకు తగ్గట్టే అందులో రాణించాడు.. కానీ, జీవితంలో మాత్రం ఓడిపోయాడు. ఆర్థికంగా ఇబ్బందులు తాళలేక రైలుకింద పడి తనువు చాలించిన ఓ కబడ్డీ క్రీడాకారుడి విషాదాంతమిది. నల్లగొండ జిల్లా శాలి గౌరారం మండల కేంద్రానికి చెందిన బండారు మహేష్ (37) జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో ఎన్నో పతకాలు సాధించాడు. అయితే, కెరీర్‌కు వీడ్కోలు పలికాక ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న మహేష్ ఆర్థికంగా ఇబ్బందుల కారణంగా అప్పులు చేశాడు. అయితే, గురువారం సాయంత్రం తన ద్విచక్రవాహనంపై మిర్యాలగూడకు వెళ్లే క్రమంలో తిప్పర్తి చేరుకున్న మహేష్.. తాను రైలు కింద పడి చనిపోతున్నానని భార్య స్వప్నకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. తిప్పర్తి సమీపంలోని కన్నెకల్ రైల్వే అండర్ ప్రాసెస్ వద్ద మహేష్ విగతజీవిగా ఉండడాన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవతరం రాకెట్లు

పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు తర్వాత ప్రపంచ బ్యాడ్మింటన్ యవనికపై తెలుగు షట్లర్ల జోరు కొంత మేర తగ్గింది. నవతరం ఆటగాళ్ల రాక కోసం ఎదురుచూస్తున్న అభిమానుల ఆకాంక్షల్ని నిజం చేస్తూ మన్నేపల్లి తరుణ్, కలగొట్ల వెన్నెల ఇప్పుడు తెరపైకొచ్చారు. వీరు జాతీయ పోటీల్లోనే కాకుండా అంతర్జాతీయ టోర్నీల్లోనూ తమ ఉనికిని బలంగా చాటే దిశగా దూసుకెళ్తున్నారు.



తరుణ్

మన్నేపల్లి తరుణ్ చౌదరి.. ఖమ్మం జిల్లాకు చెందిన 23 ఏళ్ల ఈ కుర్రాడు ఇటీవల మకావు ఓపెన్‌లో టాప్‌సీడ్, ప్రపంచ 13వ ర్యాంకర్ లీ చెయుక్ యియు (హాంకాంగ్)ను ఓడించి అందరి దృష్టినీ ఆకర్షించాడు. కబడ్డీ క్రీడాకారుడైన తాతయ్య రంగారావు ప్రోత్సాహంతో ఎనిమిదేళ్ల ప్రాయంలో తరుణ్ రాకెట్ పట్టుకున్నాడు. సుధాకర్ రెడ్డి శిక్షణలో బ్యాడ్మింటన్ ఓనమాలు నేర్చుకున్న తరుణ్ రెండేళ్ల తిరిగేసరికి జిల్లా స్థాయిలో సింగిల్స్‌లో రన్నరప్, డబుల్స్‌లో విజేతగా నిలిచాడు. అక్కడ నుంచి అతను వెనుదిరిగి చూడలేదు. మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్‌కు మకాం మార్చిన తరుణ్ కొద్ది రోజులు శాట్ కోచ్ ఫణి కిశోర్ దగ్గర శిక్షణ తీసుకున్నాడు. ఆ తర్వాత పుల్లెల గోపీచంద్ అకాడమీలో చేరి మరింత రాటు దేలాడు.

ఆర్థిక అండ అవసరం..

మూడేళ్ల క్రితం వరకు స్పాన్సరర్లు లేకపోవడంతో తరుణ్ ఎక్కువ అంతర్జాతీయ టోర్నీలు ఆడలేకపోయాడు. ఇది అతడి అంతర్జాతీయ ర్యాంకింగ్‌పై ప్రభావం చూపింది. నాన్న సతీష్ కష్టంపైనే ఆధారపడాల్సి వచ్చిందని తరుణ్ తెలిపాడు. ప్రస్తుతం గోపీసార్, పలు సంస్థల సహకారంతో కొన్ని స్పాన్సర్‌షిప్‌లు దక్కాయన్నాడు. కానీ, తనలాంటి వర్ధమాన ఆటగాళ్లకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తే కచ్చితంగా ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తానని తరుణ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నాడు.

ఇక్కడ చేరాక..: గోపీచంద్ అకాడమీలోని అధునాతన సదుపాయాలు, క్రమశిక్షణతో కూడిన శిక్షణ.. అన్నింటికీ మించి కోచ్‌లు గోపీ, గురుసాయిదత్, పారుపల్లి కశ్యప్‌ల ప్రోత్సాహంతో తరుణ్ కెరీర్ మలుపు తిరిగింది. 2020 నుంచి గోపీచంద్ అకాడమీలో సాధన చేస్తున్న తరుణ్ ఈ నాలుగేళ్లలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టు తనను తాను మల్చుకున్నాడు. గత ఏడాది పురుషుల సింగిల్స్‌లో భారత్ నెంబర్ వన్‌గా ఎదిగిన తరుణ్ ప్రస్తుతం వరల్డ్ టాప్-40లో స్థానం సంపాదించాడు.



వెన్నెల

రైజింగ్ స్టార్


కలగొట్ల వెన్నెల.. సికింద్రాబాద్‌కు చెందిన ఈ రైజింగ్ స్టార్ ఇటీవలే ఇండోనేసియా వేదికగా జరిగిన ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించింది. దీంతో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ టోర్నీలో భారత్‌కు పతకం అందించి రికార్డు సృష్టించింది. అంతేకాదు, పీవీ సింధు తర్వాత ఈ పతకం కైవసం చేసుకున్న భారత మహిళా షట్లర్‌గానూ ఘనత వహించింది. 5 అడుగుల 8 అంగుళాలున్న వెన్నెల గత మూడేళ్లుగా జాతీయ స్థాయిలో అదరగొడుతోంది. వచ్చే నెలలో జరిగే వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్‌నకు కూడా అర్హత సాధించింది. బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడైన నాన్న శ్రీనివాస్‌రెడ్డి ప్రేరణతో బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా మలుచుకున్న 17 ఏళ్ల వెన్నెల.. క్రీడల్లో తండ్రి చేరలేకపోయిన ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు అడుగులు వేస్తోంది. ఎనిమిదేళ్ల ప్రాయంలో కోచ్ గోవర్ధన్ వద్ద బ్యాడ్మింటన్‌లో ఓనమాలు నేర్చుకున్న వెన్నెల.. 2019 నుంచి గోపీచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది. కెరీర్ ప్రారంభంలో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఆడిన వెన్నెల ఇప్పుడు సింగిల్స్‌పైనే పూర్తిగా దృష్టి సారించింది. పటిష్టమైన డిఫెన్స్, బలమైన స్మాష్‌లు, బ్యాక్‌హ్యాండ్ షాట్స్‌తో కోర్టులో వెన్నెల చిరుతలా కదలాడుతుంది. గత నెలలో జరిగిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టోర్నీ సింగిల్స్‌లో మూడో స్థానంలో నిలిచిన వెన్నెల, జూనియర్ విభాగం సింగిల్స్‌లో రన్నరప్, డబుల్స్‌లో టైటిల్ కైవసం చేసుకుంది. ప్రస్తుతం జూనియర్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో 33వ స్థానంలో ఉన్న ఈ యువ షట్లర్.. భవిష్యత్‌లో పెద్ద టోర్నమెంట్లలో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఆ ముగ్గురు అదరగొట్టారు

యాస్తిక, రాధ, తనూజ హాఫ్ సెంచరీలు

భారత మహిళలదే వన్డే సిరీస్



యాస్తిక భాటియా (66)

రాధా యాదవ్ (60)

తనూజా కన్వర్ (50)

బ్రిస్బేన్: ఓపెనర్ యాస్తిక భాటియా (66), కెప్టెన్ రాధా యాదవ్ (60), తనూజా కన్వర్ (50) అర్ధ సెంచరీలతో మెరవడంతో ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో వన్డే సిరీస్‌ను భారత్ 'ఎ' టీమ్ మరో మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ ఉత్కంఠగా జరిగిన రెండో మ్యాచ్‌లో 2 వికెట్లతో ఆతిథ్య జట్టును ఓడించింది. మొదట ఆసీస్ 50 ఓవర్లలో 265/9 స్కోరు చేసింది. అలీసా హీలీ (91), కిమ్ గార్త్ (41 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ మిన్ను మణి 3, పేసర్ సైమా ఠాకూర్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం భారత్ 'ఎ' 49.5 ఓవర్లలో 266/8 స్కోరు చేసి గెలిచింది. ప్రేమా రావత్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఎడ్గర్, హేవార్డ్, జార్జియా తలా 2 వికెట్లు తీశారు. ఛేదనలో 83/4తో ఇబ్బందుల్లో పడిన దశలో రాధ, యాస్తిక ఐదో వికెట్‌కు 68 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత ఓ దశలో మనోళ్లు 193/7 స్కోరుతో ఉండడంతో ఓటమి తప్పదేమోననిపించింది. అయితే తనూజ, ప్రేమ ఒత్తిడిని అధిగమించి ఎనిమిదో వికెట్‌కు 68 రన్స్ జోడించడం ద్వారా జట్టును విజయ తీరాలకు చేర్చారు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా 'ఎ': 50 ఓవర్లలో 265/9 (అలీసా 91, గార్త్ 41 నాటౌట్, మిన్ను మణి 3/46, సైమా ఠాకూర్ 2/30).

భారత్ 'ఎ': 49.5 ఓవర్లలో 266/8 (యాస్తిక 66, రాధ 60, తనూజా 50, ప్రేమ 32 నాటౌట్, అమీ 2/55, ఎలా హేవార్డ్ 2/57, జార్జియా 2/68).

మీ వల్లే సంతోషంగా ఉన్నాం..

క్రీడా దిగ్గజాల స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ: భారత 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా దేశ ప్రజలకు క్రీడా ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. 'ఈరోజు మేం సంతోషంగా, స్వేచ్ఛగా ఉంటున్నామంటే సరిహద్దులో మీరు అత్యంత ధైర్య సాహసాలతో నిలబడడమే కారణం. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మన హీరోలకు సెల్యూట్ చేద్దాం' అంటూ విరాట్ కోహ్లీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. 'హ్యాపీ ఇండిపెండెన్స్ డే. జైహింద్' అని ట్వీట్ చేసిన సచిన్ టెండూల్కర్ జెండాతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశాడు. రోహిత్, సెహ్వాగ్, మిథాలీలతో పాటు ఇతర క్రికెటర్లు తమ స్పందనను తెలిపారు. మరోవైపు స్టార్ షూటర్ మను భాకర్ వయోలిన్‌పై జాతీయ గీతాన్ని స్వరపరిచి ఆకట్టుకుంది.

ఆరో స్థానంలో గుకేష్

సెయింట్ లూయిస్ (యూఎస్ఏ): వరల్డ్ చెస్ టూర్‌లో భాగంగా జరుగుతున్న సెయింట్ లూయిస్ ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేష్ ఆరో స్థానానికి దిగజారాడు. బ్లిట్జ్‌లో తొలి తొమ్మిది రౌండ్లలో గుకేష్ ఒక విజయం సాధించి, నాలుగు గేమ్‌లు డ్రాగా ముగించాడు. దాంతో మొత్తం 13 పాయింట్లతో వియత్నాం గ్రాండ్‌మాస్టర్ లీమ్ లేతో కలిసి గుకేష్ సంయుక్తంగా ఆరో స్థానంలో నిలిచాడు.

భారత్‌లో మెస్సీ పర్యటన ఖరారు



కోల్‌కతా: అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ భారత పర్యటన అధికారికంగా ఖరారైంది. నాలుగు రోజుల ఈ పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రమోటర్లు శుక్రవారం వెల్లడించారు.

డిసెంబరు 12: రాత్రికి కోల్‌కతా చేరుకోనున్న మెస్సీ.

డిసెంబరు 13: ఉదయం 'మీట్ అండ్ గ్రీట్' కార్యక్రమం. అనంతరం మెస్సీ విగ్రహావిష్కరణ. సాల్ట్‌లేక్ లేదా ఈడెన్ గార్డెన్స్‌లో గోట్ కన్సర్ట్, గోట్ కప్. మెస్సీ కుడ్య చిత్రాన్ని (25 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు) గోట్ కన్సర్ట్ సందర్భంగా అతడికి ప్రదానం చేస్తారు. ఈడెన్ గార్డెన్స్‌లో గంగూలీ, లియాండర్ పేస్, బైచుంగ్ భూటియా, జాన్ అబ్రహంతో కూడిన జట్టుతో కలిసి మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడతాడు. సాయంత్రం అహ్మదాబాద్ వెళ్లి అదానీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటాడు.

డిసెంబరు 14: ముంబై బ్రబౌర్న్ స్టేడియంలో 'మీట్ అండ్ గ్రీట్'. షారుఖ్ ఖాన్, లియాండర్ పేస్‌తో కలిసి మెస్సీ టెన్నిస్ ఆడతాడు. వాంఖడే స్టేడియంలో గోట్ కన్సర్ట్, గోట్ కప్. గోట్ కెప్టెన్ల సమావేశంలో భాగంగా సచిన్, ధోనీ, రోహిత్‌తో భేటీ.

డిసెంబరు15: న్యూఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశం.

మార్కెట్లకు వచ్చే 2-3 నెలలు కీలకం

ట్రంప్ సుంకాలతోనే ఆటుపోట్లు ● యూనియన్ ఏఎంసీ సీఈఓ మధు నాయర్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటుతో దేశీయ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. ఇదే అదునుగా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) పాలోమంటూ అమ్మకాలతో హోరెత్తిస్తున్నారు. దీంతో మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు బేర్‌మంటున్నాయి. రిటైల్ మదుపరులూ బేజారవుతున్నారు. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లో వచ్చే రెండు, మూడు నెలలు చాలా కీలకంగా ఉంటాయని అంటున్నారు యూనియన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) సీఈఓ మధు నాయర్. స్టాక్ మార్కెట్ల గమనం, పెట్టుబడులు, సుంకాల ప్రభావం వంటి తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. ఆ వివరాలు..



ప్రస్తుతం స్టాక్ మార్కెట్లో నెలకొన్న ఆటుపోట్లు ఎన్నాళ్లు కొనసాగే అవకాశం ఉంది?

ప్రస్తుతం మన మార్కెట్ చాలా ఆసక్తికరంగా కనిపిస్తోంది. ఒకవైపు అమెరికా సుంకాల పోటు, కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రికత్తల ఒత్తిళ్లతో ఎఫ్‌పీఐలు అమ్మకాలు పెంచాయి. మరోవైపు చక్కటి ద్రవ్య విధానాలు, మెరుగైన జీడీపీ వృద్ధి రేటుతో మిగతా దేశాలతో పోలిస్తే మన ఆర్థిక పటిష్ఠంగా ఉంది. వచ్చే రెండు మూడు నెలలు మన మార్కెట్‌కు అత్యంత కీలకంగా భావించాలి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే ప్రస్తుత అనిశ్చితి చాలా వరకు తగ్గి మార్కెట్ స్థిరపడే అవకాశం ఉంది.

రిటైల్ మదుపరుల పెట్టుబడి వ్యూహం ఎలా ఉండాలి?

స్వల్పకాలంలో మార్కెట్ ఆటుపోట్లు ఎలా ఉంటాయో ఊహించలేం. దీన్ని దృష్టిలో ఉంచుకుని రిటైల్ మదుపరులు తమ ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా దీర్ఘకాలిక దృష్టితో మంచి కంపెనీల షేర్లలో పెట్టుబడులు పెట్టాలి. ఇలాంటి పెట్టుబడులు దీర్ఘకాలంలో మంచి లాభాలు పంచుతాయని అనుభవాలు చెబుతున్నాయి. అయితే ఇందుకు క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి వ్యూహం కీలకం. ప్రస్తుత ఆటుపోట్ల నేపథ్యంలో క్రమానుగత పెట్టుబడులు (సిప్), క్రమానుగత బదిలీ పథకాలు (ఎస్‌టీపీ) ఇందుకు బాగా ఉపయోగపడతాయి. ఈ వ్యూహాల ద్వారా షేర్ల సగటు కొనుగోలు ధర తగ్గడంతో పాటు పెట్టుబడులపై మార్కెట్ ఆటుపోట్ల ప్రభావం పెద్దగా ఉండదు. సరైన సమయంలో పెట్టుబడి పెట్టలేక పోయామే అనే బెంగ కూడా ఉండదు.

వడ్డీ రేట్లు మరింత తగ్గుతాయా?

జీడీపీ వృద్ధి రేటుకు కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ సమీప భవిష్యత్‌లో మన దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం 2 నుంచి 4 శాతం మించకపోవచ్చు. సుంకాల ముప్పు ఉన్నా ప్రస్తుతం మన ఆర్థిక పరిస్థితి చాలా వరకు స్థిరంగానే ఉన్నాయి. కాబట్టి భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు ఇంకా తగ్గించే అవకాశం తప్ప పెంచే అవకాశం కనిపించడం లేదు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే ఏయే రంగాలపై ప్రభావం పడొచ్చు?

అమెరికాకు ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడిన రత్నాభరణాలు, టెక్స్‌టైల్, రొయ్యల కంపెనీలు, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు బాగా దెబ్బతినే అవకాశం ఉంది. అమెరికా మార్కెట్‌పై ఆధారపడిన కొన్ని భవన నిర్మాణ పరికరాల కంపెనీలపైనా ఒత్తిడి తప్పదు.

దేశీయ స్టాక్ మార్కెట్‌కు సానుకూల, ప్రతికూల అంశాలేమిటి?

పటిష్ఠంగా ఉన్న ఆర్థిక పరిస్థితులు, ప్రభుత్వ పెట్టుబడులు, పెరుగుతున్న కంపెనీల రాబడులు, కోలుకుంటున్న పట్టణ, గ్రామీణ వినియోగం మన మార్కెట్‌కు ఉన్న ప్రత్యేక సానుకూల అంశాలు. పొంచి ఉన్న అమెరికా సుంకాల పోటు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు, చమురు ధరల్లో ఆటుపోట్లు, ఎఫ్‌పీఐల అమ్మకాలు పెద్ద ప్రతికూల అంశాలు. ప్రధాన దేశాల ద్రవ్య విధానాలను కూడా మనం జాగ్రత్తగా గమనిస్తుండాలి.

పసిడి ధరలు మరింత పెరుగుతాయా?

ప్రస్తుత అంతర్జాతీయ అనిశ్చితిలో పసిడి ఆకర్షణీయంగానే కనిపిస్తోంది. కరెన్సీ, రిజర్వ్‌ల నష్టభయాన్ని తట్టుకునేందుకు దాదాపు అన్ని దేశాలు కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని పెట్టుకుంటున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలు ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లు, అంతర్జాతీయ ఉద్రికత్తలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా పసిడికి ఉన్న ప్రాముఖ్యత మరింత పెరిగింది. కాబట్టి మధ్యకాలికంగా చూస్తే బంగారం ధర మరింత పెరిగే అవకాశమే కనిపిస్తోంది.

యూనియన్ ఏఎంసీ నుంచి ఏమైనా కొత్త పథకాలు తీసుకొస్తున్నారా?

మ్యూచువల్ ఫండ్స్‌తో పాటు ఇతర వ్యాపారాల్లోకి విస్తరించబోతున్నాం. మా దీర్ఘకాలిక వృద్ధి వ్యూహంలో భాగంగా మారుతున్న మదుపరుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్‌ఐఎఫ్), ప్రత్యామ్నాయ పెట్టుబడి పథకాల (ఏఐఎఫ్)ను ప్రారంభించబోతున్నాం. వీటికి తోడుగా గిఫ్ట్ సిటీ ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్ఎస్‌సీ) ఏర్పాటు చేసి విదేశీ మదుపరులకూ మా సేవలు అందించబోతున్నాం. ఈ చర్యలతో యూనియన్ ఏఎంసీ సమగ్ర ఆర్థిక సేవల సంస్థగా ఎదగనుంది.

ప్రస్తుతం సంస్థ ఏయూఎంలు ఏ స్థాయిలో ఉన్నాయి?

ఈ ఏడాది జూన్ నాటికి యూనియన్ ఏఎంసీ నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) రూ.20,360.95 కోట్లుగా ఉన్నాయి.

జీఎస్‌టీలో మలివిడత సంస్కరణలు

సులభంగా రిజిస్ట్రేషన్లు, రిటర్న్‌ల ప్రక్రియ

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వ్యవస్థను సమూలంగా సంస్కరించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని ప్రతిపాదనలు చేసింది. వచ్చే నెలలో జరిగే జీఎస్‌టీ మండలి సమావేశంలో దీనిపై చర్చ జరగనుంది. పన్ను ఎగవేతలు, బోగస్ ఇన్వాయిస్‌లతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) స్వాహాకు చెక్ చెప్పేలా ఈ సంస్కరణలు ఉంటాయని అధికార వర్గాలు చెప్పాయి. వేగంగా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్, రిటర్న్‌ల ప్రాసెసింగ్, రిఫండ్‌ల క్లియరెన్స్ ఉండేలా ఈ సంస్కరణలు ఉంటాయని సమాచారం. ఈ సంస్కరణలను అధికార వర్గాలు 'మలివిడత జీఎస్‌టీ సంస్కరణలు'గా అభివర్ణించాయి. ఈ సంస్కరణలతో జీఎస్‌టీ పన్ను చెల్లింపుదారులపై కంప్లయెన్స్ (అమలు) భారం తగ్గుతుందని భావిస్తున్నారు. ఈ సంస్కరణల్లో భాగంగా కొత్త వ్యాపార సంస్థలు, స్టార్టప్ కంపెనీల జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మూడు రోజుల్లో పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అలాగే ఎగుమతిదారులు, ఇన్వర్టెడ్ డ్యూటీ చెల్లింపు విధానంలో ఉన్న జీఎస్‌టీ చెల్లింపుదారులతో సహా 80 శాతం రిటర్న్‌ల రిఫండ్స్‌ను, రిటర్న్ ఫైల్ చేసిన వెంటనే వేగంగా క్లియర్ చేయాలని ప్రతిపాదించారు. ముందుగానే పూర్తి చేసిన రిటర్న్‌ల ద్వారా రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ మరింత సులభమవుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

16 తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	510
చిత్తూరు	548	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	121
కరీంనగర్	102	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	113	అనంతపురం	100
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,300 ▼	92,850 ▼	1,26,000 ▲
విజయవాడ	1,03,000 ▼	97,000 ▲	1,18,250 ▼
విశాఖపట్నం	1,01,350 ▼	92,900 ▼	1,26,100 ▲
రాజమండ్రి	1,01,240 ▼	92,800 ▼	1,18,200 ▼
ప్రొద్దుటూరు	1,00,800 ▼	92,740 ▼	1,17,300 ▼
ముంబై	1,00,023 ▲	91,621 ▲	1,14,933 ▼

కొత్త తరం ఎస్‌యూవీల కోసం 'న్యూఐక్యూ' ప్లాట్‌ఫామ్

2027 నాటికి మార్కెట్లోకి 4 కొత్త కార్లు.. మహీంద్రా అండ్ మహీంద్రా



ముంబై: దేశీయ మార్కెట్ సహా అంతర్జాతీయ మార్కెట్‌కు కొత్త తరం స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ)ను అందించడం లక్ష్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) 'న్యూఐక్యూ' పేరిట ఒక కొత్త ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా నాలుగు ఎస్‌యూవీ కాన్సెప్ట్ కార్లు.. విజన్.ఎస్, విజన్.టీ, విజన్.ఎస్ఎక్స్‌టీ, విజన్.ఎక్స్‌లను కూడా ఆవిష్కరించింది. ఈ సరికొత్త మాడ్యులర్ వేదికపై తొలి ఉత్పత్తిని 2027లో మార్కెట్లోకి తేవాలన్నది తమ లక్ష్యమని ఈ కొత్త వేదిక, కాన్సెప్ట్‌లను విడుదల చేసిన సందర్భంగా గ్రూప్ సీఈఓ అనిష్ షా చెప్పారు. ప్రపంచ మార్కెట్లో ఇంతవరకు ఎవరూ ప్రవేశించని విభాగంలోకి అడుగుపెట్టేందుకు ఈ కొత్త వేదిక రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. ప్రధానంగా ఈ కాన్సెప్ట్ ఎస్‌యూవీలు 4 మీటర్ల లోపు నిడివి గల మిడ్‌సైజ్ ఉత్పత్తులని షా తెలిపారు.

పబ్లిక్ ఇష్యూకి ఆర్ఎస్ బ్రదర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్ఎస్ బ్రదర్స్ సహా పలు బ్రాండ్‌నేమ్స్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రిటైల్ స్టోర్లను నిర్వహిస్తున్న హైదరాబాద్ సంస్థ ఆర్ఎస్‌బీ రిటైల్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. ఇందుకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతో పాటు ప్రమోటర్ల వాటాకు చెందిన 2.98 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు కంపెనీ డీఆర్‌హెచ్‌పీలో వెల్లడించింది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.1,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. తాజా ఈక్విటీ జారీ ద్వారా సమీకరించనున్న నిధుల్లో రూ.275 కోట్లను రుణాల చెల్లింపుల కోసం వినియోగించుకోనున్నట్లు కంపెనీ తెలిపింది. ఆర్ఎస్ బ్రదర్స్ సౌత్ ఇండియా షాపింగ్ మాల్ బ్రాండ్‌నేమ్‌తో మరిన్ని స్టోర్ల ఏర్పాటుకు రూ.118 కోట్లు వెచ్చించనున్నట్లు, మిగతా సొమ్మును సాధారణ వ్యాపార అవసరాల కోసం ఉపయోగించుకోవాలనుకుంటున్నట్లు వెల్లడించింది.

22 నగరాలు.. 73 స్టోర్లు: ఆర్ఎస్‌బీ రిటైల్ 2008లో ఏర్పాటైంది. ఆర్ఎస్ బ్రదర్స్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌తో పాటు కాంచీపురం నారాయణి సిల్క్స్, డీప రాయల్, వాల్యూ జోన్ హైపర్ మార్ట్ బ్రాండ్ నేమ్స్‌తో రిటైల్ విక్రయ స్టోర్లను నిర్వహిస్తోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణ, ఏపీ, కర్ణాటకలోని 22 నగరాల్లో మొత్తం 73 స్టోర్లను కలిగి ఉంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఆర్ఎస్‌బీ రిటైల్ రూ.2,694 కోట్ల ఆదాయంపై రూ.104.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. వేగంగా వృద్ధి చెందుతున్న దేశీయ రిటైల్ ఇండస్ట్రీ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.92.6 లక్షల కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉందని టెక్నోపార్క్ నివేదిక అంచనా వేసింది.

తెలంగాణలో యూపీ, ఎంపీ విద్యుత్!

- దాచుకుని అవసరమైనప్పుడు తీసుకుంటున్నాయి
- రాష్ట్రాల మధ్య 'కరెంట్ బ్యాంకింగ్' విధానం

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు విద్యుత్‌ను తెలంగాణలో 'దాచుకుంటున్నాయి'. ఇలా యూపీ ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు, మళ్లీ మార్చి 1 నుంచి 31 వరకు 1381.60 మిలియన్ యూనిట్లను తెలంగాణలోని డిస్కమ్‌లలో దాచుకోగా.. ఆ కరెంట్‌ను తెలంగాణ మే 15 నుంచి జూలై 15 దాకా యూపీకి అందించింది. ఇక మధ్యప్రదేశ్ మార్చి 11 నుంచి 15 దాకా 129.60 మిలియన్ యూనిట్లు, ఫిబ్రవరి 10 నుంచి ఏప్రిల్ 30 దాకా 4.80 మిలియన్ యూనిట్లను తెలంగాణలో దాచుకుంది. ఈ కరెంట్‌ను తెలంగాణ నవంబరు 1 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 మధ్యలో ఇవ్వనుంది. డిమాండ్ లేని సమయంలో కరెంట్‌ను ఒక రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఇవ్వడం, మళ్లీ డిమాండ్ ఏర్పడినప్పుడు తిరిగి తీసుకోవడాన్ని బ్యాంకింగ్ (స్వాపింగ్) విధానంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక, వాణిజ్య రంగాల వృద్ధితో విద్యుత్ డిమాండ్ ఏటికేడు పెరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 17,162 మెగావాట్ల డిమాండ్ ఉండగా.. ఇది 2025-26లో 18,825 మెగావాట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా చేయాలంటే ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఎక్స్)లో కొనుగోలు చేయాల్సి ఉండనుంది. దాంతో రాష్ట్రాలు పరస్పర అంగీకారంతో కరెంట్‌ను దాచుకుంటూ మళ్లీ అవసరమైనప్పుడు తీసుకుంటున్నాయి. గతంలో దక్షిణాది, ఉత్తరాది గ్రిడ్‌లు అనుసంధానమై ఉండేవి కావు. పవర్ గ్రిడ్ కలిపిన తర్వాత ఉత్తరాదిలో ఏ రాష్ట్రం నుంచైనా విద్యుత్ లభించే అవకాశాలు మెరుగుపడడంతో బ్యాంకింగ్ విధానం సులభమైంది.

కృష్ణా, గోదావరిలో నీటివాటా కోసం పోరాటం

- ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా మేడిగడ్డ ప్రాజెక్టు
- బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పులకు ప్రతినెలా రూ.6వేల కోట్లు వడ్డీ
- కరీంనగర్‌లో విలేకరులతో మంత్రి శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గోదావరి నీటిలో తెలంగాణ వాటా దక్కేవరకు కాంగ్రెస్ ప్రభుత్వ పోరాటం కొనసాగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరిలో తెలంగాణ నీటివాటాను కేంద్రప్రభుత్వం త్వరగా తేల్చాలని అన్నారు. ఇచ్చంపల్లి, తుమ్మిడిహెట్టితో పాటు గోదావరి, కృష్ణానదుల జలాలతో తెలంగాణ ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇవ్వాలని కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే ఏ విధానాన్ని అంగీకరించబోమని అన్నారు. తెలంగాణ వాటా నీటి చివరిబొట్టు వరకు నిలువ చేసేందుకు ప్రాజెక్టులకు అనుమతి వచ్చాక, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఏ జలాలతో.. ఏ పేరుతో.. ఏ ప్రాజెక్టు నిర్మించుకుంటారో వారిష్టమని చెప్పారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్రమే కారణమని, చైనాతో అంక్షలతో ముందస్తుగా సరైన విధానం అవలంబించకపోవటంతో ఈ సమస్య తలెత్తిందని అన్నారు. ప్రస్తుతం వచ్చిన యూరియా రైతులకు ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తున్నామని, కొన్ని చోట్ల కావాలని కొందరు కృత్రిమ కొరతతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయవాది వామన్‌రావు దంపతుల హత్య కేసును సిట్ లేదా సీబీఐతో విచారణ జరుపుతామని, దాంతో అసలు దోషులు, వారికి సహకరించిన నాటి ప్రభుత్వ పెద్దలు బయటికి వస్తారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రూ. లక్షల కోట్ల అప్పులకు ప్రతినెలా రూ. ఆరు వేల కోట్లు వడ్డీ, అసలు రూపంలో చెల్లిస్తున్నామని చెప్పారు. డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిలువచేయాలా, మరమ్మతులు చేయాలా అనేది నిర్ణయిస్తామన్నారు. అతి తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టుకు నీరందించేలా మేడిగడ్డ ప్రాజెక్టు ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు.

కాళేశ్వరం రుణాల పునర్వ్యవస్థీకరణ

(మొదటి పేజీ తరువాయి)

కార్పొరేషన్(పీఎఫ్‌సీ) నుంచి 10.90 శాతం వార్షిక వడ్డీతో స్వల్పకాలిక రుణాలను సేకరించాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి జాతీయ బ్యాంకులతో పాటు ఆర్ఈసీ, పీఎఫ్‌సీ నుంచి రూ.87,449 కోట్ల రుణం మంజూరవ్వగా అందులో రూ.71,566 కోట్లు విడుదలయ్యాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.10,000 కోట్ల రుణం మంజూరు కాగా రూ.7,722 కోట్లు విడుదలయ్యాయి. ఇప్పటి దాకా చేసిన చెల్లింపులు పోను ఈ రెండు ప్రాజెక్టులు కలిపి ఇంకా రూ.68,273 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ రెండు ప్రాజెక్టులకు కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకున్నారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఐడీసీఎల్ ద్వారా ఇందిరమ్మ వరద కాలువ, దేవాదుల ఎత్తిపోతల పథకం, సమ్మక్కసాగర్ బ్యారేజీ, సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బ్యారేజీ కోసం రూ.19,643 కోట్ల రుణాన్ని సేకరించారు. ఇందులో ప్రస్తుతం రూ.12,856 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ రుణాలన్నీ 10.75 నుంచి 11.25 శాతం వార్షిక వడ్డీతో తీసుకున్న స్వల్ప కాలిక రుణాలే. దీంతో రెండు కార్పొరేషన్ల నుంచి రుణాల(అసలు, వడ్డీ) చెల్లింపునకు ఏటా రూ.13వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొత్తం రుణాల్లో రూ.26వేల కోట్ల రుణం పునర్వ్యవస్థీకరణకు కేంద్రం అంగీకారం తెలిపింది. దీంతో స్వల్పకాలిక రుణం కాస్తా దీర్ఘకాలిక రుణంగా మారనుంది. రాబోయే 10 ఏళ్లలో ఈ రుణం చెల్లించాల్సి ఉండగా.. పునర్వ్యవస్థీకరణతో రుణ చెల్లింపు వ్యవధి 25 నుంచి 30 ఏళ్లకు పెరగనుంది. ప్రస్తుతం 10.9 శాతంగా ఉన్న వార్షిక వడ్డీ 7.5 శాతానికి తగ్గనుంది. ఫలితంగా ఏటా రుణ చెల్లింపులకు కేటాయిస్తున్న మొత్తం రూ.13వేల కోట్ల నుంచి రూ.9 వేల కోట్లకు తగ్గనుంది. దాంతో రూ.4 వేల కోట్ల మేర నిధులు ప్రభుత్వానికి అందుబాటులో ఉంటాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

కాదని అవునన్నారు..

కాళేశ్వరం కార్పొరేషన్ కింద పీఎఫ్‌సీ నుంచి తీసుకున్న రూ.37,737 కోట్లు, ఆర్ఈసీ నుంచి తీసుకున్న రూ.30,536 కోట్ల రుణాలను పునర్వ్యవస్థీకరించే అవకాశాలు ఉన్నాయా ? అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మార్చి 17న లోక్‌సభలో ప్రశ్న లేవనెత్తారు. ఇందుకు స్పందించిన కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పునర్వ్యవస్థీకరణ ఆలోచన లేదని బదులిచ్చారు. అప్పుడు కాదన్న కేంద్రం అనూహ్యంగా రుణాల రీస్ట్రక్చరింగ్‌కు అంగీకారం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఉపశమనం లభించినట్లయింది. రుణాలు రీస్ట్రక్చరింగ్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు కొంత మేర సత్ఫలితం ఇచ్చినట్లు అయింది.

కాళేశ్వరం కార్పొరేషన్ తీసుకున్న స్వల్పకాలిక రుణాలివే..

రుణ సంస్థ	ఇచ్చిన రుణం (రూ.కోట్లలో)	వడ్డీ శాతం
పీఎఫ్‌సీ	25,312	9.45-10.90
ఆర్ఈసీ లింక్-1	4,657.95	10.90
ఆర్ఈసీ లింక్-2	11784.70	10.90
ఆర్ఈసీ లింక్-4	14,093	10.90

మరో సరగసీ దందా!

(మొదటి పేజీ తరువాయి)

మహిళలతో అద్దె గర్భం దందా సాగిస్తున్నారు. సంతానం లేని దంపతుల నుంచి రూ.20 లక్షల చొప్పున వసూలు చేస్తున్నారు. పేట్‌బషీరాబాద్, మేడ్చల్ ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం దాడి చేయడంతో సరగసీ దందా బయటపడింది. సరగసీ పేరుతో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ దారుణ మోసాలు వెలుగు చూసిన కొద్దిరోజులకే ఈ దందా బయటపడడం గమనార్హం. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఎస్‌వోటీ అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ బాలగంగిరెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఏపీలోని చిలుకలూరిపేటకు చెందిన నర్రెద్దుల లక్ష్మీరెడ్డి (50) ఉపాధి కోసం ముంబైకి వెళ్లి అక్రమంగా మానవ రవాణా చేస్తూ పట్టుబడి జైలుకెళ్లింది. విడుదలైన తర్వాత తన కుమారుడు నరేందర్ రెడ్డి (25)తో కుత్బుల్లాపూర్ సర్కిల్ పద్మానగర్ రింగు రోడ్డు సమీపంలోని మాణిక్య నగర్‌లో ఉంటూ సరగసీ దందా మొదలుపెట్టింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో వారు ఉంటూ పెంట్ హౌస్‌లో సరగసీ అండ్ ఎగ్ ట్రేడింగ్ కేంద్రం నడుపుతోంది. మాదాపూర్‌లోని శ్రీలీల, హెగ్డే ఫర్టిలిటీ-ఐవీఎఫ్ కేంద్రాలకు వెళ్లి సంతానం కలగదని ఆశలు వదులుకున్న దంపతుల సమాచారం, వారి ఫోన్ నంబర్లను అక్కడ సిబ్బంది ద్వారా సేకరిస్తుంది. అద్దె గర్భం ద్వారా పిల్లలు కలిగేలా చేస్తానని నమ్మించి పిలిపించుకుంటుంది. అలాంటి వారి నుంచి రూ.20 లక్షలకు పైగా వసూలు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. గర్భం అద్దెకిచ్చే పేద మహిళలకు మాత్రం స్వల్ప మొత్తంలో ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. వారిని బెదిరించడానికి వీలుగా లక్ష్మి, నరేందర్ రెడ్డిలు ఖాళీ బాండ్ పేపర్ల సంతకాలు తీసుకుంటున్నారు. పోలీసుల దాడిలో వీరిద్దరితో పాటు గర్భాన్ని అద్దెకిచ్చే ఏపీలోని రంపచోడవరం, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాలకు చెందిన ఆరుగురు మహిళలను, కర్ణాటకకు చెందిన మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. రూ.6.47 లక్షలు, ల్యాప్‌ట్యాప్, ప్రామిసరీ నోటు, నాన్ జుడీషియల్ బాండ్ పేపర్లు, హార్మోన్ ఇంజెక్షన్లు, మందులు, హెగ్డే ఆస్పత్రి, శ్రీలీల ఆస్పత్రుల కే షీట్లు, 6 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఆరు ఫర్టిలిటీ కేంద్రాల పాత్ర ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. మాదాపూర్ హెగ్డే ఫర్టిలిటీ సెంటర్, సోమాజిగూడ అను టెస్ట్ ట్యూబ్ సెంటర్, బంజారాహిల్స్ ఫర్టీ కేర్, ఈవీఏ ఐవీఎఫ్, అమూల్య ఐవీఎఫ్, కొండాపూర్ శ్రీ ఫర్టిలిటీ సెంటర్లతో నిందితులు లక్ష్మి, నరేందర్ రెడ్డికి సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ కేంద్రాల పాత్రపై లోతైన దర్యాప్తు చేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

డీజీపీ పేర్ల జాబితా.. చక్కర్లు

(మొదటి పేజీ తరువాయి)

పేర్లతో కూడిన జాబితాను యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో పంపించింది. ఇందులో రవిగుప్తా, సీవీ ఆనంద్, జితేందర్, కేంద్ర సర్వీసులో ఉన్న ఆప్టే వినాయక్ ప్రభాకర్, కొత్తకోట శ్రీనివాసరెడ్డి,బి.శివధర్ రెడ్డి, సౌమ్యా మిశ్రా, షికా గోయల్ పేర్లు ఉన్నాయి. ఈ జాబితా నుంచి ముగ్గురు పేర్లను ఎంపికచేసి తిరిగి పంపిస్తారు. ఈ ముగ్గురిలో ఒకర్ని డీజీపీగా ప్రభుత్వం నియమించవచ్చు. వాస్తవానికి డీజీపీ జితేందర్ వచ్చే నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. జాబితాలో పేర్కొన్న కొత్తకోట శ్రీనివాసరెడ్డి, రవిగుప్తాలు కూడా ఈ ఏడాది రిటైర్ కానున్నారు. ఈ నేపథ్యంలో ఎవరిని ఎంపిక చేస్తారన్నదానిపై ఆసక్తి నెలకొంది. ముగ్గురి పేర్లను సూచిస్తూ యూపీఎస్సీ జాబితా పంపిస్తుందని భావిస్తున్న తరుణంలో అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ లిస్టును తిప్పి పంపించింది. దాంతో అభ్యంతరాలను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో జాబితాను పంపించనుంది.

రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌తో ఫాస్టాగ్ వార్షిక పాస్ యాక్టివేషన్

- వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌తోనే పాస్ జారీ
- వేరే వాహనాలకు బదిలీ చేయడం కుదరదు

న్యూఢిల్లీ, ఆగస్టు 15: నాన్ కమర్షియల్ వాహనాలైన ప్రైవేటు కార్లు, జీపులు, వ్యాన్లకు వార్షిక టోల్ పాస్ వెసులుబాటు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. శుక్రవారం సాయంత్రం 4.30గంటల వరకు 1.2లక్షల మంది ఈ పాస్‌ను కొనుగోలు చేశారు. ఈ పాస్‌లను ఉపయోగించి దేశవ్యాప్తంగా 1.24లక్షల వాహనాలు టోల్‌గేట్లు దాటాయి. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ నుంచి ఈ వార్షిక టోల్ పాస్‌ను కొనుగోలు చేయవచ్చు. ఇప్పటికే ఫాస్టాగ్ వాడుతున్నవారు.. ఈ యాప్‌లోని ప్రత్యేక లింక్ ద్వారా వార్షిక పాస్‌ను డైరెక్ట్‌గా యాక్టివేట్ చేసుకోవచ్చు. పాస్ కోసం వెబ్ లింక్‌పై క్లిక్ చేసినప్పుడు వాహన రిజిస్ట్రేషన్ వివరాలను, మొబైల్ నంబర్‌ను అడుగుతుంది. వివరాలను ఎంటర్ చేసిన తర్వాత పేమెంట్ ఆప్షన్ వస్తుంది. డబ్బులు చెల్లించిన రెండు గంటల తర్వాత పాస్ యాక్టివేట్ అవుతుంది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ), రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌ల నుంచి కూడా వార్షిక పాస్‌ను పొందవచ్చు. అయితే, ఇప్పటివరకు వాహనం ఛాసిస్ నెంబర్‌తో ఫాస్టాగ్ తీసుకుని ఉంటే, ఆ వాహనదారులకు వార్షిక పాస్ వెసులుబాటు లభించదు. వాళ్లు మళ్లీ వాహన రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఫాస్టాగ్ తీసుకోవాలి. మొబైల్ నంబర్ కూడా అప్‌డేట్ చేసుకోవాలి. ఈ పాస్‌ను వేరే వాహనాలకు బదిలీ చేయరాదు అలా చేస్తే బ్లాక్ అవుతుంది. ఒకసారి రూ.3వేలు పెట్టి ఈ టోల్ పాస్ తీసుకుంటే దేశవ్యాప్తంగా ఉన్న జాతీయ హైవేలు, ఎక్స్‌ప్రెస్ వేల మీద ఉన్న టోల్ గేట్ల నుంచి 200సార్లు(200 ట్రిప్పులు) ప్రయాణించవచ్చు. ఏడాది కాలం పాటు ఈ పాస్ పనిచేస్తుంది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంట్లో కోటి నగదు.. కిలోల కొద్దీ బంగారం

- సతీశ్ శైల్ నివాసంలో ఈడీ అధికారుల తనిఖీలు
- రెండ్రోజుల పాటు కొనసాగిన తనిఖీల్లో

1.68 కోట్ల నగదు, 6.759 కిలోల బంగారం స్వాధీనం



సతీశ్ శైల్ నివాసంలో ఈడీ స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

బెంగళూరు, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా కారవార కాంగ్రెస్ ఎమ్మెల్యే సతీశ్ శైల్ ఇంటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నిర్వహించిన దాడిలో కళ్లు చెదిరేలా నగదు, బంగారం బయటపడింది. గతంలో ఐరన్ ఓర్ అక్రమ తరలింపు కేసులో ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం సతీశ్ శైల్‌కు ఏడేళ్ల జైలు, రూ.9 కోట్ల జరిమానా విధించింది. ఆ తర్వాత ఆ శిక్షను కర్ణాటక హైకోర్టు నిలిపివేసింది. ఈ కేసుకు సంబంధించే తాజాగా దాడులు జరిగాయి. బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు, బంగారం గుర్తించినట్లు ఈడీ 'ఎక్స్' ద్వారా శుక్రవారం ప్రకటించింది. బెళకెరె ఓడరేవు నుంచి ఇనుము ముడి ఖనిజం అక్రమ రవాణాకు సంబంధించి ఆర్థిక వ్యవహారాలపై ఈడీ వ్యూహాత్మకంగా దాడి చేసింది. ఢిల్లీ, గోవా, ముంబై, బెంగళూరు నుంచి ఈడీ అధికారులు దాడిలో పాల్గొన్నారు. 1.68 కోట్ల రూపాయల నగదు, 6.750 కిలోల బంగారు ఆభరణాలు, బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించారు. 14.13 కోట్ల రూపాయలు ఉన్న బ్యాంకు ఖాతాను స్తంభింప చేశారు. ఈ కేసుకు సంబంధించి పలు కార్యాలయాలపైనా దాడులు నిర్వహించారు.

సోనియా భారతదేశానికి కోడలై 59 ఏళ్లయింది!

- ధర్మం గురించి మాట్లాడే బీజేపీ నేతలకు వారసత్వం ఎలా వస్తుందో తెలియదా?
- త్యాగాల చరిత్రే లేని బీజేపీ.. గాంధీ కుటుంబంపై నిందలు వేయడమా?
- సోనియా, రాహుల్‌ల గొప్ప గుణం బీజేపీ నాయకుల్లో ఎవరికైనా ఉందా?
- యావత్ దేశం.. సోనియాను గెలిపిస్తే ఆమె మన్మోహన్‌ను ప్రధాని చేశారు
- 3సార్లూ దొంగ ఓట్లతోనే అధికారంలోకి బీజేపీ .. దీన్ని రాహుల్ నిరూపించారు
- ఇది సుప్రీం కోర్టులోనూ బట్టబయలైంది
- బీజేపీకి తొత్తుగా ఈసీ: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): "సోనియా గాంధీ భారతదేశం కోడలై 59 ఏళ్లు అయింది. దేశం, ధర్మం గురించి మాట్లాడే బీజేపీ నాయకులకు మన ధర్మంలో వారసత్వం ఎలా వస్తుందోకూడా తెలియదా? భర్తది ఏ కులమైతే భార్యదీ అదే కులమవుతుందన్న తెలివి కూడా వారికి లేదా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాత్ర, త్యాగాల చరిత్రే లేని బీజేపీ నాయకులు.. త్యాగాల కుటుంబమైన గాంధీ కుటుంబంపై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. గాంధీ కుటుంబానికి కోడలిగా వచ్చిన సోనియాను ఈ దేశ మహిళగా ప్రజలూ గుర్తించారన్నారు. ఆమె కూడా భారత సంప్రదాయాలకే కట్టుబడి ఉన్నారని, తన భర్త రాజీవ్‌గాంధీ చనిపోయాక ఆ బాధతో ఏడేళ్లు అజ్ఞాత జీవితం గడిపారన్నారు. ఆ తర్వాత ప్రజలు కోరుకుంటేనే ఆమె రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. యావత్ దేశం సోనియా నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీని గెలిపించినా ఆమె ప్రధాని పదవిని స్వీకరించలేదని జగ్గారెడ్డి గుర్తు చేశారు. ప్రధాని కావాలంటూ మన్మోహనే స్వయంగా రాహుల్‌ను కోరితే ఆయనా వద్దన్నారని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ కలిసి మన్మోహన్‌ను ప్రధానిని చేసి సుపరిపాలన అందించారని చెప్పారు. "సోనియా, రాహుల్‌కు ఉన్న ఈ గొప్పగుణం బీజేపీ నేతల్లో ఎవరికైనా ఉందా?" అని నిలదీశారు. ఇవాళ బీజేపీ ఇలా ఉందంటే వాజ్‌పేయి, అడ్వాణీల త్యాగం వల్లనేనన్నారు. బీజేపీ ఢిల్లీ నేతలకు త్యాగం చేసే గుణమే ఉంటే అడ్వాణీ ప్రధాని అయి ఉండేవారన్నారు. ఓట్ల చోరీ వల్లే బీజేపీ 3సార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. దీన్ని రాహుల్ నిరూపించారని, సుప్రీం కోర్టులోనూ నిజం బట్టబయలైందన్నారు. ఓట్ల చోరీ గురించి రాహుల్ మాట్లాడుతుంటే బీజేపీ నేతలు సమాధానం చెప్పలేక సోనియాపై నిందలు వేస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపీకి తొత్తుగా మారిందన్నారు. ప్రస్తుత బీజేపీ.. వాజ్‌పేయి, అడ్వాణీ కాలంనాటి విలువలతో నడుస్తున్న పార్టీ కాదన్నారు. తప్పు చేశామన్న భయం ఆ పార్టీ నేతల్లో మొదలైందన్నారు.



కేటాయింపులు ఘనం.. నిధుల విడుదల శూన్యం

కాగితాలకే పరిమితమైన ట్రైకార్ బడ్జెట్

- పదేళ్లుగా నిధుల కోసం గిరిజనుల నిరీక్షణ
- దెబ్బతిన్న విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలు
- గిరిజన ఆవాసాల్లో మౌలిక సదుపాయాల కొరత



హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజనుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటైన తెలంగాణ షెడ్యూల్డ్ తెగల ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక మద్దతు పథకాలను అమలు చేసే ట్రైకార్‌కు ప్రభుత్వాలు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేస్తున్నా.. నిధుల విడుదల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. గత పదేళ్లుగా నిధుల విడుదలలో జాప్యం కారణంగా అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు మధ్యలోనే నిలిచిపోయాయి. విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలు దెబ్బతిన్నాయి. గిరిజన విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందకపోవడంతో వారి ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతోంది. యువతకు రుణ సదుపాయం, స్వయం ఉపాధి కోసం శిక్షణ కార్యక్రమాలు, చిన్న వ్యాపారాలు, సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటుకు ఆర్థిక సహాయం వంటి పథకాలు నిలిచిపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతోంది. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కుంటుపడింది. గిరిజన రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు అందించడం, గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక మద్దతు, మార్కెట్ యాక్సెస్‌ను ప్రోత్సహించడానికి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మార్కెట్ ఏర్పరచడం వంటి కార్యక్రమాల అమలు నిలిచిపోయింది. రహదారులను మెరుగుపరచడం, గ్రామీణ రవాణా కార్యక్రమాల ద్వారా జీవనోపాధితోపాటు తాగునీటి సౌకర్యాలు కల్పించడం వంటి ప్రాథమిక అవసరాలు కూడా తీరడంలేదు. బడ్జెట్ కేటాయింపులు కాగితాలపై కనిపించినా.. ఆ నిధులు క్షేత్రస్థాయిలో గిరిజనులకు చేరడంలేదనే విమర్శలున్నాయి.

బడ్జెట్‌లో భారీగా చూపిస్తున్నా..

ప్రభుత్వ లెక్కల ప్రకారం.. ప్రతి ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో భారీ మొత్తాలు కేటాయిస్తున్నారు. కానీ, కేటాయించిన నిధుల్లో విడుదలవుతున్నది మాత్రం అతి తక్కువ శాతమే. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) బడ్జెట్‌లో ప్రభుత్వం ట్రైకార్‌కు రూ.2300 కోట్లు కేటాయించింది. కానీ, ఇప్పటివరకు ఒక్క రూపాయ కూడా విడుదల చేయలేదు. ఈ కేటాయింపుల్లో రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.1360 కోట్లు, గిరిజనుల భూమి అభివృద్ధికి తీసుకొచ్చిన ఇందిరా గిరి జలవికాసానికి రూ.600 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. కాగా, 2024-25లోనూ 360 కోట్లు కేటాయించినా.. ఒక్క పైసా విడుదల కాలేదు. ఆ నిధులను కూడా ఈ ఏడాది విడుదల చేసి ఖర్చు చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని ట్రైకార్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

బడ్జెట్‌లో కేటాయింపులు.. నిధుల విడుదల ఇలా..

ఆర్థిక సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)	విడుదలైన/ఖర్చు చేసిన నిధులు (రూ.కోట్లలో)
2023-24	543	51
2022-23	493	74
2021-22	428	174
2020-21	261	74
2019-20	261	135
2018-19	485	289
2017-18	363.69	35.37
2016-17	217.18	112
2015-16	350	72.89
2014-15	210.5	16.68

ఏపీలోనూ ఉచిత బస్సు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌లు పలువురు మహిళలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్ర మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందని వ్యాఖ్యానించారు. స్త్రీ శక్తి పథకంతో రాష్ట్రంలోని 2.62కోట్ల మంది మహిళలు లబ్ధి చేకూరుతుందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళా కండక్టర్లను గతంలో తానే నియమించానని, త్వరలో మహిళా డ్రైవర్లు కూడా రాబోతున్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో విద్యుత్ బస్సులనే కొనుగోలు చేస్తామని తెలిపారు. టీడీపీ మహిళల పక్షపాత పార్టీ అని పేర్కొన్నారు. వెబ్ సిరీస్‌ల్లో మహిళలను కించపరిచే వ్యాఖ్యలు కట్టడి చేసేలా మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఓ చట్టం తీసుకువచ్చే ఆలోచనలో ఉన్నామని చంద్రబాబు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు నష్టం కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. నివేదిక అందగానే సముచిత నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 30 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా ఓటు వేసే స్వాతంత్ర్యం ఇప్పుడే లభించిందని ఈ సందర్భంగా అన్నారు. రాజకీయ ముసుగు వేసుకుని సమాజాన్ని అతలాకుతలం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వదిలిపెట్టదని చంద్రబాబు స్పష్టం చేశారు. కాగా, మహిళా సాధికారత కోసం, ఆర్థిక స్వావలంబన కోసం ఉచిత ప్రయాణం అమలు చేయడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. ఇక, సొంత చెల్లితో రాఖీ కట్టించుకోలేని వ్యక్తులు టీడీపీని, ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నారంటూ వైసీపీ అధినేత జగన్‌ను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా ఘాటైన వ్యాఖ్యలు చేశారు.

మహిళలకు జీరో టికెట్లు ఇచ్చిన సీఎం

స్త్రీశక్తి పథకం ప్రారంభంలో భాగంగా ఉండవల్లి వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కిన సీఎం చంద్రబాబు.. డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్‌తో కలిసి 50 నిమిషాలపాటు ప్రయాణించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలకు సీఎం చంద్రబాబు జీరో ఫేర్ టికెట్ అందించారు.



మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్

బనకచర్లకు అభ్యంతరమెందుకు?

- ఎగువ రాష్ట్రాలు వరద వదులుతుంటే ఆ కష్టనష్టాలను దిగువ రాష్ట్రంగా భరిస్తున్నాం
- వృధాగా పోతున్న నీటిని వాడుకోకూడదంటే ఎలా: ఏపీ సీఎం

రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు గోదావరి వృధా జలాలను పోలవరం నుంచి బనకచర్లకు మళ్లించాలని నిర్ణయించామని సీఎం చంద్రబాబు తెలిపారు. 'సముద్రంలోకి వృధాగా పోయే నీటినే వినియోగిస్తాం. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర నీటి ప్రయోజనాలకు నష్టం వాటిల్లదు. ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. వరదలు వచ్చినప్పుడు ఎగువ రాష్ట్రాలు నీటిని విడుదల చేస్తే.. దిగువ రాష్ట్రంగా ఆ నష్టాలను, కష్టాలను భరిస్తున్నాం. అదే వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకు? వరదను భరించాలే గానీ.. దాని నుంచి ప్రయోజనం పొందకూడదంటే ఎలా కుదురుతుంది' అని ప్రశ్నించారు. 2027 డిసెంబరునాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ప్రకాశం జిల్లాను కరువు నుంచి బయటపడేసే వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని.. వచ్చే జూలై కల్లా సాగునీరు ఇచ్చే దిశగా పనులు చేస్తున్నామని చెప్పారు.

ఎర్రకోటపై ఆర్ఎస్ఎస్ ప్రస్తావన సరికాదు

- బీజేపీ కార్యాలయంలో మాట్లాడుకోవాలి
- వికసిత్ భారత్ సాధించాలనే

ఉద్దేశం మోదీకి లేదు: ఎంపీ చామల

న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపై జరిగిన స్వాతంత్ర వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగంపై ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని ఆర్ఎస్ఎస్ గురించి మాట్లాడడం సరికాదని, బీజేపీ కార్యాలయంలో జరిగే కార్యక్రమాల్లో ఈ విషయం మాట్లాడితే తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. అయితే, ఎర్రకోట వంటి జాతీయ వేదికపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆక్షేపణీయమని చామల అన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయంలో ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లోనూ జాతీయ జెండా ఎగురవేయలేదని, దేశం, జాతీయ జెండా పట్ల గౌరవం లేని సంస్థ గురించి ఎర్రకోటపై మోదీ ఎలా మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. ఇక సెమీ కండక్టర్ల విషయంలో మోదీ చేసిన వ్యాఖ్యలు ఆయన అవివేకానికి నిదర్శనమని చామల విమర్శించారు. 1983లోనే చండీగఢ్‌లో ఒక సెమీ కండక్టర్ ప్రాజెక్టు కార్యాలయం ప్రారంభమైందని గుర్తు చేశారు. మోదీ గుజరాత్‌కు అందలం వేసుకుంటూ తెలంగాణపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో సెమీ కండక్టర్ ఫ్యాక్టరీ పెట్టాలన్న ప్రతిపాదనను కేంద్రం నిరాకరించిందని, ఏపీలో పెడితేనే అనుమతి ఇస్తామని ఒత్తిడి చేసిందని తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏడాదిన్నరగా కేంద్ర మంత్రులకు ఎన్నో వినతులు సమర్పించినప్పటికీ, రాష్ట్రానికి ఎలాంటి సహకారం అందడం లేదన్నారు. మోదీకి వికసిత్ భారత్ సాధించాలనే ఉద్దేశం లేనందునే, తెలంగాణపై వివక్ష చూపుతున్నారని ఆరోపించారు.



ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఫిలింనగర్‌లోని కార్యాలయంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ వేమూరి రాధాకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. వేడుకల్లో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్ కోగంటి భానుప్రకాష్, ఉభయ సంస్థల్లోని అన్ని విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆనాడు స్వాతంత్ర్యం వద్దన్నవారే.. నేడు దేశాన్ని ఏలుతున్నారు: మహేశ్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఆనాడు బ్రిటీష్ పాలకుల అడుగులకు మడుగులు వత్తి స్వాతంత్ర్యం వద్దు, బ్రిటన్ వారే ముద్దన్న ఆర్ఎస్ఎస్ వారసులే ఈనాడు దేశాన్ని ఏలుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. వారు వారి అధికారాన్ని కాపాడుకోవడం కోసం మతం, కులం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీభవన్‌లో శుక్రవారం మహేశ్‌కుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎంపీ వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని రంగాలను ప్రలోభ పెడుతూ, కార్పొరేట్లను పెంచి పోషించి పేదల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో ఆ పార్టీ మూడోసారి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కులగణన సర్వే చేసి బీసీలకు 42 % రిజర్వేషన్ బిల్లులను తీసుకురావడం ద్వారా సీఎం రేవంత్ బీసీల పట్ల తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని, ప్రజల ఆకాంక్షల మేరకే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ప్రాంగణంలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



మహనీయుల త్యాగాలే మార్గదర్శకం

- కొన్ని పార్టీలవి దేశ వ్యతిరేక కార్యక్రమాలు: రాంచందర్‌రావు
- దేశ హితాన్ని విస్మరించి రాజకీయాలు సరికాదు:కిషన్‌రెడ్డి

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయులు, పోరాట యోధుల త్యాగాలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు దేశ, రాజ్యాంగ వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నాయని.. రైతులు, యువత ప్రయోజనాలకు వ్యతిరేక విధానాలు కొనసాగిస్తున్నాయని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. కాగా, రాజకీయాలకు అతీతంగా కలసికట్టుగా పనిచేస్తేనే భారతదేశాన్ని విశ్వగురుగా మార్చగలమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. దేశ హితాన్ని విస్మరించి కొందరు రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కిషన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.



మళ్లీ బానిసత్వంలోకి నెడుతున్న కాంగ్రెస్: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలకులు తెలంగాణను మళ్లీ బానిసత్వంలోకి నెడుతున్నారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. ప్రతి చిన్న పనికి ఢిల్లీ వైపు చూడాల్సిన దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం కేటీఆర్ ఈ మేరకు మాట్లాడారు. ఢిల్లీ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల నిర్వాకం వల్ల సంక్షేమం, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం వెనుకబడిపోయిందని, ఐటీ పరిశ్రమలు తరలిపోతున్నాయని కేటీఆర్ ఆరోపించారు.

చిట్టచివరి వ్యక్తికి సైతం న్యాయం అందాలి

- పంద్రాగస్టు వేడుకల్లో చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్

మహాత్మాగాంధీ పేర్కొన్న విధంగా వరుసలో నిలబడ్డ చిట్టచివరి వ్యక్తికి సైతం న్యాయం అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు. హైకోర్టులో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన మాట్లాడుతూ గతేడాది హైకోర్టులో కొత్తగా 74,768 కేసులు దాఖలు కాగా 72,414 కేసులు పరిష్కరించామని తెలిపారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహా రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ ప్రసంగించారు



ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్‌కు రూ.కోటి చెక్కును సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు-నాటు పాటకు ఆస్కార్ అవార్డు వచ్చిన సందర్భంగా.. ఆ పాట పాడిన రాహుల్‌కు నజరానా అందజేస్తామని గతంలోనే సీఎం రేవంత్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం రూ.కోటి చెక్కును అందజేశారు. అలాగే, పోలీసు శాఖలో పని చేసే పలువురు అధికారులను మెడల్స్‌తో సత్కరించారు.



నీటి వాటాల్లో రాజీ పడం

ఒత్తిడికి లొంగం.. కుట్రలకు బెదరం.. సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన: సీఎం రేవంత్

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను సాధించడంలో రాజీ పడే సమస్యే లేదని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రజల భావోద్వేగం, పేగు బంధం... సాగు నీటి ప్రాజెక్టులని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు రావాల్సిన ప్రతి నీటి చుక్కను సాధిస్తామన్నారు. ఎవరి ఒత్తిడికి లొంగబోమని, ఎవరి కుట్రలకు బెదరబోమని స్పష్టం చేశారు. 4 కోట్ల మంది ప్రజల పక్షాన నిటారుగా నిలబడి కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులను సాధించుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో స్వాతంత్ర్య వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరాంసాగర్ వంటి బృహత్తర ప్రాజెక్టులు కాంగ్రెస్ హయాంలో నిర్మించినవేనని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం, కూలడం, రూ.లక్ష కోట్లు గోదావరిలో కలవడం.. అన్నీ మన కళ్ల ముందే జరిగాయని ధ్వజమెత్తారు. అందుకే ఆ పార్టీ నాయకులు మరోసారి సెంటిమెంట్‌ను రగిల్చి.. రాజకీయ ప్రయోజనం పొందడానికి కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి బాధ్యత, అవగాహన ఉందని, ప్రాజెక్టులకు అనుమతులు తెచ్చుకోవడానికి అవసరమైన ప్రణాళికలూ ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ, పాలమూరు-రంగారెడ్డి, డిండి వంటి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేసి, తెలంగాణను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దే బాధ్యత ప్రజాప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. పూర్తి ప్రసంగం ఆయన మాటల్లోనే..

సంక్షేమానికి కేరాఫ్ కాంగ్రెస్ పాలన

"గత ఉగాది నుంచి ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. రూ.13 వేల కోట్లతో, 3.10 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. ఈ రోజు ధనికులతో సమానంగా పేదవారు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నారు. ఇది కేవలం ఆకలి తీర్చే పథకం కాదు. ఆత్మగౌరవాన్ని చాటి చెప్పే పథకం. రేషన్‌కార్డులు.. ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక. ఒక భరోసా. ఇందుకోసం రాష్ట్ర ప్రజలు పదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూశారు. ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఆ ఎదురు చూపులకు పరిష్కారం లభించింది. ఈ ఏడాది జూలై 14 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. పదేళ్ల తర్వాత పేదల సొంతింటి కలలకు మళ్లీ రెక్కలు తొడిగాం. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు మంజూరు చేశాం. ఇందుకోసం రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నాం. ఈ ఏడాదే 4.50లక్షల ఇళ్లు పూర్తి చేయబోతున్నాం. రాష్ట్ర రైతులకు ఇచ్చిన మాట ప్రకారం గత ఏడాది ఆగస్టు 15న రుణమాఫీకి శ్రీకారం చుట్టాం. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు రూ.20,616కోట్ల మేర రుణాలను మాఫీ చేసి, కొత్త చరిత్రను లిఖించాం. 'ఇందిరమ్మ రైతు భరోసా' కింద ఎకరాకు రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాం. ఇటీవల తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్ల సొమ్మును రైతుల ఖాతాల్లో వేశాం. 7,178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొన్నాం.మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నదాతల సంక్షేమానికి రూ.1.13లక్షల కోట్లను ఖర్చు చేశాం.



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

సమగ్ర కుల గణన సర్వే ఆధారంగా స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని నిర్ణయించాం. ఈ మేరకు బిల్లులను రూపొందించగా, ఈ ఏడాది మార్చి 17న శాసనసభ ఆమోదించింది. బీసీ రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని కేంద్రాన్నీ కోరాం. అలాగే, దేశంలో ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం తెలంగాణనే. ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. రూ.2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నాం. రాష్ట్రంలో అనేక చోట్ల వైద్య విద్యా కళాశాలలు నిర్మిస్తున్నాం. మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఈ పథకం కింద ఆడబిడ్డలకు రూ.6,790 కోట్లు ఆదా అయ్యాయి. ఇటీవలే 200 కోట్ల జీరో టికెట్ల మైలురాయిని దాటడం మా విజయాల్లో మరో మైలురాయి. గత పదేళ్లలో యువతను మత్తుకు బానిసలను చేసే కుట్ర జరిగింది. ఆ కుట్రను మేం ఛేదించాం. ఇవ్వాళ తెలంగాణలో డ్రగ్స్ మాట వినబడటానికి వీలు లేదు. 20 నెలల్లోనే దాదాపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే చర్యల్లో భాగంగా ఇటీవల ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించాం. 2047నాటికి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చే గేమ్ చేంజర్ పాత్రలో తెలంగాణ కీలకంగా ఉండాలన్న సంకల్పం మాది. 2035 నాటికి ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న మహత్తర సంకల్పమే 'తెలంగాణ రైజింగ్ 2047'. హైదరాబాద్‌ను స్వచ్ఛమైన, శుభ్రమైన, సౌకర్యవంతమైన నగరంగా తీర్చిదిద్దాలని మా ప్రభుత్వం భావిస్తోంది. ఆ ఆలోచన నుంచి ఏర్పాటైనదే హైడ్రా. చెరువుల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను నిరోధించాలన్న ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకువచ్చాం. ఈ రోజు రూ.30వేల కోట్ల విలువైన భూములను హైడ్రా కాపాడింది. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ.. ఇవి నాకు రెండు కళ్లు. మన పిల్లల భవితకు ఇవి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయనడంలో సందేహం లేదు" అని తెలిపారు.

వారసత్వ అప్పు రూ.8,21,651 కోట్లు

గత పాలకులు మాకు వారసత్వంగా రూ.8,21,651కోట్ల అప్పును మిగిల్చి వెళ్లారు. ఇందులో అప్పులు రూ.6,71,757 కోట్లు కాగా, ఉద్యోగులు, పథకాలకు సంబంధించిన బకాయిలు రూ.40,154కోట్లు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, సింగరేణి, విద్యుత్ ఇతర విభాగాలకు చెల్లించాల్సిన బకాయిలు రూ.1,09,740కోట్లు. ఇంత ఆర్థిక భారం ఉన్నప్పటికీ శూన్యం నుంచి శిఖరానికి రాష్ట్రాన్ని తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నాం. 'మనసుంటే మార్గం ఉంటుంది'అనే సూక్తిని నేను విశ్వసిస్తాను. మాకు విల్ ఉంది... తెలంగాణ రైజింగ్-2047 మా విజన్. ప్రపంచ వేదికపై తెలంగాణను నంబర్‌వన్‌గా నిలబెట్టడమే మా లక్ష్యం. అంత వరకు విశ్రమించబోం.





ఉల్లాసంగా.. ఉత్సాహంగా

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు

- రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం' కార్యక్రమానికి హాజరైన సీఎం
- స్పీకర్, మండలి చైర్మన్ సహా పలువురు ప్రముఖుల హాజరు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన 'ఎట్‌హోం' కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం సాయంత్రం ఇచ్చిన తేనీటి విందుకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, బండారు దత్తాత్రేయ, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కె. రాంచందర్ రావు, ఎంపీలు కె. లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. శుక్రవారం గవర్నర్ పుట్టినరోజు కూడా కావటంతో.. సీఎం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ గీతాలాపన అనంతరం అతిథులు తేనీటి విందును స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన అతిథుల వద్దకు గవర్నర్, సీఎం ఇద్దరూ స్వయంగా వెళ్లి పలకరించారు. కాగా, ఈ కార్యక్రమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి ఎవరూ హాజరుకాకపోవటం చర్చనీయాంశంగా మారింది.

హిందూ సమాజాన్ని చీల్చేందుకే

'మార్వాడీ గో బ్యాక్' కుట్ర!

- కమ్యూనిస్టుల ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ డ్రామాలివి
- పాతబస్తీని రోహింగ్యాలు ఐఎస్ఐ అడ్డాగా మార్చారు.. వారిపై మాట్లాడరేం?
- మటన్, డ్రై క్లీనింగ్ షాపులు ఒక వర్గం వారే నిర్వహిస్తుంటే నోరు మెదపరా?
- రోహింగ్యాల గో బ్యాక్ అంటూ మేం ఉద్యమం చేస్తాం: బండి సంజయ్

యూసుఫ్‌గూడ/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మర్వాడీ గో బ్యాక్ పేరుతో హిందూ సమాజాన్ని చీల్చే కుట్రలు మొదలయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. మార్వాడీలు వ్యాపారం చేసుకుంటే తప్పేముందని ప్రశ్నించారు. హిందూ సనాతన ధర్మం పరిరక్షణకు మార్వాడీలు పాటుపడుతున్నారని చెప్పారు. మార్వాడీలు రాష్ట్రాన్ని దోచుకోలేదని, ఎన్నడూ అధికారం కోసం పాకులాడలేదని, వ్యాపారాలతో సంపద సృష్టించారని.. అలాంటిది వారు ఎందుకు తెలంగాణ నుంచి వెళ్లిపోవాలి? అని ప్రశ్నించారు. మటన్ షాపులు, డ్రై క్లీనింగ్ షాపులను ఓ వర్గం వారే నిర్వహిస్తూ హిందూ కుల పుత్రులను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ఇతర దేశాల నుంచి వచ్చిన రోహింగ్యాలు పాతబస్తీని ఐఎస్ఐ అడ్డాగా మార్చారని.. వారి గురించి ప్రశ్నించకుండా.. ఈ దేశానికే చెందిన మార్వాడీల గురించి మాట్లాడతారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్. 'మార్వాడీ గోబ్యాక్' ఉద్యమాలు చేస్తే.. హిందు కులపుత్రులను కాపాడుకునేందుకు, అలాగే రోహింగ్యాలకు వ్యతిరేకంగా రోహింగ్యాల గోబ్యాక్ ఉద్యమం చేస్తామని చెప్పారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలో శుక్రవారం సాయంత్రం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హర్ ఘర్ తిరంగా ర్యాలీ' కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతో కలిసి బండి సంజయ్ పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా వెనుక రామచందర్‌రావును కూర్చోబెట్టుకుని బండి సంజయ్ బులెట్ నడిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "మటన్ ఎవరు కొట్టాలి? హిందువులైన కటికోళ్లు కొట్టాలి. రజకులు బట్టలుతుకుతారు. కానీ ఇక్కడేం జరుగుతోంది? నయీం మటన్ షాపు, సలీం డ్రైక్లీనింగ్ షాపులు పెడుతున్నారు. దీనిపై ఎవ్వరూ స్పందించడం లేదు" అని బండి వ్యాఖ్యానించారు. 'మార్వాడీ గోబ్యాక్' అనేది కమ్యూనిస్టుల ముసుగులో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ కలిసి ఆడుతున్న నాటకం అని విమర్శించారు. కాగా జాబితాలోంచి ఓట్లను తొలగించడం, చేర్చడం అనేది ఎన్నికల సంఘం పని అని.. దాంతో బీజేపీకి ఏ సంబంధం? అని ప్రశ్నించారు. నిజానికి 'ఓట్ల చోరీ' బీజేపీ చేతుల్లోనే ఉంటే పార్టీకి 240 ఎంపీ సీట్లు మాత్రమే ఎందుకు వస్తాయి? అన్ని సీట్లలోనూ గెలిచివేళ్లం కదా? తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీయే అధికారంలోకి వచ్చేది కదా? అని ప్రశ్నించారు. "మీరు గెలిస్తే ప్రజాస్వామ్యం.. ఓడిపోతే ఓట్ల చోరీ జరిగినట్లా?" అని కాంగ్రెస్‌ను నిలదీశారు.



యూసుఫ్‌గూడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో కలిసి తిరంగా ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



స్వాతంత్ర్య వేడుకలకు ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వం

హైదరాబాద్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): గోల్కొండకోటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకలకు ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ నేతృత్వం వహించారు.కార్యక్రమాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. తెలంగాణ కేడర్ 2022 బ్యాచ్‌కు చెందిన చిత్తరంజన్ గతంలో ప్రజాపాలనా వేడుకల్లోనూ సెర్మోనియల్ పెరేడ్‌కు నాయకత్వం వహించారు.

నియోజకవర్గానికి నిధులిస్తే చాలు

» మంత్రి పదవి ఇవ్వకున్నా పర్వాలేదు: రాజగోపాల్‌రెడ్డి



చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తనకు మంత్రి పదవి రాకున్నా పర్వాలేదని, తన నియోజకవర్గ అభివృద్ధికి నిధులిస్తే చాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గంలో సీసీ రోడ్డు కాంట్రాక్టర్లకు ఒక్క రూపాయి నిధులు కూడా రావడం లేదని, సంబంధిత మంత్రి వద్దకు వందసార్లు తిరిగినా నిధులు రాలేదని వాపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరిలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరించాక రాజగోపాల్‌రెడ్డి ప్రసంగించారు. కాంట్రాక్టర్లు రోడ్డు పనులు చేయడం లేదని, బిల్లులు చెల్లిస్తేనే చేస్తామంటున్నారని చెప్పారు. బిల్లు మాత్రం సీఎం చేతిలో ఉందన్నారు. తాను ముఖ్యమంత్రిని, పార్టీని విమర్శించడం లేదని, నియోజకవర్గానికి నిధులు ఇస్తే చాలన్నారు. తన పదవిపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. పదవి వచ్చేటప్పుడే వస్తుందని, దానిని ఎవ్వరూ ఆపలేరని, ఆపితే తాను ఊరుకునే మనిషిని కాదన్నారు.

రాష్ట్ర వేడుకగా సర్వాయి పాపన్న జయంతి

» 18న వేడుకలకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఆగస్టు 18న రాష్ట్ర వేడుకగా నిర్వహించేందుకు బీసీ సంక్షేమశాఖ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 32 జిల్లాల్లో పాపన్న జయంతి వేడుకలను అధికారంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రస్థాయిలో బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన రవీంద్రభారతిలో వేడుకను ఘనంగా నిర్వహించనుంది. ఈ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి తెలిపారు.

ఏపీపీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) నియామకానికి సంబంధించి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణలో మొత్తం 118 ఏపీపీ పోస్టులను భర్తీ చేయనుండగా.. మల్టీజోన్-1లో 50, మల్టీజోన్-2లో 68 పోస్టులను భర్తీ చేయనున్నామని పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వీవీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్‌లోని రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌ను పూర్తిగా చదివి నిర్ణీత ఫార్మాట్‌లో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన ఐటీడీఏ పీవో సతీమణి

భద్రాచలం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్ సతీమణి మనీషా శుక్రవారం తెల్లవారుజామున ప్రభుత్వ ఆసుపత్రిలో పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఆమె గర్భం దాల్చిన నాటి నుంచి ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలోనే చెకప్ చేయించుకున్నారు. పురిటినొప్పులు రావడంతో గురువారం సాయంత్రం ఆసుపత్రికి తీసుకెళ్లగా సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిజేరియన్ ద్వారా ఆమెకు డెలివరీ చేశారు. ప్రస్తుతం తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. పంద్రాగస్టు రోజున తల్లిదండ్రులైన పీవో దంపతులకు వైద్యులు, సిబ్బంది, పలువురు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, సర్కారీ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు పీవో రాహుల్ దంపతులు చేసిన ప్రయత్నాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు దంపతులు ఆస్పత్రికి వెళ్లి అభినందించారు.

బంధువుల పెళ్లికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు

» రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి
» జడ్చర్ల వద్ద హైవే పై ఘటన
» లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
» నంద్యాలలో జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

జడ్చర్ల, రాయపర్తి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద 44వ నెంబరు జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున లారీని ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన ఘటన లో నలుగురు మృతిచెందారు. 13 మంది గాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప నుంచి సీజీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు సుమారు 35 మంది ప్రయాణికులతో గురువారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరింది. హైదరాబాద్‌లోని ప్రగతినగర్, మియాపూర్ ప్రాంతాలకు చెందిన ఐదుగురు కుటుంబ సభ్యులు బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వస్తూ ఈ బస్సు ఎక్కారు. వీరిలో డ్రైవర్ సీటు వెనుకభాగంలో కూర్చున్న వరుసకు అత్తాకోడళ్లు అయిన లక్ష్మీదేవి(60), రాధిక(48)లు సీట్ల మధ్య ఇరుక్కొని మృతి చెందారు. బస్సు డ్రైవర్ నరసింహ(50) తలకు పదునైన వస్తువు తగలడంతో తల తెగిపడింది. తీవ్రంగా గాయపడి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కడప పట్టణానికి చెందిన నరసింహ(25) మృతి చెందారు. మరో ప్రమాదం వరంగల్ జిల్లాలో జరిగింది. రాయపర్తి మండలం మైలారం గ్రామ శివారులో ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్, కండక్టర్‌తో పాటు 22 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం వద్ద లారీని ఢీ కొట్టిన ట్రావెల్స్ బస్సు

ముగ్గురిని కబళించిన రహదారి

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ సమీపంలో ఆల్ఫా ఇంజనీరింగ్ కళాశాల వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు ప్రైవేటు బస్సులు ఢీ కొనడంతో ముగ్గురు ప్రయాణికులు మృతి చెందారు. 27 మందికి గాయపడ్డారు. జగన్ ట్రావెల్స్ బస్సు, శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో శ్రీకృష్ణ ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న అనకాపల్లి జిల్లా గునుపుడి గ్రామానికి చెందిన కుసరాజు(25), జగన్ ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులు రాజమండ్రికి చెందిన వెంకటసాయి(22), సరూర్‌నగర్‌కు చెందిన అనంత గౌతమ్(23) అక్కడికక్కడే మృతి చెందారు.

నేడు, రేపు అతి భారీ వర్షాలు!

పలు జిల్లాలకు ఆరెంజ్, యెల్లో అలెర్ట్‌ల జారీ.. ఈ నెల్లో ఇప్పటివరకు 16.7 సెం.మీ. వర్షపాతం

» కృష్ణాలో భారీగా.. గోదావరి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద
» 2 వేల మిలియన్ యూనిట్లు దాటిన జలవిద్యుదుత్పత్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రంలో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ మేరకు రెండు రోజులకు పలు జిల్లాలకు ఆరెంజ్, యెల్లో అలెర్ట్‌లను జారీ చేసింది. శనివారం అన్ని జిల్లాల్లోనూ మోస్తరు వానలు పడతాయని.. ముఖ్యంగా ఆదిలాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జగిత్యాల, జనగామ, కరీంనగర్, సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇటు ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకు తెలంగాణవ్యాప్తంగా 167 మిల్లీమీటర్ల (16.7 సెం.మీ.) వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే ఈ 15 రోజుల సాధారణ వర్షపాతం 106 మిల్లీమీటర్లే.. అంటే సాధారణ వర్షపాతం కంటే అధిక వర్షపాతం ఇప్పటివరకు నమోదైంది. అలాగే ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆగస్టు 15 వరకు సాధారణ వర్షపాతం 464 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు 509 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం

కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద..

కృష్ణా ప్రాజెక్టులకు భారీగా వరద వచ్చి చేరుతుంటే.. గోదావరి ప్రాజెక్టులకు మాత్రం స్వల్పంగానే వస్తోంది. కృష్ణా బేసిన్‌లో శ్రీశైలం ప్రాజెక్టుకు శుక్రవారం 1.80 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 1.74 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నాగార్జునసాగర్‌కు 1.44 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... అంతే స్థాయిలో ఔట్‌ఫ్లో ఉంది. సాగర్ 14 గేట్ల నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. పులిచింతల ప్రాజెక్టుకు 1.55 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1.67 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. బేసిన్‌లో ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 15,380 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. వచ్చింది వచ్చినట్లే దిగువకు వదిలిపెట్టారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 21 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా... 19 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. జూరాలకు 1.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్‌ఫ్లో 68 వేల క్యూసెక్కులుగా ఉంది. ఇక గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్‌ఫ్లో 4,733 క్యూసెక్కులుగా ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 18 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఔట్ ఫ్లో 10,578 క్యూసెక్కులుగా ఉంది. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవ్వగా.. 28,857 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఇటు నిర్మల్ జిల్లాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతోంది. మధ్యాహ్నం వరకే ప్రాజెక్టులోకి 15,600 క్యూసెక్కుల వరద చేరింది. దీంతో ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్ చేతుల మీదుగా పూజలు నిర్వహించి.. ప్రాజెక్టు 2 గేట్లు ఎత్తి 8 వేల క్యూసెక్కులను విడిచిపెట్టారు. రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలతో ములుగు జిల్లాలోని బొగత జలపాతం పరవళ్లు తొక్కుతోంది. దీంతో భారీగా పర్యాటకులు వచ్చి వీక్షిస్తున్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల కింద శుక్రవారం రాత్రి నాటికి జలవిద్యుదుత్పాదన 2 వేల మిలియన్ యూనిట్లు దాటింది.



నాగార్జునసాగర్ గేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ఫ్యాన్సీ నెంబర్ల ఫీ భారీగా పెంపు!

» రవాణా శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ
» ఇకపై 9999 కావాలంటే లక్షన్నర కట్టాల్సిందే

హైదరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న కారు కొనుగోలు చేశాక కావాల్సిన నెంబరు కోసం వాహనదారులు ప్రయత్నిస్తుంటారు. ఫ్యాన్సీ నెంబరు కోసం ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకడుగు వేయరు. ఇలా ఫ్యాన్సీ నెంబరు కోసం ప్రయత్నించే వాహనదారుల్ని లక్ష్యంగా చేసుకుని రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వాటి ధరలు పెంచుతూ ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఫ్యాన్సీ నెంబర్ల కేటాయింపు ద్వారా రవాణా శాఖకు ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. ధరల పెంపుతో రవాణా శాఖకు ఈ ఆదాయం భారీగా పెరగనుంది. 1, 9, 6666, 9999, 8055 ఇలా సుమారు 100 వరకు ఫ్యాన్సీ నెంబర్లకు ఇకపై ప్రాథమిక ధర పెంచుతున్నారు. దానిపై అభ్యంతరాలు, సూచనలు, సలహాలు స్వీకరించిన తర్వాత త్వరలోనే పూర్తిస్థాయి నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అత్యంత ఫ్యాన్సీ నెంబరుగా వాహనదారులు భావించే 9999 నెంబరుకు ఇప్పటి వరకు ప్రాథమిక ధర(వేలం కోసం) రూ. 50 వేలు వసూలు చేసేవారు. ఆ మొత్తం చెల్లించి ఆన్‌లైన్ వేలంలో ఎవరు ఎక్కువ మొత్తానికి పాడుకుంటే వారికే ఆ నెంబరు కేటాయిస్తున్నారు. ఇకపై ఈ నెంబరుకు ప్రాథమిక ధర లక్షన్నరగా సవరించారు. 6666 నెంబరుకు ప్రస్తుతం రూ. 30 వేలు ప్రాథమిక ధర కాగా దాన్ని రూ. 70 వేలకు పెంచుతున్నారు. అలాగే ఫ్యాన్సీ నెంబర్లకు ప్రస్తుతం ఐదు స్లాబులు ఉన్నాయి. నెంబరును బట్టి ప్రాథమిక ధర వసూలు చేస్తున్నారు. రూ. 50 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలుగా ప్రస్తుతం ఉన్న ఈ ఐదు స్లాబుల్ని ఏడుకు పెంచారు. రూ. 1.50 లక్షలు, రూ. లక్ష, రూ. 50 వేలు, రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు, రూ. 6 వేలుగా వాటిని నిర్ణయించారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.